సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 252

శనివారం 3-12-2022



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'



జపాన్ ముందుకు..

నాకౌట్ దశకు చేరిన ఆసియా జట్టు ఓడినా.. స్పెయిన్ ముందంజ - 15లో



భారత్ టి20 జట్టులో అంజలి

ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌కు ఎంపికైన కర్నూలు జిల్లా అమ్మాయి - 15లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ప్రణాళిక మేరకే సంక్షేమాభివృద్ధి

వైఎస్సార్ జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ప్రజల ముంగిటకే సంతృప్తికరంగా సేవలు
- ఎక్కడా వివక్షకు తావివ్వకుండా చర్యలు
- సీబీఆర్ వద్ద లేక్ వ్యూ రెస్టారెంట్, బోటింగ్‌కు ప్రారంభోత్సవం
- చిత్రావతి రిజర్వాయర్‌లో బోటులో విహారం
- సుప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- పులివెందుల నియోజకవర్గం అభివృద్ధిపై సీఎం సమీక్ష

2లో



బోటులో నుంచి రిజర్వాయర్ అందాలు వీక్షిస్తున్న సీఎం వైఎస్ జగన్

957 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

461 పోస్టుల భర్తీకి ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌కు సవరణ

సాక్షి, అమరావతి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 957 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ శుక్రవారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఇటీవల 461 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. దానికి అదనంగా 496 పోస్టులను కలిపి మొత్తం 957 పోస్టులతో సవరించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. శుక్రవారం నుంచి దరఖాస్తు ఫారాలను http://cfw.ap.nic.in వెబ్ సైట్లో అందుబాటులో ఉంచారు. ఈ నెల ఎనిమిదో తేదీ వరకూ దరఖాస్తు ఫారాలు వెబ్‌సైట్లో ఉంటాయి. వీటిని డౌన్లోడ్ చేసుకుని భర్తీ చేసిన దరఖాస్తులను సంబంధిత రీజినల్ డైరెక్టర్ కార్యాలయాల్లో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాల్సి ఉంటుంది. జీఎన్ఎం (జనరల్ నర్సింగ్ మిడ్ వైఫర్)/ బీఎస్సీ (నర్సింగ్) కోర్సులు పూర్తి చేసి 42 ఏళ్లలోపు వయసున్న వారు

మిగతా 2వ పేజీలో ▶

'సాల్ట్' పేరిట ఉద్యోగాల వల

- ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణనిచ్చే సూపర్‌వైజర్, ఫీల్డ్ ఆఫీసర్ పోస్టుల పేరిట బురిడీ
- విజయవాడలో ఆల్ఫాబెట్ వెంచర్ పేరిట రెండేళ్లుగా నిరుద్యోగుల నుంచి వసూళ్లు
- రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో బాధితులు.. నిరుద్యోగులు లబోదిబో

2లో



ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో ఈడీ సోదాలు

- డైరెక్టర్లు, కోశాధికారి నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు..
- నిధులు కొల్లగొట్టి సొంత ఖాతాలకు మళ్లించిన అకాడమీ పెద్దలు
- అక్రమాల వెనుక టీడీపీ నేతల హస్తం

12లో

ఆంధ్రప్రదేశ్ పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేస్తాం

- వాయిదా కోరిన రామోజీ, మార్గదర్శి
- రెండు వారాలు వాయిదా వేసిన సుప్రీం ధర్మాసనం

2లో

క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రుల్లో డైట్ చార్జీల పెంపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో ఇన్ పేషెంట్‌లు, వారి సహాయకులు, వైద్యులకు డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందరు ఇన్ పేషెంట్లు, వారి సహాయకులకు డైట్ చార్జీని రూ.40 నుంచి రూ.80, ఇన్ పేషెంట్ (టీబీ, మెంటల్)కు రూ.56 నుంచి రూ.80, డ్యూటీ డాక్టర్‌లకు రూ.80 నుంచి రూ.100కు చార్జీలు పెంచారు. పదేళ్ల కిందట ఖరారు చేసిన డైట్ చార్జీలే ఇప్పటి వరకూ అమల్లో ఉన్నాయి. ఈ విషయాన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో డైట్ చార్జెస్ కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ సిఫార్సుల మేరకు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చార్జీలను ప్రభుత్వం పెంచింది. రోగులు, వైద్యులకు నాణ్యమైన ఆహారం అందించడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

మెడికల్ కాలేజీల్లో కొత్తగా డ్రెస్‌కోడ్ పెట్టలేదు: డీఎంఈ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదువుతోన్న వైద్య విద్యార్థులు, ఉద్యోగులకు దుస్తుల విషయంలో కొత్తగా ఎలాంటి నిబంధనలు జారీ చేయలేదని డీఎంఈ డాక్టర్ వినోద్ కుమార్ స్పష్టం చేశారు. పలు మీడియా చానళ్లలో వైద్య విద్యార్థులకు డ్రెస్ కోడ్ అంటూ వచ్చిన వార్తలను ఖండిస్తూ శుక్రవారం ప్రకటన ఇచ్చారు. ఇలాంటి వార్తలను విద్యార్థులు నమ్మ వద్దని సూచించారు.

చురుగ్గా ఖరీఫ్ ధాన్యం సేకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ చురుగ్గా సాగుతున్నట్లు పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ జి.వీరపాండియన్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో శుక్రవారం సాయంత్రానికి 89,307 మంది రైతుల వద్ద నుంచి రూ.1,001.02 కోట్ల విలువైన 4.90 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇందులో రూ.266.05 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రైతులు రవాణా, హమాలీ, గోనెసంచుల ఖర్చులు సొంతంగా పెట్టుకుంటే వాటిని కూడా ధాన్యం డబ్బులతోపాటు 21రోజుల్లో జమ చేస్తున్నామని పేర్కొన్నారు. గోనెసంచులు, హమాలీల ఖర్చుల నిమిత్తం సుమారు రూ.2 కోట్లు చెల్లించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

3 జిల్లాలకు డీఎంహెచ్‌వోల నియామకం

సాక్షి, అమరావతి: మూడు జిల్లాలకు డీఎంహెచ్‌వోలను నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. చిత్తూరు జిల్లాకు డాక్టర్ జి.ప్రకాశం, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు డాక్టర్ ఎం. దుర్గారావు దొర, విశాఖకు డాక్టర్ పి. జగదీశ్వర్ రావును నియమించారు.

పీపీఏ సీఈవోగా శివ్‌నందకుమార్

కేంద్ర జల్‌శక్తి శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో)గా శివ్‌నందకుమార్‌ను నియమిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. పీపీఏ సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న చంద్రశేఖర్ అయ్యర్‌ను సీడబ్ల్యూసీ చైర్మన్‌గా నియమించింది. ఈ నేపథ్యంలో ఇండస్ బేసిన్ ఆర్గనైజేషన్(ఐబీవో)కు నేతృత్వం వహిస్తున్న చీఫ్ ఇంజనీర్ శివ్‌నందకుమార్‌ను పీపీఏ సీఈవోగా నియమించింది. దేశంలో అనేక ప్రాజెక్టుల సర్వే పనులు, జాతీయ ప్రాజెక్టుల నిర్మాణంలోనూ శివ్‌నందకుమార్ కీలక భూమిక పోషించారు. కేంద్ర ప్రభుత్వం జమ్మూ–కశ్మీర్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉజ్ బహుళార్థక సాధక జాతీయ ప్రాజెక్ట్ సర్వే బృందానికి ఆయనే నేతృత్వం వహించారు. ప్రస్తుతం పంజాబ్‌లో రావి నదిపై షాపూర్ కండి జాతీయ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను శివ్‌నందకుమార్ పర్యవేక్షిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేస్తాం

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు కౌంటరు దాఖలు చేస్తామని మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావు సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు రెండు వారాలు గడువు ఇవ్వాలని, విచారణ వాయిదా వేయాలని కోరారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అంశంలో ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం, మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరిల ధర్మాసనం ముందుకొచ్చాయి. మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటరు దాఖలుకు సమయం కావాలని, విచారణ వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కూడా ధర్మాసనాన్ని కోరింది. ఈ మేరకు విచారణ వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

58.89 లక్షల మందికి రూ. 1,497.77 కోట్లు పంపిణీ

వలంటీర్ల ఆధ్వర్యంలో మరో మూడు రోజుల పాటు కొనసాగనున్న పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 58,89,520 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు రూ.1,497.77 కోట్లను ప్రభుత్వం పింఛన్ల రూపంలో పంపిణీ చేసింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి డబ్బులు అందిస్తున్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి పంపిణీకి గాను ప్రభుత్వం 62.31 లక్షల మందికి పింఛన్ల నగదు విడుదల చేయగా.. శుక్రవారం నాటికి 94.52% పంపిణీ పూర్తయింది. కాగా, అమరావతి రాజధాని ప్రాంత గ్రామాల్లో భూమి లేని పేదలకు ప్రభుత్వం సీఆర్‌డీఏ ద్వారా ఇచ్చే పింఛన్లను కూడా ఈ నెల నుంచి ప్రత్యేకంగా వలంటీర్ల ద్వారానే పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఐదో తేదీ వరకు వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పంపిణీ కొనసాగుతుందని సెర్ప్ అధికారులు వెల్లడించారు.



ఒంగోలు నగరం 9వ డివిజన్ ఇందిరాకాలనీలో షేక్ నాగూర్‌బీకి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేక్ బ్రహ్మాని



కర్నూలు జిల్లా మద్దికెరలో వృద్ధురాలు లక్ష్మీదేవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అశోక్



ఏలూరులో మండపాటి జయమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ యావన్‌కుమార్



అనంతపురంలో చికిత్స పొందుతున్న పద్మావతికి డయాలసిస్ పింఛన్ ఇస్తున్న రాయదుర్గం 30 వార్డు వలంటీర్ తిరుమలేష్



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భారతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రీనిజ

ప్రణాళిక మేరకే సంక్షేమాభివృద్ధి

వైఎస్సార్ జిల్లా పర్యటనలో సీఎం వైఎస్ జగన్



దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను సంతృప్తికరంగా ప్రజల గడప వద్దకే అందిస్తున్నామని చెప్పారు. ఈ వ్యవస్థ సక్రమంగా నడవాలంటే ఎక్కడా వివక్షకు తావివ్వకూడదని, పరిపాలన పారదర్శకంగా సాగినపుడే ప్రజా వ్యవస్థ పటిష్టంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ జిల్లాలో రెండు రోజుల పర్యటనకు గాను శుక్రవారం సతీమణి భారతితో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు సీఎం కడపకు చేరుకున్నారు. అనంతరం లింగాల మండలం పార్నపల్లె పరిధిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) వద్ద పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు గావించి, పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. తొలుత సీబీఆర్ వద్ద పర్యాటక శాఖ రూ.4.1 కోట్ల పాడా (పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) నిధులతో అధునాతనంగా నిర్మించిన వైఎస్సార్ లేక్ వ్యూ రెస్టారెంట్, అందులోని అతిథి గృహాలు, పార్కుతోపాటు రూ.1.5 కోట్లతో ఏర్పాటు చేసిన నాలుగు సీట్ల స్పీడ్ బోటు, 18 సీట్ల ఫ్లోటింగ్ జెట్టి, పర్యాటక బోటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన శిలా ఫలకాలను, లేక్ వ్యూ పార్కులో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. రిజర్వాయర్‌లో జలకళను, చుట్టూ ఆహ్లాదకరమైన పచ్చటి కొండల అందాలను తిలకిస్తూ కొద్దిసేపు సేద తీరారు. పాంటున్ బోటులో కూర్చొని కాసేపు రిజర్వాయర్‌లో షికారు చేశారు. లేక్ వ్యూ రెస్టారెంట్‌లో జిల్లా నీటి పారుదల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆ శాఖ అధికారులు జిల్లాలోని మేజర్ రిజర్వాయర్లు, ఇతర ప్రాజెక్టుల పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం పార్నపల్లెలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)ను సుప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పర్యాటకానికి అత్యంత అనువైన ఈ ప్రాంతంలో అన్ని రకాల వనరులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక శాఖ ద్వారా మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

నేడు వివాహ వేడుకకు హాజరు కానున్న ముఖ్యమంత్రి

తొలిరోజు పర్యటన అనంతరం శుక్రవారం రాత్రి ఇడుపులపాయలో బస చేసిన సీఎం వైఎస్ జగన్.. శనివారం ఉదయం పులివెందులలోని ఎస్పీ ఎస్ఆర్ కల్యాణ మండపంలో తన వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్ యాదవ్ కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు.

పేరు పేరున పలకరింపు..

పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులు, లింగాల మండల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం నేతలను పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. వారి నుంచి వినతులను స్వీకరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి గురించి వివరించారు. అవినీతి ఆశ్రిత పక్షపాతానికి తావు లేకుండా.. కుల, మత, వర్గ, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్న స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ఆ తర్వాత అందరితో ఫొటోలు దిగారు. సాయంత్రం 5.40 గంటలకు అక్కడి నుంచి ఇడుపులపాయకు చేరుకున్నారు. అక్కడికి విచ్చేసిన ప్రజాప్రతినిధులు, నేతలను పేరుపేరునా పలకరించారు. పలువురి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి లివర్ మార్పిడికి సీఎం భరోసా



చిన్నారి కష్టాన్ని తెలుసుకుంటున్న సీఎం జగన్

ఎదుటి వారి కష్టం వినాలే కానీ, వెంటనే స్పందించడంలో తన తర్వాతే ఎవరైనా అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు నిరూపించుకున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం చిగిచర్లకు చెందిన దివాకర్‌రెడ్డి దంపతుల మూడున్నరేళ్ల కుమారుడు యుగంధర్‌రెడ్డికి లివర్ దెబ్బతింది. చాలా మంది వైద్యుల వద్దకు తిరిగారు. ఈ క్రమంలో బెంగుళూరులోని సెయింట్ జాన్ ఆస్పత్రికి వెళ్లగా.. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని, పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దివాకర్‌రెడ్డి కుటుంబం అంత పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చించలేని పరిస్థితి. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని కలిశారు. ఆయన శుక్రవారం వైఎస్సార్ జిల్లా లింగాల మండలం పార్నపల్లెకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు బాధిత కుటుంబాన్ని తీసుకుని వచ్చారు. వీరి కష్టం విన్న సీఎం.. వైద్యానికి ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు. తక్షణమే బాలుడికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజును ఆదేశించారు. దీంతో దివాకర్‌రెడ్డి దంపతులు ఆనంద బాష్పాలతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

– సాక్షి ప్రతినిధి, కడప

ప్రొబేషన్ ఖరారుపై కసరత్తు

- సచివాలయాల రెండో విడత ఉద్యోగులపై కలెక్టర్లకు ఉత్తర్వులు
- 2021 రెండో విడత భర్తీలో దాదాపు 19 వేల మందికి ఉద్యోగాలు
- డిపార్ట్‌మెంట్ టెస్ట్ ఉత్తీర్ణులు కానివారికి 9 – 14 మధ్య మరో విడత పరీక్షలు

సాక్షి, అమరావతి: రెండో విడతలో భర్తీ చేసిన దాదాపు 19 వేల గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు కూడా నిర్ణీత సమయంలోనే నిబంధనల ప్రకారం ప్రొబేషన్ ఖరారు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జిల్లాల వారీగా అర్హుల జాబితా సిద్ధం చేయాలని సూచిస్తూ సచివాలయ శాఖ రెండు రోజుల క్రితం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి ఒకేసారి రికార్డు స్థాయిలో 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను కొత్తగా మంజూరు చేయడం తెలిసిందే. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా ఉద్యోగాల భర్తీని పూర్తి చేశారు. 2019 అక్టోబరు – నవంబర్ మధ్య నియామక పత్రాలు కూడా అందజేశారు. వారికి ప్రొబేషన్ ఖరారు చేసి మిగిలిన శాశ్వత ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పే స్కేల్‌తో కూడిన వేతనాలు అందజేస్తున్నారు. 2019 భర్తీ ప్రక్రియలో మిగిలిపోయిన ఉద్యోగాలకు వెంటనే 2020 జనవరిలో నోటిఫికేషన్ జారీ చేయగా లాక్‌డౌన్ కారణంగా రాత పరీక్షలను 2020 సెప్టెంబరులో నిర్వహించారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన అర్హులకు 2021 జనవరి నాటికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. రెండో విడత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లో దాదాపు 19 వేల మంది ఉద్యోగాలు పొందినట్టు అధికారవర్గాలు వెల్లడించాయి. వారికి నిబంధనల ప్రకారం 2023 జనవరి నాటికి రెండేళ్ల సర్వీసు కాలం పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం వారికి సైతం ప్రొబేషన్ ఖరారుకు సచివాలయ శాఖ రెండు నెలల ముందే కసరత్తు ప్రారంభించింది.

నాలుగు అంశాల ప్రాతిపదికన..

వీరి ప్రొబేషన్ ఖరారుకు నాలుగు అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. ప్రొబేషన్ ఖరారు నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండడంతో పాటు ఏపీపీఎస్సీ నిర్వహించే డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ప్రొబేషన్ ఖరారుకు ముందు రెండేళ్ల సమయంలో ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలకు పాల్పడకూడదు. ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కారాదు. ఇప్పటికే పోలీసు తనిఖీ ప్రక్రియ పూర్తి కాగా ఇంకా ఎక్కడైనా మిగిలిపోతే వెంటనే పూర్తి చేయాలని సూచిస్తూ సచివాలయ శాఖ ఇప్పటికే లేఖ రాసింది. నాలుగు అంశాల ప్రాతిపదికన జిల్లాల వారీగా ప్రొబేషన్ ఖరారుకు అర్హుల జాబితా సిద్ధం చేయాలని సచివాలయ శాఖ తాజాగా కలెక్టర్లకు పంపిన లేఖలో పేర్కొంది.

9 –14 తేదీల మధ్య డిపార్ట్‌మెంట్ టెస్టులు..

ఇప్పటివరకు డిపార్ట్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణులు కాని సచివాలయాల ఉద్యోగుల కోసం ఏపీపీఎస్సీ డిసెంబరు 9 – 14 తేదీల మధ్య మరోసారి రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నెలాఖరుకు ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. 2019లో మొదటి విడతలో ఉద్యోగాలు పొందిన వారిలో 3 – 4 వేల మంది రెండేళ్ల సర్వీసు పూర్తి చేసినా డిపార్ట్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణులు కాకపోవడంతో ప్రొబేషన్ ఖరారుకు అర్హత పొందలేదు. వీరంతా ఇప్పుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనున్నారు.

గవర్నర్‌ను కలిసిన జవహర్‌రెడ్డి, సమీర్‌శర్మ





సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కొత్తగా నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సమీర్‌శర్మ శుక్రవారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను విజయవాడలోని రాజ్‌భవన్‌లో వేర్వేరుగా కలిశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజయవాడలో ఆదివారం నిర్వహించనున్న పౌర సన్మాన వేడుక ఏర్పాట్ల గురించి గవర్నర్‌కు కేఎస్ జవహర్‌రెడ్డి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులు అందరికీ అందేలా చూడాలని సీఎస్‌కు గవర్నర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చేపడుతున్న చర్యలను గవర్నర్‌కు సమీర్‌శర్మ వివరించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తదితరులున్నారు.

దుర్గమ్మ సేవలో సీఎస్

సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. సీఎస్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా.. ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందించారు.

ఆరోగ్య మిత్రల సేవలకు ప్రభుత్వం గుర్తింపు

- ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి అవార్డులు
- మార్గదర్శకాలు జారీ చేసిన వైద్య, ఆరోగ్య శాఖ

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆరోగ్య మిత్రల సేవలను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం గుర్తిస్తూ వారికి శుభవార్త తెలియజేసింది. విధి నిర్వహణలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆరోగ్య మిత్రలకు అవార్డులు ప్రదానం చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం విడుదల చేశారు. సేవా మిత్ర, సేవా రత్న, ఉన్నత ఆరోగ్య సేవ.. ఇలా మూడు కేటగిరీలుగా ఆరోగ్య మిత్రలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. 15 అంశాల్లో 100 మార్కుల ప్రాతిపదికన రూపొందించిన చెక్ లిస్ట్ ఆధారంగా అవార్డులకు ఎంపిక చేస్తారు.

అవార్డుల ప్రదానం ఇలా..

- సేవా మిత్ర అవార్డును 26 జిల్లాల్లో జిల్లాకు ఒకరికి చొప్పున ప్రదానం చేస్తారు. ప్రతి నెలా జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా ఈ అవార్డులు ఇస్తారు. రూ.5 వేలు ప్రోత్సాహకం ఇస్తారు. ఆర్థిక ప్రోత్సాహకాల కోసం ఏటా రూ.15.60 లక్షలను ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.
- సేవా రత్న అవార్డును ఏటా 26 జిల్లాల్లో జిల్లాకు ముగ్గురికి ఇస్తారు. ఈ అవార్డ్ కింద రూ.10 వేలు అందిస్తారు. అవార్డ్ కోసం ఏటా రూ.7,80,000 ఖర్చు చేస్తారు.
- ఉన్నత ఆరోగ్య రత్న అవార్డును ఏటా 26 జిల్లాల నుంచి జిల్లాకు ఒకరికి ఇస్తారు. వీరికి రూ.30 వేల చొప్పున ప్రోత్సాహకం ఉంటుంది. సేవా రత్న, ఉన్నత ఆరోగ్య రత్న అవార్డులను ఏటా ఏప్రిల్ ఒకటిన డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆవిర్భావ దినోత్సవం నాడు రాష్ట్ర కార్యాలయంలో ప్రదానం చేస్తారు.

957 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

▶ మొదటి పేజీ తరువాయి

అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, విభిన్న ప్రతిభావంతులకు 10 ఏళ్ల పాటు వయో పరిమితిలో సడలింపునిచ్చారు. దరఖాస్తు రుసుమును ఓసీ అభ్యర్థులకు రూ. 500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రూ. 300గా నిర్ణయించారు. మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఈ నోటిఫికేషన్ ద్వారా రూపొందించే మెరిట్ లిస్ట్‌ను వచ్చే ఏడాది ఆగస్టు వరకు పరిగణనలోకి తీసుకుంటారు. ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరులకు కొరత లేకుండా ఉండేందుకు గత మూడున్నరేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో 46 వేలకు పైగా పోస్టులను ఈ ప్రభుత్వం భర్తీ చేయడం గమనార్హం.

జోన్ల వారీగా స్టాఫ్ నర్సు పోస్టుల ఖాళీలు

జోన్ 1	163
జోన్ 2	264
జోన్ 3	239
జోన్ 4	291
మొత్తం	957

'సాల్ట్' పేరిట ఉద్యోగాల వల



సాక్షి, విజయవాడ ప్రతినిధి/సాక్షి, అమరావతి: ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు వసూలుచేసి బోర్డు తిప్పేసిన బాగోతమిది. కేంద్ర ప్రభుత్వం 'సాల్ట్' అనే పథకాన్ని ప్రవేశపెడుతోందనీ, దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు ఫీల్డ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లను నియమిస్తున్నామంటూ బురిడీ కొట్టించి వందలాది మంది నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు దండుకుని మోసం చేసిన ఓ బోగస్ సంస్థ నిర్వాకమిది. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన ఇద్దరు బాధితులు విజయవాడలోని సంస్థ నిర్వాహకులను నిలదీయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలివీ..

'ఆల్ఫాబెట్ వెంచర్' పేరుతో..

విజయవాడ సూర్యారావుపేటలోని వేమూరి వారి వీధిలో 'ఆల్ఫాబెట్ వెంచర్' పేరుతో రెండేళ్ల క్రితం ఓ సంస్థ వెలిసింది. ఎడ్యుకేషనల్ బుక్స్ పబ్లికేషన్, డిజిటల్ అండ్ ఆబ్జెక్టివ్ బేస్డ్ లెర్నింగ్, పేపర్ అండ్ పేపర్ ప్రొడక్ట్స్, ప్రింటింగ్ అండ్ రీ ప్రొడక్షన్, మోషన్ పిక్చర్ ప్రొడక్షన్, రేడియో అండ్ టెలివిజన్, స్టాఫింగ్ రిక్రూట్‌మెంట్ ట్రెనింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, స్మార్ట్ లైటింగ్ సిస్టమ్, సీసీఎం ఎస్–ఐటీ–కంప్యూటర్స్ అండ్ రిలేటెడ్ సేవల పేరుతో సంస్థను ఏర్పాటుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని సర్వీసులను ఏజెన్సీలకు అప్పగిస్తాయని, ప్రభుత్వ కార్యకలాపాలను తమ సంస్థ ద్వారానే నిర్వహిస్తామని ఈ సంస్థ నిర్వాహకులు నిరుద్యోగులకు నమ్మబలికారు. సంస్థ నెలకొల్పిన వెంటనే కేంద్ర ప్రభుత్వం అమలుచేసే 'సాల్ట్' పథకానికి ఫీల్డ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లను నియమిస్తున్నామని మధ్యవర్తుల ద్వారా నిరుద్యోగులకు వల వేశారు. దీంతో విస్సన్నపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి మానేసిన చిన్నం మృత్యుంజయ అనే వ్యక్తి ఆయా ప్రాంతాల్లోని నిరుద్యోగులను ఆకర్షించాడు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు సాల్ట్ పథకంపై శిక్షణనిచ్చే కాంట్రాక్టును 'ఆల్ఫాబెట్ వెంచర్'కు కేంద్ర ప్రభుత్వం అప్పగించిందనీ, ఇందుకుగానూ ఫీల్డ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లను ఆ సంస్థ నియమిస్తుందని, 20 రోజుల శిక్షణ తరువాత నెలకు రూ.40 వేలు జీతం వస్తుందని అతను అందరినీ నమ్మించాడు.

ఉద్యోగానికి రూ.4 నుంచి రూ.6 లక్షలు వసూలు..

ఇక ఫీల్డ్ ఆఫీసర్, సూపర్‌వైజర్ ఉద్యోగానికి ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వసూలుచేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఇలా విజయవాడలోని ఆల్ఫాబెట్ సంస్థ ప్రతినిధులు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనే అనేకమంది నుంచి డబ్బులు వసూలుచేసినట్లు తెలుస్తోంది. చిన్నం మృత్యుంజయ ద్వారానే తమ నుంచి రూ. 8.20 లక్షలు వసూలు చేశారని ఇద్దరు బాధితులు చెబుతున్నారు. వీరిరువురూ ఎంఏ, పీహెచ్‌డీ చేసి విస్సన్నపేటలోని ప్రైవేటు పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్నారు. తాము గత ఏడాది సెప్టెంబర్‌లో డబ్బులు చెల్లించి 20 రోజులు శిక్షణ తీసుకున్నామని, ఆ తరువాత సంస్థ నిర్వాహకులు జీతం ఇవ్వకుండా మొహం చాటేశారని బాధితులు లబోదిబోమంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇలాగే..

మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా ఇలా బోగస్ సంస్థలు వెలిశాయని బాధితులు చెబుతున్నారు. జిల్లాకు ఓ పేరుతో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల్లోనూ ఏర్పాటుచేసి వందలాది మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలుచేసినట్లు తెలుస్తోంది. ఏలూరులో ఆదిత్య మ్యాన్‌పవర్ సొల్యూషన్స్, కాకినాడలో మ్యాట్రిక్స్ మ్యాన్‌పవర్ సొల్యూషన్స్, విశాఖపట్నంలో మరో పేరుతో సంస్థలను నెలకొల్పినట్లు బాధితుల కథనం. దీనిపై ఐసీడీఎస్ ఉద్యోగులను ఆరా తీస్తే.. తమ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమాన్ని ఏజెన్సీకి అప్పజెప్పలేదని స్పష్టంచేశారు.

ఉద్యోగాల పేరిట మోసపోవద్దు

సమగ్రశిక్ష వొకేషనల్ ట్రైనర్ పోస్టులు ఇప్పిస్తామని ఇప్పుడు కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దు. పాఠశాలల్లో వృత్తివిద్య కోర్సులు బోధించడానికి వొకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్, వొకేషనల్ ట్రైనర్లను నియమించుకుని పాఠశాలల్లో బోధిస్తారు. ఈ పోస్టులు పరిమిత కాలానికి మాత్రమే. కాబట్టి వీరి నియామకానికి సంబంధించి సమగ్రశిక్ష ఎటువంటి బాధ్యత వహించదు. ఇటువంటి వాటిపై ఫిర్యాదులను 'vocational.apsamagra@gmail.com' కు మెయిల్ చేయాలి.

– ఎస్. సురేష్‌కుమార్, సమగ్రశిక్షా రాష్ట్ర పథక సంచాలకుడు


SMART BAZAAR | SMART SUPERSTORE
వింటర్ సూపర్ సేవింగ్స్
వింటర్ లో ఉంటాయి భారీ పొదుపులు,
స్మార్ట్ తో చేయండి కొనుగోలు
ఇండియా గేట్ బాస్మతి రైస్ రోజానా 5 kg + ఫార్చ్యూన్ రైస్ బ్రాన్ హెల్త్ ఆయిల్ 5 ℓ
మా ధర ₹1199
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1570
ఆదా చేసకోండి ₹371
ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 ℓ
మా ధర ₹153
ఎమ్ఆర్‌పి ₹197
ఆదా చేసకోండి ₹44
డైలీ రైస్ 25 kg
మా ధర ₹1139
(₹45.56 /kg)
ఎమ్ఆర్‌పి ₹1200
ఆదా చేసకోండి ₹61
కనీసం 5% తక్కువ ఎమ్ఆర్‌పి పై*
+ ప్రతిరోజు అదనపు డిస్కౌంట్
*కిరాణా సరుకులన్నిటిపై
చక్కెర 1 kg ₹9* ప్రతిరోజు
*₹1499 మరియు అంతకంటే మించిన షాపింగ్‌పై
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
మా ధర ₹339/399
ఎమ్ఆర్‌పి ₹549 / ₹549
ఆదా చేసకోండి ₹210 / ₹150
కందిపప్పు/అర్హర్ దాల్ వాల్యూ 1 kg
మా ధర ₹114
మార్కెట్ ధర ₹123
ప్యారీస్ వైట్ లేబల్ షుగర్ 5 kg
మా ధర ₹203
(₹40.60 /kg)
ఎమ్ఆర్‌పి ₹275
ఆదా చేసకోండి ₹72
ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ వీట్ ఆటా 5 kg
మా ధర ₹259
ఎమ్ఆర్‌పి ₹318
ఆదా చేసకోండి ₹59
హెరిటేజ్ అగ్‌మార్క్ ఘీ గ్రేడ్ స్పెషల్ 1 ℓ
మా ధర ₹599
ఎమ్ఆర్‌పి ₹730
ఆదా చేసకోండి ₹131
గో చీస్ స్లైస్ ప్లేన్ 476 g
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹450
బిస్కెట్స్ పెద్ద ప్యాక్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 33% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹130 మొదలుకుని
టాటా టీ చక్రా గోల్డ్ డస్ట్ 500 g
ఆదా చేసుకోండి ₹55
ఎమ్ఆర్‌పి ₹390 మొదలుకుని
మా ధర ₹335 మొదలుకుని
బూస్ట్ 1 kg
ఆదా చేసుకోండి ₹100
ఎమ్ఆర్‌పి ₹575 మొదలుకుని
మా ధర ₹475 మొదలుకుని
చింగ్స్ సీక్రెట్ / స్నాక్‌టేక్ మసాలా నూడుల్స్ 240 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
50% వరకు తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹60 మొదలుకుని
నార్ క్లాసిక్ హాట్ అండ్ సోర్ వెజ్ సూప్ 43 g / థిక్ టొమాటో సూప్ 53 g
BUY 2 GET 1 FREE
ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹60 మొదలుకుని
డాబర్ హనీ 1 kg
ఆదా చేసుకోండి ₹126
ఎమ్ఆర్‌పి ₹475 మొదలుకుని
మా ధర ₹349 మొదలుకుని
వ్యాస్లీన్ / పాండ్స్ బాడీ లోషన్ 275 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదా చేసుకోండి ₹150 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹330 మొదలుకుని
మా ధర ₹180 మొదలుకుని
పియర్స్ ప్యూర్ అండ్ జెంటిల్ / డవ్ క్రీమ్ బ్యూటీ సోప్ 125 g x 3 యూనిట్ (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదా చేసుకోండి ₹50
ఎమ్ఆర్‌పి ₹252 మొదలుకుని
మా ధర ₹202 మొదలుకుని
డవ్ / సన్‌సిల్క్ / హెడ్ అండ్ షోల్డర్ / ట్రెసెమె షాంపు 340 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY 2 GET 1 FREE
ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹300 మొదలుకుని
సర్ఫ్ ఎక్సెల్ ఈజీ వాష్ పౌడర్ 1.5 kg
ఆదా చేసుకోండి ₹40
ఎమ్ఆర్‌పి ₹225 మొదలుకుని
మా ధర ₹185 మొదలుకుని
ఈజీ వింటర్ వాష్ 1 kg (2 గల ప్యాక్) (కిట్ ప్యాక్)
ఆదా చేసుకోండి ₹80
ఎమ్ఆర్‌పి ₹399
మా ధర ₹319
కోల్గేట్ స్ట్రాంగ్ టీత్ 500 g
ఆదా చేసుకోండి ₹70
ఎమ్ఆర్‌పి ₹266
మా ధర ₹196
క్రాంప్టన్ గ్రీవ్స్ ఇమ్మర్షన్ వాటర్ హీటర్
మా ధర ₹479
ఎమ్ఆర్‌పి ₹670
ఆదా చేసకోండి ₹191
బ్రాండెడ్ కెటిల్ 1.5 ℓ
మా ధర ₹749
ఎమ్ఆర్‌పి ₹1445
ఆదా చేసకోండి ₹696
హ్యాపీ లివింగ్ / సిగ్నేచర్ / రేమండ్ సింగిల్ అండ్ డబుల్ మింక్ బ్లాంకెట్
మా ధర ₹649 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹1299 మొదలుకుని
ఆదా చేసకోండి ₹650 మొదలుకుని
safari KAMILIANT ARISTOCRAT
హార్డ్ ట్రాలీ
కనీసం 70%
ఎమ్ఆర్‌పి: ₹6524 మొదలుకుని
సైజ్: 55, 65, 75 cm
4/8 వీల్స్ ట్రాలీ
3 సంవత్సరాల వారంటీ
హార్డ్ ట్రాలీ సెట్ ఆఫ్ 3
₹6499
ఎమ్ఆర్‌పి: ₹17030 మొదలుకుని
సైజ్: 55, 65, 75 cm
4/8 వీల్స్ ట్రాలీ
3 సంవత్సరాల వారంటీ
ఇయర్ ఎండ్ ఫ్యాషన్ సేల్
21st NOV 31st DEC
కనీసం 50% తగ్గింపు
*ఫోర్త్ అపారెల్ ట్రేడ్‌పై
SMART BAZAAR
గుంటూరు : శివ సిటీ సెంటర్, 7 వ లేన్, రింగ్ రోడ్, చంద్రమౌళి నగర్, ● కర్నూలు: రిలయన్స్ పెట్రోల్ స్టేషన్ పక్కన, నంద్యాల రోడ్, ● రాజమండ్రి: శ్యామలాంబ ఆలయ వీధి, ● తిరుపతి: BNR SV మాల్, STV నగర్, ఎయిర్ బై-పాస్ రోడ్.
వద్ద కూడా లభ్యం
SMART POINT
Pay with MobiKwik
GET FLAT ₹40* CASHBACK
*T&C Apply : Min Transaction of ₹750 | Valid Once Per User
Valid from 1st to 31st Dec 2022
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి
*షరతులు, నిబంధనలు వర్తిస్తాయి. బ్యాంకింగ్ మరియు వాలెట్ ఆఫర్స్ కేవలం స్మార్ట్ బజార్, స్మార్ట్ సూపర్ స్టోర్ మరియు స్మార్ట్ సూపర్ పాయింట్ మాత్రమే వెలుతుంది. ఆఫర్లు స్టాకులున్నంతవరకు వెల్లుతాయి. అన్ని ఆఫర్లూ ఎటువంటి ముందు నోటీసు లేకుండానే మార్పుకి లోబడి ఉంటాయి. చూపబడిన ప్రొడక్టుల చిత్రాలు/ ఫోటోగ్రాఫులు కేవలం నిదర్శనాపూర్వక ఉద్దేశానికి మాత్రమే. అన్ని ప్రొడక్టుల ఎంఆర్‌పిలు, అన్ని పన్నులూ కలుపుకుని. ఆఫర్లన్నీ 4 డిసెంబరు 2022 వరకు వెల్లుతాయి. అన్ని వివాదాలూ ముంబయిలోని న్యాయస్థానాల ప్రత్యేక న్యాయపరిధికి లోబడి మాత్రమే.

స్వాధీన పరచుకున్న మనస్సే మన బంధువు.
జయించలేని మనస్సే ప్రబల శత్రువు.
– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, డిసెంబర్, 3

పాపాయి... డిజిటల్ రూపాయి!

భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) మరో నవ శకానికి నాంది పలికింది. మొన్న గురువారం నుంచి వ్యక్తుల మధ్య ప్రయోగాత్మకంగా డిజిటల్ రూపీ వినియోగాన్ని ప్రారంభించింది. ముంబయ్, ఢిల్లీ, బెంగళూరు, భువనేశ్వర్‌లలోని నిర్ణీత వర్తకులు, కస్టమర్ల బృందాలకు ఈ డిజిటల్ కరెన్సీని అందుబాటులో ఉంచింది. వారు తమ మధ్య లావాదేవీలకు సాధారణ కరెన్సీ లాగే ఈ డిజిటల్ రూపీని వినియోగిస్తారు. ఈ పైలట్ ప్రాజెక్ట్‌తో లోటుపాట్లను గమనించి, మరింత మెరుగ్గా డిజిటల్ రూపీని విస్తృతస్థాయిలో అందరికీ అందుబాటులోకి తేవాలన్నది ప్రణాళిక. ఇలా సొంత 'కేంద్ర బ్యాంక్ డిజిటల్ కరెన్సీ' (సీబీడీసీ)తో నడుస్తున్న మరో 15 దేశాల సరసన భారత్ చేరుతోంది. సీబీడీసీతో కష్టనష్టాల్ని ఆర్బీఐ కొద్దికాలంగా పరిశీలిస్తోంది. ఓ వ్యూహంతో, దశలవారీ ఆచరణ కోసం చూస్తోంది.

సీబీడీసీ, లేదా డిజిటల్ రూపీ... డబ్బుకు ఎలక్ట్రానిక్ రూపమే! మరోమాటలో కేంద్ర బ్యాంక్ (మన దగ్గర రిజర్వ్ బ్యాంక్) జారీ చేసిన కరెన్సీనోట్లకు డిజిటల్ రూపం. చేతికి ఇచ్చిపుచ్చుకోని లావాదేవీలకు ఈ ఎలక్ట్రానిక్ డబ్బును వాడవచ్చు. రిజర్వ్ బ్యాంక్ త్వరలోనే డిజిటల్ కరెన్సీని తెస్తుందని ఈ ఏడాది బడ్జెట్‌లోనే కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. అందరూ వాడేందుకు అందుబాటులో ఉండే 'రిటైల్ సీబీడీసీ', నిర్ణీత ఆర్థిక సంస్థలే వాడేందుకు ఉద్దేశించిన 'టోకు సీబీడీసీ'– ఇలా సీబీడీసీ రెండు రకాలు. కేంద్ర బ్యాంక్ అండదండలతో నడిచే ఈ డిజిటల్ రూపీని నవంబర్ 1 నుంచి టోకు వ్యాపారంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ప్రభుత్వ బాండ్ల సెకండరీ మార్కెట్ ట్రేడింగ్‌కు దాన్ని వాడారు. ఇప్పుడు డిసెంబర్ 1 నుంచి చిల్లర వర్తక విభాగంలోకీ విస్తరించారు.

ఈ రిటైల్ ప్రయోగం తొలిదశకు 4 బ్యాంక్‌లను గుర్తించారు. అవి కోరినట్టు రూ. 1.7 కోట్ల విలువైన డిజిటల్ కరెన్సీని జారీ చేశారు. బ్యాంక్‌ల నుంచి డిమాండ్ పెరిగేకొద్దీ, మరింత డిజిటల్ రూపీని ఆర్బీఐ సృష్టిస్తుంది. వీధిలో వ్యాపారుల నుంచి ఆహార యాప్‌ల వరకు 50 వేల మంది వర్తకుల్నీ, కస్టమర్లనీ దీనిలో భాగం చేస్తున్నారు. కొద్దిరోజుల్లో మరిన్ని బ్యాంకులకూ, హైదరాబాద్ లాంటిచోట్లకూ విస్తరించనున్నారు. నిజానికి, డిజిటల్ రూపీ వ్యాలెట్... జేబులో పర్సు లాంటిదే. కాకపోతే యాప్‌తో డిజిటల్ రూపంలో, స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. క్యూఆర్ కోడ్‌తో చెల్లింపులు జరపాలి. మరి, ఇప్పటికే గూగుల్‌పే లాంటి డిజిటల్ వ్యాలెట్లతో 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేజ్' (యూపీఐ)లో చెల్లింపులు చేస్తున్నాం కదా? అక్కడ మొబైల్‌లో లింక్ చేసిన బ్యాంక్ ఖాతాలతో చెల్లింపులు జరపాలి గనక తెర వెనుక బ్యాంక్‌ల లాంటి మధ్యవర్తులకు బోలెడంత పని! ఇక్కడ మధ్యవర్తుల్లేని డిజిటల్ రూపీలో పర్సులోని నోట్లలా నేరుగా నగదు బదలీ అవుతుంది.

అయితే బిట్‌కాయిన్, ఈథెరియం లాంటి క్రిప్టోకరెన్సీలకు ఇది పూర్తి భిన్నం. 2008లో ఒక ఊహగా మొదలై, 2015లో తెరపైకొచ్చిన బిట్‌కాయిన్ సైతం పారదర్శకంగా, ప్రభుత్వ నియంత్రణ లేకుండా, అజ్ఞాతంగా సాగే డిజిటల్ కరెన్సీ కావాలనే భావన ముందుకు తెచ్చింది. కరోనా వేళ వందలాది క్రిప్టోకరెన్సీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. తీరా 2022కు వచ్చేసరికి అనుమానాస్పద లావాదేవీలతో ఆ కల చెదిరింది. క్రిప్టోలు కుప్పకూలి, ఇప్పటికి దాదాపు 1200 కోట్ల డాలర్ల మేర మదుపర్ల సొమ్ము ఆవిరై, కథ మారిపోయింది. ఒక్క మాటలో బ్లాక్‌చెయిన్ సాంకేతికతతో నడిచే వికేంద్రీకృత డిజిటల్ ఆస్తి – క్రిప్టో. దాని వికేంద్రీకృత స్వభావం, అలాగే బ్యాంకులు – ఆర్థిక సంస్థల లాంటి మధ్యవర్తులే లేని దాని నిర్వహణ వివాదాస్పదం. అందుకు భిన్నంగా సీబీడీసీ... సాక్షాత్తూ ఆర్బీఐ డిజిటల్ రూపంలో ఇచ్చే అధికారిక కరెన్సీ. దీనికి ప్రభుత్వపు అండ ఉంటుంది గనక విలువ మారదు. ఫోన్‌లో డిజిటల్ రూపీ ఉంటే చేతిలో కరెన్సీ నోట్లున్నట్టే!

ఆర్బీఐ ఇలా 'సీబీడీసీ'ని తేవడం ప్రశంసనీయమైన చర్యే. డిజిటల్ రూపీతో లావాదేవీల ఖర్చు తగ్గుతుంది. అధీకృత నెట్‌వర్క్‌ల పరిధిలో లావాదేవీలన్నీ ప్రభుత్వం ఇట్టే తెలుసుకోగలుగుతుంది. ప్రతిదీ చట్టాలకు లోబడి సాగుతుంది. దేశంలోకి డబ్బు ఎలా వస్తోంది, ఎలా పోతోందన్న దానిపై ప్రభుత్వానికి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలకూ, మెరుగైన బడ్జెట్‌కూ వెసులుబాటు లభిస్తుంది. భౌతిక కరెన్సీ నోట్లలా చిరిగిపోవడం, కాలిపోవడం, చేజారడం లాంటివేవీ ఉండవు గనక ఈ డిజిటల్ కరెన్సీ ఆయుఃప్రమాణం అనంతం. ఈ దెబ్బతో నగదు స్వరూప స్వభావాలు, విధులు సమూలంగా మారిపోతాయి. అన్నివర్గాలనూ ఆర్థికంగా కలుపుకొనిపోవడానికీ, చెల్లింపుల ప్రపంచంలో సామర్థ్యం తేవడానికీ సీబీడీసీ ప్రోద్బలమిస్తుంది. ఇప్పటికే ఉన్న రిజర్వ్ బ్యాంక్ 'ఆర్టీజీఎస్' విధానం, ఈ కొత్త సీబీడీసీ కలసి లావాదేవీల్లో పారదర్శకత, భద్రత తెస్తాయి.

కాలగతిలో డబ్బు తన రూపం మార్చుకొంటూ వచ్చింది. ఆర్థిక సంక్షోభాలతో పాటు అనేక వ్యవస్థాగత జాగ్రత్తలూ వచ్చాయి. ఆధునిక సాంకేతికతతో నూతన సహస్రాబ్దిలో ధనలక్ష్మి అనేక రూపాలు ధరించింది. కరెన్సీ నోట్లలా ముద్రించాల్సిన పని లేని డిజిటల్ రూపీతో ముున్ముందు మరిన్ని మార్పులు చూడనున్నాం. ప్రపంచవ్యాప్త అంగీకారంతో ప్రవాసీయులూ వినియోగించే వీలుంది గనక సరిహద్దులు చెరిగిపోనున్నాయి. యూపీఐ లాగా లావాదేవీలకు బ్యాంక్ ఖాతాతో పనిలేకపోవడం మరో సౌకర్యం. నవీన భారతావనిలో యూపీఐ చెల్లింపుల విజయగాథ ఆధునిక విధానాల పట్ల మనకు పెరుగుతున్న ఆసక్తికి తార్కాణం. ఇవాళ డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలో మనదే అగ్రస్థానం. అందుకే, సరైన సమయంలో పుట్టిన పాపాయి... మన డిజిటల్ రూపాయి!

జన్యుమార్పిడి పంటలకు ఊతమా?

విశ్లేషణ


దేవీందర్ శర్మ

భారత్‌కు వ్యతిరేకంగా వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌లో అమెరికా ఫిర్యాదు చేసింది. బియ్యం, ఆపిల్‌లతోపాటు అన్ని రకాల జన్యుమార్పిడి ఆహార దిగుమతులపై భారత్ నియంత్రణలు విధించడాన్ని ప్రశ్నించింది. జన్యుమార్పిడి ఆవాల పంటకు 'పర్యావరణ అనుమతులు' మన దేశంలో ఇచ్చినప్పుడే ఈ పరిణామాలు జరగడం గమనార్హం. సురక్షితం కాని జన్యుమార్పిడి ఆహార దిగుమతులను అనుమతించేలా మన చట్టాలను మార్చుకోమని బలవంత పెట్టడం కంటే... తమ దేశ వ్యవసాయ రంగాన్ని అమెరికా ఎందుకు సరిచేసుకోదు? క్యాన్సర్ కారకమన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న గడ్డిమందుల విషయంలోనూ అమెరికా వైఖరి ఇదే. తమకు జన్యుమార్పిడి మొక్కజొన్న వద్దని మెక్సికో కరాఖండీగా చెప్పింది. అంత స్పష్టత మన దేశానికీ ఉండాలి.

అభివృద్ధి చెందుతున్న దేశాలు జన్యుమార్పిడి పంటల దిగుమతికి అనుమతిచ్చేలా అమెరికా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఆహారంపై 'జన్యుమార్పిడి పంటలు కాదు' అన్న లేబుల్ తగిలించాలని భారత్ డిమాండ్ చేస్తూండటం అమెరికా వ్యవసాయ ఎగుమతులకు నష్టం కలిగిస్తోందని అమెరికా ఫిర్యాదు. ఈ పరిణామాలన్నీ భారత పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ జన్యుమార్పిడి ఆవాల పంటకు 'పర్యావరణ అనుమతులు' ఇచ్చినప్పుడే జరగడం గమనార్హం.

వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌లో అమెరికా ఫిర్యాదు చేసింది ఒక్క భారతదేశంపై మాత్రమే కాదు. అభివృద్ధి చెందుతున్న దేశాలు జన్యుమార్పిడి పంటలు, దిగుమతులు, టెక్నాలజీపై నిషేధం తొలగించేలా చేసేందుకు అమెరికా పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తోంది. యూరోపియన్ యూనియన్‌తోపాటు ఇండియా, మెక్సికో, కెన్యా, ఇండోనేసియాలను లక్ష్యంగా చేసుకుని పని చేస్తోంది.

మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ ఓబ్రడార్‌పై అమెరికా పెట్టిన ఒత్తిడి ఎంత తీవ్రంగా ఉందంటే– తమకు జన్యుమార్పిడి మొక్కజొన్న అస్సలు వద్దు. స్వేచ్ఛాయుతమైన, సార్వభౌమ అధికారులున్న దేశం కావాలని కరాఖండీగా చెప్పేంత. గత ఏడాది మెక్సికో ఒక అధ్యక్ష ఉత్తర్వు జారీ చేస్తూ... జన్యుమార్పిడీ మొక్కజొన్నను దశలవారీగా తొలగిస్తామని స్పష్టం చేసింది. హానికారక గ్లైఫోసేట్ వాడకాన్ని కూడా 2024 నాటికి నిషేధిస్తామని ప్రకటించింది. ఈ నిర్ణయాల ప్రభావం అమెరికా నుంచి దిగుమతి అవుతున్న కోటీ డెబ్బై లక్షల టన్నుల మొక్కజొన్నలపై ఉంటుంది.

మెక్సికో తన నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు మిగిలిన దేశాలు వ్యవహరించడం కష్టం. అశోకా యూనివర్సిటీ అసోసియేట్ అధ్యాపకుడు అనికేత్ ఆఘా ఇలాంటి వ్యవహారాన్ని వ్యవసాయ పెట్టుబడిదారీ విధానం అంటారు. కెన్యా వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి మోజెస్ కురియా చేసిన ప్రకటన అందరినీ నిర్ఘాంత పరిచింది. ''ఈ దేశంలో ఉన్నామంటే చావుకు సిద్ధమైన వ్యక్తిగా ఉన్నట్లే. చావుకు పోటీ పడుతున్నవాటికి జన్యుమార్పిడి పంటలను కూడా చేర్చడం తప్పేమీ కాదు. అందుకే ఉద్దేశపూర్వకంగానే ఈ దేశంలోకి జన్యుమార్పిడి పంటలను అనుమతించాం'' అన్నారు మోజెస్. ఆ తరువాత పదేళ్ల నిషేధాన్ని ఎత్తివేయడమే కాకుండా, ఆరు నెలలపాటు జీఎం మొక్కజొన్న, సాధారణ మొక్కజొన్నల దిగుమతులపై పన్నులను కూడా ఎత్తేశారు. ఈ ప్రకటన జరిగిన కొన్ని వారాల్లో 32 మంది సభ్యులున్న అమెరికా వాణిజ్య బృందం నైరోబీలో పర్యటించింది. మెక్సికో నిషేధం తరువాత అమెరికన్ రైతులపై ఉన్న జీఎం పంటల భారాన్ని కెన్యా కొంత భరిస్తుందని వారి నమ్మకం మరి.

ఇండొనేసియా విషయానికొస్తే... అక్కడ వ్యవసాయ సంబంధిత సంఘాల తీవ్ర వ్యతిరేకత మధ్య అధ్యక్షుడు జోకో వైడోడో దేశంలో



పడిపోతున్న సోయాబీన్ దిగుబడులు పెంచేందుకు జన్యుమార్పిడి పంటల సాగు చేపట్టాలనీ, అవసరమైతే జీఎం విత్తనాలను దిగుమతి చేసుకోవాలనీ అంటూండటం గమనార్హం.

అసురక్షితమైన, ప్రమాదాలతో కూడిన జన్యుమార్పిడి ఆహారపు దిగుమతులను అనుమతించేలా మన చట్టాలను మార్చుకోమని అమెరికా బలవంత పెట్టడం కంటే... తమ దేశంలో వ్యవసాయ రంగాన్ని ఎందుకు సరిచేసుకోదు? అమెరికా తన ప్రజల కోసం జన్యుమార్పిడి పంటలను సాగు చేసుకోవాలనుకుంటే మనకేమీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. కానీ... ఎగుమతి అవసరాల కోసం సాధారణ బియ్యం, ఆపిల్‌లను సాగు చేయడం ఎందుకు మొదలుపెట్టదు? యూరోపియన్ యూనియన్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు హానికారక జన్యుమార్పిడి పంటల నుంచి రక్షణకు చేసుకున్న ఏర్పాట్లను బలహీనపరచాలని అమెరికా ఎందుకు ఒత్తిడి చేస్తోంది? ఈ జన్యుమార్పిడి ఉత్పత్తులు గడ్డి మందులను తట్టుకోగలవు కాబట్టి. వీటిని వాడటం మొదలుపెడితే విషపూరితమైన కీటకనాశినుల విక్రయాలు గణనీయంగా పెరుగుతాయి. భారత్‌లో 2002లో బీటీ కాటన్ ప్రవేశించింది మొదలు పత్తిపై చల్లే కీటకనాశినుల ఖర్చు హెక్టారుకు 37 శాతం పెరిగింది.

సాధారణ మొక్కజొన్నల విషయంలో మెక్సికో డిమాండ్‌ను తాము తీర్చగలమని అమెరికాలోని రైతులు కొందరు ప్రకటించిన విషయాన్ని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ గుర్తుంచుకోవాలి. నిజానికి భారత్ కూడా అమెరికా నుంచి జన్యుమార్పిడి ఆహార దిగుమతులను అడ్డుకునే విషయంలో గట్టిగా నిలుస్తుందని భావిస్తున్నాను. అలా చేయగలిగితే సాధారణ పంటలవైపు మళ్లాల్సిందిగా అమెరికాలోని జీఎం రైతులకు ఒక స్పష్టమైన సందేశం పంపినట్లు అవుతుంది. ప్రపంచానికి కావాల్సింది కూడా అదే. పైగా అభివృద్ధి చెందుతున్న దేశాల భద్రత, ఆరోగ్యాన్ని కాపాడటం, ఆహార అవసరాలను తీర్చడం కంటే వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌కు అమెరికా వాణిజ్య ప్రయోజనాలు తీర్చడం ముఖ్యం కాబోదు. తమకు ఏది అవసరం లేదో దాన్ని విస్పష్టంగా చెప్పే హక్కు ఆయా దేశాలకు ఉండాలి. ఈ అంశాల్లో బలహీనంగా ఉన్న కారణంగానే చాలా దేశాలు వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌కు దూరంగా జరుగుతున్నాయి.

అమెరికా ఈ వైఖరి ఒక్క జన్యుమార్పిడి ఆహారానికే పరిమితం కాదు. క్యాన్సర్ కారకమన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న గడ్డి మందుల విషయంలో వందల కోట్ల డాలర్ల జరిమానాలు పడ్డా, వేల సంఖ్యలో కోర్టు కేసులు ఎదుర్కొంటున్నా ఆ పరిశ్రమ ఎగుమతుల కోసం ఆతురతతో ఎదురు చూస్తోంది. ఈ కారణంగానే ఏమో... జీఎం టెక్నాలజీకి అనూహ్యంగా భారత్, కెన్యా, ఇండోనేసియాల్లో మంచి మద్దతు లభిస్తోంది. తక్కువ దిగుబడులిచ్చే జన్యుమార్పిడి ఆవాల విషయాన్నే తీసుకుందాం. భారత్‌లో ఇదో అర్థం లేని వంగడం.

భారత్ తన వంటనూనె అవసరాల్లో దాదాపు 55 శాతాన్ని దిగుమతుల ద్వారా పూర్తి చేసుకుంటోంది. ఈ దిగుమతులు సుమారు కోటీ ముప్పై లక్షల టన్నుల వరకూ ఉంటాయి. ప్రపంచంలో అత్యధిక వంటనూనె దిగుమతిదారుల్లో ఇటీవలే భారత్ రెండో స్థానానికి చేరింది. తగినంత వంటనూనె సొంతంగా ఉత్పత్తి చేసుకోలేక కాదు... ప్రభుత్వ ప్రాథమ్యాల్లో, విధానాల్లో తేడాలు ఇందుకు కారణం. చౌక దిగుమతులకు అనుమతులివ్వడం, దిగుమతి సుంకాలను తగ్గించడం సరేసరి. ఈ చర్యల ద్వారా వంటనూనెల విషయంలో స్వావలంబన సాధించేందుకు 1993 – 94లో మొదలుపెట్టిన పసుపు విప్లవం కాస్తా నిర్వీర్యమవుతోంది.

తక్కువ దిగుబడినిచ్చే జన్యుమార్పిడి ఆవాల వంగడాన్ని డీఎంహెచ్–11 అని పిలుస్తున్నారు. దీంట్లో కీటకనాశినులను తట్టుకునే మూడు జన్యువులుంటాయి. దీని ద్వారా హెక్టారుకు 2,626 కిలోల దిగుబడి వస్తుందని అంచనా. దాదాపు 3,012 కిలోలతో ఇప్పటికే డీఎంహెచ్–4 వంగడం డీఎంహెచ్–11 కంటే 14.7 శాతం ఎక్కువ దిగుబడి ఇస్తోంది. ఇలాంటివే ఇంకో నాలుగు వంగడాలు ఉండటం గమనార్హం. విచిత్రమైన విషయం ఏమంటే– డీఎంహెచ్–11 వంగడాన్ని అతితక్కువ దిగుబడినిచ్చే వరుణ వంగడంతో పోల్చి, తమది 25 – 30 శాతం ఎక్కువ దిగుబడి ఇస్తుందని చెప్పడం!

ఇంకోపక్క అందుబాటులో ఉన్న వంగడాలతోనే కొన్ని కొత్త టెక్నాలజీల సాయం (సిస్టమ్ ఆఫ్ మస్టర్డ్ ఇంటెన్సిఫికేషన్)తో మధ్యప్రదేశ్‌లో ఆవాల దిగుబడి హెక్టారుకు 4,693 కిలోల స్థాయికి తేగలమని ఇప్పటికే నిరూపితమైంది. ఎల్లో రివల్యూషన్‌ను మళ్లీ పట్టాలెక్కించేందుకు ఇలాంటి పద్ధతులను దేశవ్యాప్తంగా ప్రచారంలో పెట్టడం, సాగు విస్తీర్ణాన్ని ప్రోత్సహించడం అవసరం.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకింత డ్రామా?



రొటేషనల్ విధానంలో జీ–20 అధ్యక్షత ఇండియాకు రావడం తప్పనిసరి. గత అధ్యక్ష దేశాలు: యూఎస్ఏ, యూకే, కెనడా, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, మెక్సికో, రష్యా, ఆస్ట్రేలియా, టర్కీ, చైనా, జర్మనీ, అర్జెంటీనా, జపాన్, సౌదీ అరేబియా, ఇటలీ, ఇండోనేసియా. ఇందులో ఏదీ ఏడాది పదవికి ఇండియాలాగా హైవోల్టేజ్ డ్రామా చేయలేదు. మోదీని తెలివైన ఈవెంట్ మేనేజర్ అని అభివర్ణించారు అడ్వాణీ. జీ–20పై జరుగుతున్న హంగామా ఇదే చెబుతుంది. – జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ఎంపీ

ఏది నిజమైనది?



అంటే... ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్గానిస్తాన్ నిజమైన ఇస్లాం కాదు; ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ నిజమైన ఇస్లాం కాదు. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్) నిజమైన ఇస్లాం కాదు. అలాగైతే మరి 'నిజమైన' ఇస్లాం ఎక్కడున్నట్టు? నేను చూస్తున్నదల్లా ఇస్లాం 'వాస్తవం'. – యాస్మిన్ మొహమ్మద్, యాక్టివిస్ట్

సైకిళ్ల నగరం



పారిస్ మేయర్ ఆన్ హిడాల్గో అతి తక్కువ సమయంలో ప్యారిస్‌ను సైకిళ్ల నగరంగా మార్చేశారు. ప్యారిస్ ఎంత మెరుగైందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. తక్కువ దుమ్ము, తక్కువ శబ్దం, మరింత నాణ్యమైన జీవితం! – డేనియల్ మోసర్, విశ్లేషకులు

అయ్యో ఉదారులు



ట్విట్టర్‌ను ఎలన్ మస్క్ టేక్ ఓవర్ చేశారు. ఎన్డీటీవీలో అదానీ భాగాన్ని పెంచుకున్నారు. హిందువు యూకేకు ప్రధాని అయ్యారు. ఉదారవాదులకు ఇది గడ్డు సంవత్సరం. – కవిత, వ్యాఖ్యాత

ఇంత వేగమా?



అప్పుడే డిసెంబరా? గ్రహాల గతులను చూడండి. సరిగ్గా ఉన్నట్టు లేదు. మనం హ్యాపీ 2022 మెసేజులకు ఇంకా రిప్లైలు ఇవ్వడం పూర్తేకాలేదు! – పర్మీందర్ సింగ్, ఆంట్రప్రెన్యూర్

మాటల తూటాల అజాత శత్రువు

సందర్భం


తిరుమలగిరి సురేందర్

అరుదైన రాజకీయ నాయకుడు కొణిజేటి రోశయ్య. ఆయన వాగ్ధాటికి అసెంబ్లీ సమావేశాలు దద్దరిల్లేవి. గొప్ప హాస్య చతురతతో పాటూ ముక్కుసూటిగా మాట్లాడటం ఆయన శైలి. ప్రభుత్వ శాఖలన్నింటిపైనా అపారమైన పట్టు, అవగాహన ఆయనకున్నాయి. వివాదాలకు దూరంగా ఉంటూ, మంచి సలహాదారుగా కూడా వ్యవహరించేవారు. రాజనీతిలో అపర చాణక్యుడు. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన చిరునామా. మాటల మాంత్రికుడిగా వినుతికెక్కారు. తన ప్రసంగంతో ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధుల్ని చేయడమే కాదు, మాటల తూటాలు కూడా పేల్చేవారు. చట్టసభ లోపల, బయట కూడా ఒంటిచేత్తో ప్రతిపక్షాల్ని మాట తూలకుండా ఆటలాడుకునేవారు.

కొణిజేటి రోశయ్య 1933, జూలై 4న గుంటూరు జిల్లా వేమూరు గ్రామములో ఆదెమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించారు. గుంటూరు హిందూ కళాశాలలో కామర్స్ అభ్యసించారు. రోశయ్య ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు, కర్షక నాయకుడు ఎన్జీ రంగా శిష్యులు. నిడుబ్రోలులోని రామానీడు రైతాంగ విద్యాలయంలో సహచరుడు తిమ్మారెడ్డితో బాటు రాజకీయ పాఠాలు నేర్చారు.



ఆయన భారత జాతీయ కాంగ్రెసు పార్టీ తరఫున 1968, 1974, 1980లలో శాసన మండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. 1979లో టంగుటూరి అంజయ్య ప్రభుత్వంలో రవాణ, గృహనిర్మాణం, వాణిజ్య పన్నుల శాఖలు, 1982లో కోట్ల విజయభాస్కరరెడ్డి ప్రభుత్వంలో హోం శాఖ, 1989లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, రవాణ, విద్యుత్తు శాఖలు; 1991లో నేదురుమల్లి జనార్దనరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలు; 1992లో కోట్ల విజయభాస్కర రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలకు మంత్రిగా పనిచేశారు. 2004, 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ (ఆర్థిక ప్రణాళిక)ను ఇప్పటికి 15 సార్లు శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇందులో చివరి 7 సార్లు వరుసగా ప్రవేశపెట్టడం విశేషం. బడ్జెట్ కూర్పులో రోశయ్య ఘనాపాటిగా పేరు పొందారు. రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరు పొందారు. గ్రూపు రాజకీయాలకు దూరంగా, చాలా కాంగ్రెస్ కేబినెట్‌లలో కీలక మంత్రిగా పని చేయడం సామాన్య విషయం కాదు. తనకు అప్పగించిన ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వహించారు.

1995–97 మధ్యకాలంలో ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షుడిగా పనిచేశారు. 1998లో నరసరావుపేట నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 12వ శాసనసభకు చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 2007లో ఆంధ్ర విశ్వవిద్యాలయం రోశయ్యకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలిలో సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవమున్న రోశయ్య 2009, సెప్టెంబర్ 3 నుండి 2010 నవంబరు 24 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2011 ఆగస్టు 31న రోశయ్య తమిళనాడు రాష్ట్ర గవర్నరుగా ప్రమాణస్వీకారం చేశారు. 2016 ఆగస్టు 30 వరకూ తమిళనాడు గవర్నరుగా తన సేవలు అందించారు. ప్రతిపక్షంలో ఉంటే నెగటివ్ పాలిటిక్స్ చెయ్యొచ్చు. అదే ప్రభుత్వంలో ఉంటే, నిర్మాణాత్మకమైన పాత్రతో పాజిటివ్ పాలిటిక్స్ నడపచ్చు అనేవారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందడంతో 2009, సెప్టెంబర్ 3న రోశయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. పద్నాలుగు నెలలు అధికారంలో కొనసాగిన అనంతరం 2010 నవంబరు 24వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకున్న తరువాత ఆరోగ్యం సహకరించినప్పుడల్లా సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై అలరింపజేసేవారు. 2018 ఫిబ్రవరి 11న ఆదివారం నాడు టి. సుబ్బిరామిరెడ్డి లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్యను గజమాలతో సత్కరించి జీవన సాఫల్య పురస్కారం అందించారు.

ఆంధ్ర ఉద్యమంతో తన రాజకీయ జీవితం ప్రారంభమైందని రోశయ్య అనేవారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలు అందించిన సహకారంతోనే చట్టసభల్లో తగిన గుర్తింపు లభించిందని వినమ్రంగా చెప్పేవారు. తనకు దక్కిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ.. తనకు అప్పగించిన విధిని సక్రమంగా నిర్వహించానని తాను పాల్గొనే కార్యక్రమాలలో ఆత్మ సంతృప్తితో చెప్పేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ కాలంపాటు ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఘనత రోశయ్యదే.

కొణిజేటి రోశయ్య అనారోగ్యంతో బాధపడుతూ 2021 డిసెంబర్ 4న హైదరాబాదులో కన్నుమూశారు. ప్రజాజీవితంలో ఆయన ఒక మహోన్నత నేత. రాజకీయ విలువలు, అత్యున్నత సంప్రదాయాలు కాపాడడంలో ఓ రుషి మాదిరి సేవలందించారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్
(రేపు కె. రోశయ్య ప్రథమ వర్ధంతి)

వివక్ష ఉందంటే ఉలుకెందుకు?

స్పందన


ప్రొ॥ శ్రీపతి రాముడు

వివక్ష సృష్టికర్తలు, వివక్ష లేదని చెప్పడమో లేక దాన్ని తక్కువ చేసి చూపడమో చేస్తూ వుంటారు. అందులో భాగంగానే బాధితుల ఆక్రందనల్ని ప్రమాదకరమైన అలవాట్లుగా చూపిస్తుంటారు. ఈ మధ్య ఒక వైపు దళితుల మీద వివక్ష ఉందని చెబుతూనే మరోవైపు వివక్ష తీవ్రతనూ, పరిమాణాన్నీ పలుచన చేసి చూపించే ప్రయత్నాలు ఎక్కువయ్యాయి. నవంబర్ 17న 'సాక్షి'లో పి. కృష్ణమోహన్ రెడ్డి రాసిన 'ఇక్కడి వివక్షే కనిపిస్తుందా?' వ్యాసంలో ఈ ధోరణి కనిపిస్తుంది. ఆధారాల కంటే సొంత అవసరాలనే నిజాలుగా ప్రచారంచేసే పోస్ట్– ట్రూత్ మేధావులు పెరిగిపోయారు. ఇక్కడి వివక్షని తెలుసు కోవడానికి విదేశాల రిపోర్టులు అవసరం లేదనీ... నిజాన్ని గుర్తించే జ్ఞానం వుంటే సరిపోతుందనీ తెలుసుకోలేకపోతున్నారు. కులం కొనసాగింపు కోసం కొత్తకొత్త వాదనలు కనిపెడుతున్నారు.

దళితులు ప్రతి విషయాన్నీ కుల కోణం నుంచి చూస్తున్నారని ఆందోళన చెందటం అందులో మొదటిది. తమ తప్పును కప్పిపుచ్చు కోవడానికి అన్ని కులాలు వివక్ష ఎదుర్కొంటున్నాయి అంటారు. దళితులు ఎదుర్కొనే అంటరానితనం భిన్నమైందని ఒప్పుకోరు. 'కొన్ని సంఘటనలను చూపించి' దేశమంతా వివక్ష ఉందనడం సరి కాదంటారు. 2021లోనే దేశంలో 50,900 దాడులు నమోదు అయినట్లు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో చెప్పింది. ఇన్ని దాడులు చెదురు మదురు ఘటనలుగా కనిపించడం ఆశ్చర్యమే.



దళితులు ఇక్కడి వివక్షనే ఎదిరించడం 'అధర్మ'మట. ఆఫ్రికాలో అపార్థీడ్‌కూ, అమెరికాలో జాతి వివక్షకూ వ్యతిరేకంగా దళితులు సంఘీ భావం ప్రకటించడం వీళ్ళకి కనబడదు. ఎక్కడో వివక్ష ఉంది కాబట్టి ఇక్కడ దళితులు దాన్ని అనుభవించాలంటారు! ఆస్ట్రేలియాలో ఆదివాసీలకు జరిగిన అన్యాయానికి ఆ దేశ అధినేత క్షమాపణ చెప్పాడు. అమెరికాలో నల్ల జాతీయుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారీస్ క్షమాపణలు చెప్పారు. అలాంటి ఊరట కలిగించే మాట ఇక్కడ ఎవరైనా చెప్పగలరా? రిజర్వేషన్లు సమానత్వానికి వ్యతిరేకం అని ప్రచారం చేస్తారు. కానీ వీళ్ళకు కులం, అంటరానితనం అసమానత్వంగా కనబడవు.

అమెరికాలో 'పౌర హక్కుల చట్టం 1964' ప్రకారం జాతి, మతం, లింగం వంటి అంశాల వల్ల ఒక వ్యక్తిని వివక్షకు గురి చేయకూడదు. ఈ చట్టం లోని 'టైటిల్ సెవెన్' ప్రకారం ప్రభుత్వంతో కలిసి పనిచేసే వ్యక్తులు, సంస్థలు... కాంట్రాక్టులు, వ్యాపారాల్లో అఫర్మేటివ్ యాక్షన్ ప్లాన్ అమలు చేసి తీరాలి. అంటే నల్ల జాతీయులు, లాటిన్ అమెరికన్స్, మహిళలు, మైనారిటీలు, ట్రాన్స్ జెండర్స్ వంటి వారికి తప్పకుండా ఉద్యోగావకాశాలు కల్పించాలి. నియామకాలలో డైవర్సిటీ ఇండెక్స్ పాటించి తీరాలి. ఇది రిజర్వేషన్ లాంటిదే. అమెరికా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో డైవర్సిటీ ఇండెక్స్, హాలీవుడ్ సినిమాల్లో నల్ల జాతీయులు కనిపించడం వంటివి అఫర్మేటివ్ యాక్షన్‌లో భాగమే. దౌర్భాగ్యం ఏంటంటే... బతుకుదెరువు కోసం వెళ్లి ఉద్యోగాలు చేసుకుంటున్న మన వాళ్ళు అక్కడ కూడా కుల వివక్షను పెంచి పోషించడం. అందుకే అక్కడి దళితులు నల్ల జాతీయులలాగే తమకూ రక్షణ చట్టాలు కావాలని ఉద్యమాలు చేస్తున్నారు. అకడమిక్స్‌లోనూ వివక్ష రాజ్యమేలుతోంది. దానికి వ్యతిరేకంగా పోరాడే విద్యార్థులనూ, ఉద్యోగులనూ కులవాదులుగా చిత్రించడం 'అలవాటైన దుర్మార్గం' కాదా? దళితులు ఇప్పుడిప్పుడే చదువుకు దగ్గరవుతున్నారు. వాళ్లకి వ్యతిరేకంగా విశ్వవిద్యాలయాలు విష వలయాలుగా మారటం అన్యాయం కాదా?

అంబేడ్కర్ మీద అక్కసు వెళ్లగక్కడం మరో పోకడ. గతంలో అమెరికాకి చెందిన నల్లజాతి నాయకులు ఇండియా వచ్చి గాంధీని కలిసి ఆహ్వానించారు గాని అంబేడ్కర్‌ని కలవలేదని పెద్ద రహస్యాన్ని కనిపెట్టినట్టు ప్రచారం చేస్తున్నారు. గాంధీని పిలిచారు కాబట్టి అంబేడ్కర్ వివక్ష మీద పోరాటం చెయ్యలేదని చెప్పగలరా? గాంధీ ఒక దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిస్తున్న నేతగా ప్రపంచాన్ని ఆకర్షించాడనే సంగతిని మరువరాదు. అంబేడ్కర్‌ను తక్కువ చేసి చూపాలనే దుగ్ధతో అనవసరమైన పోలికలు తీసుకొస్తే ఎలా? 'అంబేడ్కర్ ఎంతో సహనంతో ఇప్పటిదాక నామీద దాడి చెయ్యకపోవడం అతని గొప్పతనమే' అని గాంధీ స్వయంగా 'హరిజన' పత్రికలో ఎందుకు రాసుకున్నాడో తెలిస్తే లోతు అర్థమౌతుంది.

దేశంలో చాక్లెట్ కొన్నా పన్ను కట్టాల్సిందే. ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ... మిగిలిన పౌరుల్లాగానే పన్ను కడుతున్నారు. అందులోంచే సంక్షేమ కార్యక్రమాలకూ, పారిశ్రామిక వసతుల కోసం, కార్పొరేట్ లకూ, భూమి ఉన్న రైతులకూ రాయితీలు ఇవ్వడం కోసం ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు పెడుతోంది. రాయితీల్లో తొంభై శాతం పైగా లబ్ధి దారులు పైకులాల వారే. ఈ రాయితీలతో పోల్చుకుంటే రిజర్వేషన్ల విలువ అతి స్వల్పం. దేశాన్నే ప్రైవేట్ చేతుల్లో పెడుతుంటే పట్టించు కోకుండా తరతరాలుగా అణచివేతకు గురైన వారికి ఇస్తున్న రిజర్వేషన్ల మీద దాడిచేయడం ఏమిటి? కులం పేరుతో ఎవరి పట్లయినా వివక్ష చూపడం జరిగినా, దాడి జరిగినా నైతికంగా అందరూ బాధ్యత వహించాలి. దాన్ని అందరూ గర్హించాలి.

వ్యాసకర్త ఆచార్యులు, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ, హెచ్‌సీయూ

గ్రహం అనుగ్రహం
శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.దశమి.8.22 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.8.57 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.8.44 నుండి 10.22 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.19 నుండి 7.45 వరకు, **అమృతఘడియలు:** లేవు : **రాహుకాలం** : ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం** : ప.1.30 నుండి 3.00 వరకు : **సూర్యోదయం** 6.17 : **సూర్యాస్తమయం** 5.20.

దివ్యాంగులకు అండగా...

- జిల్లాలో 35,408 మంది దివ్యాంగులు
- వీరందరికీ ప్రతీ నెల 1న ఠంచన్‌గా పింఛన్
- ఉపాధి పనుల్లో వెసులుబాటు
- జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఏడాది రూ.130 కోట్ల కేటాయింపు
- ప్రత్యేక చొరవ చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వం

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

రాజాం/రేగిడి:

దివ్యాంగత్వం మనిషికే కాని మనసుకు కాదని భావించేలా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తోంది. వీరికి ఏ రకమైన ఉపాధి లేక పోయినా ఆనందంగా జీవించేలా ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. వివిధ సంక్షేమ పథకాల కింద విజయనగరం జిల్లాలోని దివ్యాంగుల కోసం ఏడాదికి రూ.130కోట్ల మేర నిధులు వెచ్చిస్తోంది. దివ్యాంగుల సంక్షేమానికి బాసటగా నిలుస్తోంది. పార్టీలు, కులాలు, మతాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేస్తోంది. జిల్లాలో 35,408 మంది దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలిచి ప్రతీ నెల రూ.10,62,24,000లు మంజూరు చేస్తోంది. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న 'సంక్షేమానికి' 'సాక్షి' అక్షర రూపం.

ఠంచన్‌గా ఫింఛన్

జిల్లా వ్యాప్తంగా 35,408 మంది ఫింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరంతా ప్రతీ నెల వైఎస్సార్ ఆసరా పింఛన్ అందుకుంటున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ. 3 వేల పింఛన్ ఒకటో తేదీ రాగానే అందుతోంది. ఇవి వీరి కనీస అవసరాలకు, నెలవారీ జీవన ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. నెలకు రూ.122 కోట్లు వీరి ఫింఛన్ నిమిత్తం ఖర్చవుతుంది. వీరిలో 50 శాతం అంగవైకల్యం దాటిన వారికి ప్రభుత్వం రుణ సాయం అందించి, చిన్నచిన్న కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు పెట్టుకునే అవకాశం కల్పించింది. జిల్లాలో ఈ రుణాలు ద్వారా 680 మంది లబ్ధి పొందారు. వీటితో పాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిమిత్తం ఏడాదికి మరో రూ.8 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

12 వేల మందికి ఐడీ కార్డులు

జిల్లాలో 35 వేల మందికిపైగా దివ్యాంగులు ఉండగా, వీరికి ప్రత్యేక గుర్తింపు కార్డులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కలెక్టర్ సూర్య కుమారి కలగజేసుకుని వీరికి కార్డులు మంజూరీ ప్రక్రియ వేగవంతం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్డులు పొందిన వారికి అంగవైకల్యాన్ని అధిగమించేందుకు ట్రైసైకిళ్లు, స్టాండ్‌లు, వినికిడి యంత్రాలు, మోటారు స్కూటర్లు, రుణాలను ప్రభుత్వం సమకూర్చుతోంది. ఏడాదికి రూ.8 కోట్ల మేర ఖర్చుచేస్తోంది.

ఎన్నో ఉపయోగాలు

జిల్లాలోని దివ్యాంగులకు గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇచ్చి ఉపాధి పనుల్లో వెసులుబాటు కల్పిస్తోంది. 50 శాతం అదనపు రాయితీ అందజేస్తోంది. బస్సు పాసులు, ట్రైన్ పాసులతో దివ్యాంగులు లబ్ధి పొందుతున్నారు. జిల్లాలో 28,300 మంది దివ్యాంగులకి బస్సు, ట్రైన్ పాసులు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో దివ్యాంగులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ప్రతీ ఆరు నెలలకు జిల్లాలో దివ్యాంగులతో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 3200 మంది దివ్యాంగులు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారు.

ప్రత్యేక విద్యకు కృషి

చిన్నారులను మానసికంగా అభివృద్ధి పరిచేందుకు భవిత కేంద్రాలను మండల మానవ వనరుల కేంద్రాల వద్ద ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఐఈడీ ఉపాధ్యాయులు ద్వారా ప్రత్యేక బోధన అందిస్తోంది. దివ్యాంగుల బాగోగులకు కృషిచేస్తోంది. ప్రతీ వారం దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సిబ్బంది ఫిజియోథెరపీ చేస్తున్నారు. విద్యార్థుల్లో చిన్నచిన్న లోపాలను సరిచేస్తున్నారు.



సంతకవిటి భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులు



ఆటల పోటీల్లో ఆనందంతో దివ్యాంగ విద్యార్థి



రేగిడి భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

జిల్లాలో ఏడాది కాలంలో అందించిన పరికరాలు	
పరికరం పేరు	అందించినవి
మూడుచక్రాల సైకిళ్లు	190
శ్రవణ యంత్రములు	294
టచ్ ఫోన్లు	89
అంధుల చేతి కర్రలు	45
వీల్ చైర్స్	421
ల్యాప్ టాప్‌లు	117
చంక కర్రలు	28
వృద్ధుల చేతికర్రలు	210

ప్రతీ నెల రూ.8 వేలు వస్తుంది

నాకు ప్రతీ నెల రూ.3 వేల పింఛన్ అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాకు గ్రామ వలంటీరు ఉద్యోగం కూడా ఇచ్చారు. అదొక రూ.5 వేలు జీతం ఇస్తున్నారు. ఇటీవల మోటారు సైకిల్‌కు దరఖాస్తు చేసుకున్నాను. ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవనం ఇంటి వద్దే ఆనందంగా గడుస్తుంది. ఈ ప్రభుత్వం మాకు మంచి భవిష్యత్ భరోసాను కల్పిస్తుంది.

– లొట్ల లక్ష్మీనారాయణ,
గ్రామ వలంటీర్, గోవిందపురం పంచాయతీ,
సంతకవిటి మండలం

పింఛన్ ఇంటికే తెచ్చి ఇస్తున్నారు



గతంలో టీడీపీ ప్రభుత్వం నాకు వైకల్యం ఉన్నా పింఛన్ ఇచ్చేందుకు నానా ఇబ్బందులు పెట్టేది. ఇప్పుడు ఏ ఇబ్బంది లేకుండా ప్రతీ నెల 1న రూ.3 వేల పింఛన్ వలంటీర్ ఇంటి వద్దకు తెచ్చి ఇస్తున్నారు. తక్కువ వడ్డీతో రుణం ఇస్తారని వలంటీర్లు చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నాం. ఏదైనా వ్యాపారం చేద్దామని ఉంది.

– ఉంగటి ఈశ్వరరావు,
కొత్తవలస, రాజాం పట్టణం

అన్ని విధాలా ప్రోత్సాహం



దివ్యాంగులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలో కొత్తగా సదరం సర్టిఫికెట్ వచ్చిన వారికి వెంటనే పింఛన్ మంజూరవుతోంది. దివ్యాంగులకు ప్రతీ మూడు నెలలకు ఒక దఫా శిబిరాలు నిర్వహించి వస్తు సామగ్రి అందిస్తున్నాం. తక్కువ వడ్డీ రుణాలు ఇప్పించడంతో పాటు అర్హులకు ప్రభుత్వ కొలువులు లభిస్తున్నాయి.

– జీవీబీ జగదీష్, దివ్యాంగుల
సంక్షేమ శాఖ ఏడీ, విజయనగరం

100 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి



ఆరికతోటలో భూముల రీసర్వే వివరాలు పరిశీలిస్తున్న సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు

రామభద్రపురం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద మొదటి దశలో చేపట్టిన భూముల రీసర్వేలో డివిజన్‌లోని 100 గ్రామాల్లో సర్వే పూర్తి చేశామని సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.నారాయణరావు అన్నారు. మండలంలోని ఆరికతోట, రామభద్రపురం, కోటశిర్లాం గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను శుక్రవారం పరిశీలించిన ఆయన సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రెండో దశలో 20 గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్వే సమయంలో రైతులు భూమి వద్ద ఉండాలన్నారు. భూముల రీసర్వే ద్వారా ఎంతోకాలంగా రైతుల మధ్య నెలకొన్న భూతగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు. సర్వేయర్లకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ భాస్కరరావు పాల్గొన్నారు.

ఎస్ఈబీ ఏఎస్పీగా అస్మాఫర్హీన్



ఎస్పీ ఎం.దీపికను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ఈబీ ఏఎస్పీ అస్మాఫర్హీన్

విజయనగరం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అదనపు ఎస్పీగా అస్మా ఫర్హీన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ ఎం.దీపికను జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం అక్రమ విక్రయాలు, రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 2012లో డీఎస్పీగా విధుల్లో చేరిన అస్మా ఫర్హీన్ రాజమండ్రి, విజయనగరం పీటీసీలలో డీఎస్పీగా పనిచేశారు. ఏఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది కృష్ణా జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించి, జిల్లాకు బదిలీపై వచ్చారు.

అభివృద్ధికి గ్రామస్థాయి ప్రణాళికలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి, పక్కన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం గంటస్తంభం: గ్రామస్థాయి అభివృద్ధి ప్రణాళికల్లో, ప్రజల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. దీనికి ప్రజాప్రతినిధులంతా సహకరించాలని కోరారు. ఏ ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం కావాలన్నా, ప్రజాప్రతినిధుల సహకారం తప్పనిసరి అని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీపై, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులకు స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి ప్రణాళికల తయారీ చాలా ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రజల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. గ్రామకంఠాల్లో కొంత స్థలాన్ని సామాజిక అవసరాల కోసం విడిచిపెట్టాలని, అలాంటి చోట నర్సరీలు, ఇతర ఆదాయాన్ని పెంచే కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. బడి ఈడు పిల్లలంతా, తప్పనిసరిగా బడికి వచ్చేవిధంగా, ప్రజలను స్థానిక ప్రజాప్రతినిధులు చైతన్య పరచాలని సూచించారు. జిల్లాలోని మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని, దాని నివారణకు పోర్టిఫైడ్ రైస్ వినియోగించేలా అవగాహన కల్పించాలని కోరారు. సికిల్‌సెల్ ఎనీమియా, థలసీమియా లాంటి రక్త సంబంధిత వ్యాధులు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. అవగాహన లోపం, ఇతరత్రా కారణాలవల్ల మాతాశిశు మరణాలు కూడా ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. జిల్లాలో మేనరిక వివాహాలవల్ల వికలాంగుల శాతం ఇతర జిల్లాలకంటే ఎక్కువగా ఉందని చెప్పారు. జిల్లాలో సుమారు 58శాతం ప్రసవాలు సిజేరియన్‌ల ద్వారా జరుగుతున్నాయని, ఇది అంత శ్రేయస్కరం కాదని సూచించారు. పరిశ్రల ఏర్పాటుకు సహకరించాలని, దీనివల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు.

ప్రజా ప్రణాళిక ఉద్యమం–2022

కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్థానిక ప్రభుత్వాలు తమ ప్రజల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుకునేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. జిల్లా స్థాయితోపాటు, మండల, గ్రామ స్థాయిల్లో కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 29 ప్రభుత్వ శాఖలతో కూడిన అభివృద్ధి ప్రణాళికలను తయారుచేసుకోవాలని సూచించారు. 9 అంశాలతో కూడిన గ్రామ అభివృద్ధి ప్రణాళిక అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు, ఆరోగ్యకరమైన, బాలల స్నేహపూర్వక, సమృద్ధిగా నీరు, పరిశుభ్రత, హరిత, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళల స్నేహపూర్వక గ్రామాలుగా గ్రామాలన్నింటినీ తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ప్రోత్సాహకాలు ఇవ్వాలి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, అమలు చేయడం ద్వారా గ్రామ స్వరూపాలను మార్చవచ్చన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కషి చేసినప్పుడే అది సాధ్యపడుతుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, జెడ్పీ వైస్‌చైర్మన్లు మరిశర్ల బాపూజీనాయుడు, కె.సింహాచలం, సీఈఓ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబే.. రాష్ట్రానికి ఓ ఖర్మ

- మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రజలను మోసం చేసి, రాష్ట్రాన్ని దివాలా తీయించిన చంద్రబాబు మళ్లీ రాష్ట్రం పర్యటిస్తుండడంపై రాష్ట్రానికి ఇదేం ఖర్మ రా అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ నెల 7న విజయవాడలో తలపెట్టిన 'బీసీ గర్జన'కు సంసిద్ధతపై విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజాప్రతినిధులతో శుక్రవారం విజయనగరంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక పక్కరాష్ట్రంలో దాక్కొని, అప్పుడప్పుడూ చుట్టపుచూపు కోసం వస్తున్న చంద్రబాబుకు ఇప్పుడు ప్రజలు గుర్తుకొచ్చారా? అని ప్రశ్నించారు. ఇంకా దోచుకోవడానికి మళ్లీ పదవి కావాలా అంటూ ప్రజలు చంద్రబాబును నిలదీస్తున్నారని చెప్పారు. బీసీ గర్జనకు వార్డు మెంబరు మొదలుకొని పార్లమెంట్ సభ్యుల వరకూ దాదాపు 6 వేల మంది బీసీ ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పోస్టుల్లోనున్న బీసీ నాయకులు హాజరవుతారని బొత్స వెల్లడించారు.

గోల్డీ బ్రార్ అరెస్టు



చండీగఢ్: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ప్రధాన నిందితుడు, గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్‌ను అమెరికాలోని కాలిఫోర్నియాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై అధికారికంగా సమాచారం అందలేదని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. సిద్ధూ మూసేవాలాను పంజాబ్‌లోని మాన్సా జిల్లాలో ఈ ఏడాది మే 29న దుండగులు కాల్చి చంపడం తెలిసిందే. ఇది తమ పనేనని అంతర్జాతీయ నేరగాడు లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడైన గోల్డీ బ్రార్ అలియాస్ సతీందర్‌జీత్ సింగ్ ప్రకటించాడు. అతడిపై కేంద్రం రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది.

అంతరిక్షంలో రగడ



అంతరిక్షంలో రగడ జరుగుతోంది! మరణిస్తున్న ఓ తారను అతి భారీ కృష్ణ బిలమొకటి శరవేగంగా కబళించేస్తోంది. ఈ ఘర్షణ వల్ల చెలరేగుతున్న కాంతి పుంజాలు సుదూరాల దాకా కనువిందు చేస్తున్నాయి. ఈ అరుదైన అంతరిక్ష దృగ్విషయాన్ని ఉత్తరాఖండ్‌లోని సరస్వతి పర్వత శిఖరంపై ఉన్న టెలిస్కోప్ 'గ్రోత్' గుర్తించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్, ఐఐటీ బాంబే సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఇది భారత తొలి పూర్తిస్థాయి రోబోటిక్ ఆప్టికల్ రీసెర్చ్ టెలిస్కోప్. ''అంత్య దశలో ఉన్న ఆ నక్షత్రాన్ని భారీ కృష్ణబిలం అనంతమైన ఆకర్షణ శక్తితో తనలోకి లాగేసుకుంటోంది. దాంతో నక్షత్రం ఊహాతీత వేగంతో దానికేసి సాగుతోంది. వీటిని టైడల్ డిసరప్షన్ ఈవెంట్స్ (టీడీఈ) అంటారు'' అని ఐఐటీ బాంబే ఆస్ట్రో ఫిజిసిస్ట్ వరుణ్ భలేరావ్ వివరించారు. ఈ అంతరిక్ష రగడకు కేంద్రం మనకు 850 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉందట! ఈ అధ్యయన ఫలితాలు జర్నల్ నేచర్‌లో ప్రచురితమయ్యాయి.

నేనూ రేసిజం బాధితున్నే: రిషి



లండన్: జాత్యహంకార భూతం తననూ బాధించిందని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ వెల్లడించారు. భారత మూలాలున్న ఆయన బ్రిటన్లోనే పుట్టి పెరగడం తెలిసిందే. ''బాల్యంలో, పెరిగి పెద్దవుతున్న దశలో నేను రేసిజాన్ని ఎదుర్కొన్నా. అయితే ఈ సామాజిక సమస్యను ఎదుర్కొనే విషయంలో నాటితో పోలిస్తే బ్రిటన్ ఇప్పుడు ఎంతో ప్రగతి సాధించింది'' అని అభిప్రాయపడ్డారు. బకింగ్‌హాం ప్యాలెస్‌లో తాజాగా రేసిజం ఉదంతం వెలుగులోకి రావడం తెలిసిందే. దివంగత రాణి ఎలిజబెత్ 2 సన్నిహితురాలు, ప్రిన్స్ విలియం గాడ్‌మదర్ లేడీ సుసాన్ హసీ ప్యాలెస్‌లో పని చేస్తున్న ఒక ఆఫ్రికన్ ఉద్యోగిని పదేపదే ఆమె స్వస్థలం గురించి గుచ్చిగుచ్చి ప్రశ్నించారు. ''నేను బ్రిటిషర్‌నే అని ఎన్నిసార్లు చెప్పినా ఆఫ్రికాలో ఎక్కడి నుంచి వచ్చానంటూ సుసాన్ నన్ను పదేపదే నిలదీసింది. నా జుట్టును పక్కకు తోసి మరీ నా నేమ్ బ్యాడ్జ్‌ను పట్టి పట్టి చూసింది. ఇది నన్నెంతో బాధించింది'' అంటూ సదరు ఉద్యోగి ట్వీట్ చేయడంతో వివాదం రేగింది. చివరికి సుసాన్ క్షమాపణలు చెబుతూ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇది చాలా బాధపడాల్సిన విషయమని బకింగ్‌హాం ప్యాలెస్ పేర్కొంది. జాత్యహంకారానికి బ్రిటిష్ సమాజంలో స్థానం లేదంటూ ప్రిన్స్ విలియం దంపతులు కూడా ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో రిషి మీడియాతో మాట్లాడుతూ తన వ్యక్తిగత అనుభవాన్ని వివరించారు. ''రేసిజం ఎక్కడ కన్పించినా తీవ్రంగా వ్యతిరేకించాల్సిందే. దాన్ని తుదముట్టించే దిశగా చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది. గతం నుంచి పాఠాలు నేర్చుకుంటూ మెరుగైన భవిష్యత్తు దిశగా సాగాలి'' అన్నారు.

క్లుప్తంగా...

ఈడీ విచారణకు నటి నోరా



న్యూఢిల్లీ: మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్‌పై నమోదైన మనీ లాండరింగ్ కేసులో బాలీవుడ్ నటి నోరా ఫతేహిని ఈడీ శుక్రవారం ప్రశ్నించింది. సుకేశ్ భార్య లీనా ఆహ్వానం మేరకు 2020లో చెన్నైలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి వెళ్లగా కొత్త ఐఫోన్, ఖరీదైన బ్యాగ్‌తోపాటు బీఎండబ్ల్యూ కారు అందజేశారని ఈ సందర్భంగా నోరా వెల్లడించిందని ఈడీ వర్గాలు తెలిపాయి. మరిన్ని వివరాల కోసం ఆమెకు మళ్లీ సమన్లు జారీ చేసే అవకాశాలున్నాయని తెలిపాయి.

సున్నపురాయి గని కూలి ఛత్తీస్‌గఢ్‌లో ఏడుగురు మృతి

జగదల్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలో మాల్‌గావ్ గ్రామంలో శుక్రవారం సున్నపురాయి గని కూలిన ఘటనలో ఆరుగురు మహిళలు సహా ఏడుగురు కార్మికులు మృత్యువాతపడ్డారు. గని లోపల మట్టిని తవ్వుతుండగా పైకప్పు కొంతభాగం కూలి వారిపై పడిందని పోలీసులు తెలిపారు.

మోదీకి మద్దతు: జో బైడెన్

వాషింగ్టన్: భారత్ తమకు బలమైన భాగస్వామి అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. జీ 20 అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ''బలమైన కూటమి అధ్యక్ష బాధ్యతలను మోస్తున్న ప్రధాని, నా మిత్రుడు నరేంద్ర మోదీకి మద్దతు ఇవ్వడానికి ఆత్రుతతో ఎదురు చూస్తున్నా'' అంటూ ట్వీట్ చేశారు. జీ 20 తదుపరి శిఖరాగ్రం 2023 సెప్టెంబర్ 9, 10ల్లో ఢిల్లీలో జరుగనుంది.

క్లాస్‌మేట్‌పై క్లాస్‌రూంలోనే బాలుర అఘాయిత్యం

ముంబై ప్రభుత్వ పాఠశాలలో దారుణం

ముంబై: తరగతి గదిలో ఒంటరిగా ఉన్న 8వ తరగతి బాలికపై ఇద్దరు సహ విద్యార్థులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణం ముంబైలోని మాతుంగ ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. తోటి వారంతా డ్యాన్స్ క్లాస్ కోసం వేరే గదికి వెళ్లి విద్యార్థిని ఒక్కతే క్లాస్‌రూంలో ఉండటాన్ని అవకాశంగా తీసుకుని వానే అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గ్యాంగ్ రేప్, పోక్సో తదితర చట్టాల కింద కేసులను నమోదు చేశారు. బాలురను అదుపులోకి జువెనైల్ డిటెన్షన్ కేంద్రానికి తరలించారు.


ఆ నలుగురూ అంతర్జాతీయ ఉగ్రవాదులు: అమెరికా

వాషింగ్టన్: అల్ ఖైదా, పాకిస్తాన్ తాలిబాన్ గ్రూపులకు చెందిన నలుగురు అగ్ర నేతలను అంతర్జాతీయ ఉగ్రవాదులుగా అమెరికా ప్రకటించింది. భారత ఉపఖండంలో అల్‌ఖైదా చీఫ్ ఒసామా మహమూద్, డిప్యూటీ చీఫ్ అతిఫ్ యాహ్యా ఘూరి, మహ్మద్ మరుఫ్, పాక్‌లోని ఖైబర్ ప్రావిన్స్‌లో తెహ్రిక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) డిప్యూటీ చీఫ్ క్వారీ అమ్జాద్‌లను ఈ జాబితాలో చేర్చింది.

పేదలను దోచుకున్నోళ్లే... నన్ను తిడుతున్నారు

అవినీతికి చరమగీతం పాడడం వారికి నచ్చట్లేదు

గుజరాత్ ప్రచారంలో కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం



కాంక్రేజ్‌లోని బెగర్‌నాథ్ ఆలయంలో మోదీ పూజలు

అహ్మదాబాద్: ''అటంక్, లట్‌కానా, భట్కానా (అడ్డుకోవడం, ఆలస్యం చేయడం, తప్పుదోవ పట్టించడం)... కాంగ్రెస్ నమ్ముకున్న సూత్రం ఇదే'' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. పేదలను లూటీ చేసినవారు తనను దూషిస్తున్నారని చెప్పారు. అవినీతికి చరమగీతం పాడినందుకు నిత్యం తిడుతున్నారని ఆక్షేపించారు. గతంలో గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతికి ఆస్కారమున్న పనులు తప్ప ప్రజలకు మంచి చేసే పనులు చేయలేదని ఆరోపించారు. మోదీ శుక్రవారం గుజరాత్‌లో బనస్కంతా జిల్లా కాంక్రేజ్ గ్రామంలో ఎన్నికల సభలో ప్రసంగించారు. కరువు పీడిత ప్రాంతాలకు నర్మదా జలాలను తీసుకొచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. సర్దార్ సరోవర్ డ్యామ్ నిర్మాణానికి కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించిందని ఆరోపించారు.

పేదలను దోచుకొనేవారిపై చర్యలు తప్పవు

కాంగ్రెస్ పాలనలో దేశంలో మధ్యలో వదిలేసిన 99 తాగునీటి సరఫరా పథకాలను పూర్తి చేయడానికి తమ ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిందని మోదీ చెప్పారు. దేశవ్యాప్తంగా 4 లక్షల నకిలీ రేషన్ కార్డులను రద్దు చేశామన్నారు. అవినీతి అడ్డుకోవడం కొందరికి నచ్చడం లేదని, అందుకే తనను దూషిస్తున్నారని వ్యాఖ్యానించారు. పేద ప్రజలను దోచుకొనేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పుడు పనులు చేసి దొరికిపోయినవారు తనను తిడుతున్నారని చెప్పారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మరోసారి విజయం సాధించబోతోందని జోస్యం చెప్పారు. కాంక్రేజ్‌లోని బెగర్‌నాథ్ ఆలయంలో ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్ నేతల బానిస మనస్తత్వం

స్వాతంత్య్రానికి ముందు బ్రిటిష్ పాలకులతో కలిసి పనిచేసిన కాంగ్రెస్ నేతలు బానిస మనస్తత్వాన్ని అలవర్చుకున్నారని మోదీ చెప్పారు. బ్రిటిషర్ల చెడు అలవాట్లను కాంగ్రెస్ నాయకులు నేర్చుకున్నారని తెలిపారు. ఆనంద్ జిల్లాలోని సోజిత్రా పట్టణంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ సమస్య కేవలం సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ మాత్రమే కాదని, దేశ ఐక్యత కూడా అని చెప్పారు. విభజించు, పాలించు అనే విధానంపైనే కాంగ్రెస్ రాజకీయాలు ఆధారపడి ఉంటాయన్నారు. ప్రజలందరినీ ఏకం చేయాలని సర్దార్ పటేల్ భావించారని, అందుకే ఆయనంటే కాంగ్రెస్‌కు గిట్టదని పేర్కొన్నారు.

బీజేపీ విజయాన్ని ఒప్పుకున్న కాంగ్రెస్

గుజరాత్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎం) ట్యాంపరింగ్ చేశారన్న కాంగ్రెస్ ఆరోపణలను మోదీ తిప్పికొట్టారు. ''ఓటమి తప్పదని కాంగ్రెస్ నిర్ణయానికి వచ్చింది. అందుకే ఈవీఎంలపై నిందలు మోపుతోంది. తద్వారా బీజేపీ విజయాన్ని పరోక్షంగా అంగీకరించింది'' అని అన్నారు. ఆయన ఉత్తర గుజరాత్‌లోని పఠాన్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ముందు మోదీని తిట్టడం, ఎన్నికలయ్యాక ఈవీఎంలను నిందించడం.. కాంగ్రెస్‌కు తెలిసింది ఈ రెండు విషయాలేనని ఎద్దేవా చేశారు. దేశంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు దక్కాల్సిన సొమ్మును దోచుకున్నాయని దుయ్యబట్టారు. ధనికుల, పేదల మధ్య అంతరాలు పెంచిన ఘనత కాంగ్రెస్‌దేనని ధ్వజమెత్తారు.

కొలీజియం వ్యవస్థను నీరుగార్చొద్దు

- మాజీ జడ్జీల వ్యాఖ్యలపై మాట్లాడం
- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకం కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న కొలీజియం వ్యవస్థను అనవసర వ్యాఖ్యలు, వాదనలతో నీరుగార్చొద్దని సుప్రీంకోర్టు హితవు పలికింది. దేశంలో అత్యంత పారదర్శకంగా పనిచేస్తున్న వ్యవస్థల్లో ఇదొకటని ఉద్ఘాటించింది. ఈ వ్యవస్థపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు ఏం చెప్పారన్నదానిపై తాము ఏమీ మాట్లాడదలచుకోలేదని వెల్లడించింది. కొలీజియం వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ మధ్య వివాదం సాగుతున్న సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకోవడం ఏమిటంటూ కొలీజియం వ్యవస్థను కేంద్రం వ్యతిరేకిస్తోంది. న్యాయ వ్యవస్థలోనూ కొలీజియం ఉండాలని కొందరు, జడ్జీలను ప్రభుత్వమే నియమించాలని మరికొందరు అంటున్నారు. ''కొలీజియం గత నిర్ణయాలను తప్పుపడుతూ మాట్లాడడం ఇటీవల ఫ్యాషన్‌గా మారిపోయింది. గతంలో ఇదే కొలీజియం సభ్యులుగా నిర్ణయాలు తీసుకున్నవారు రిటైరయ్యాక మరోలా మాట్లాడుతున్నారు. వారి వ్యాఖ్యలపై స్పందించాలని మేం కోరుకోవడం లేదు'' అని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌తో కూడిన ధర్మాసనం తేల్చిచెప్పింది. కొందరి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కొలీజియం పనిచేయదని పేర్కొంది. పారదర్శకంగా వ్యవహరించే వ్యవస్థను తన పని తాను చేసుకోనివ్వడం మంచిది అని స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 12 నాటి సుప్రీంకోర్టు కొలీజియం భేటీ అజెండాను బయట పెట్టాలంటూ సమాచార హక్కు చట్టం కార్యకర్త అంజలి భరద్వాజ్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని హైకోర్టు కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె దాఖలు చేసిన వ్యాజ్యంపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సంబంధం లేని వ్యక్తులు అనవసర వ్యాఖ్యలు చేయొద్దని, కొలీజియం వ్యవస్థను పట్టాలు తప్పించవద్దంటూ ఈ సందర్భంగా సూచించింది.

వారివి రాముని ఆదర్శాలు కావు: రాహుల్

అగర్ మాల్వా(మధ్యప్రదేశ్): ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు శ్రీరాముడి నైతిక జీవనాన్ని అనుకరించడం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన అగర్‌మాల్వాలో జరిగిన ర్యాలీలో మాట్లాడారు. 'మహాత్మాగాంధీ తరచూ ఉచ్చరించే 'హే రామ్'అంటే ఒక జీవన విధానమని అర్థం. ప్రేమ, సోదరభావం, గౌరవం, తపస్సు అర్థాన్ని ప్రపంచానికి నేర్పింది' అని ఒక సాధువు తనకు చెప్పారని రాహుల్ చెప్పారు. అదేవిధంగా, జై సియా రామ్ అర్థం సీత, రాముడు ఒక్కరేనని, శ్రీరాముడు సీత గౌరవం కోసం పోరాడారని ఆ సాధువు చెప్పారని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు మాత్రం శ్రీరాముని అడుగుజాడల్లో నడవడం లేదని, ఆయన ఆదర్శాలను పాటించడం లేదని విమర్శించారు. మహిళలకు గౌరవం కల్పించేందుకు బీజేపీ నేతలు పాటుపడటం లేదని అన్నారు.



మధ్యప్రదేశ్‌లో భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ



విలాసవంతమైన అచ్చం లంబోర్గిని లాంటి కారునే అస్సాం రాష్ట్రం కరీంగంజ్‌కు చెందిన నూరుల్ హక్ రూపొందించాడు. పాత మారుతి స్విఫ్ట్ కారును రూ.10.2 లక్షలు వెచ్చించి తన సొంత గ్యారేజీలో అచ్చు గుద్దినట్లు లంబోర్గినిలా తయారు చేశాడు. దీన్ని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మకు బహుమతిగా అందజేసేందుకు శుక్రవారం గువాహటి తీసుకొచ్చాడు.

రష్యాకు లక్ష, మాకు 13 వేలు

సైనిక నష్టంపై ఉక్రెయిన్



కీవ్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారీగా ప్రాణ నష్టం చోటు చేసుకుంటోంది. యుద్ధం మొదలైన ఈ తొమ్మిది నెలల కాలంలో దాదాపుగా 13 వేల మంది ఉక్రెయిన్ సైనికులు మరణించినట్టు అధ్యక్షుడు జెలెన్‌స్కీ సలహాదార మైఖైలో పోడోల్యాక్ వెల్లడించారు. వీరిలో సాధారణ పౌరులే అధికమన్నారు. రష్యా సైనికులు లక్ష మంది దాకా మరణించినట్టు అంచనా వేశామన్నారు. లక్షన్నర మంది గాయపడి ఉంటారని తెలిపారు. ఉక్రెయిన్ వైపు చనిపోయిన, గాయపడ్డ వారి సంఖ్య లక్ష దాకా ఉంటుందని యూరోపియన్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్ చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ రెండు పక్షాల్లో కలిపి మృతుల సంఖ్య లక్ష వరకు ఉంటుందని అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మార్క్ మిల్లీ అన్నారు. ఉక్రెయిన్ పౌరులు 40 వేల మంది వరకు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇక ఇరువైపులా కలిపి 6,655 మంది పౌరులు మరణించారని, 10, 368 మంది గాయపడ్డారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ వెల్లడించింది. సైనికులు ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో ఐరాస వెల్లడించలేదు.

వీసాల జారీపై దృష్టి: అమెరికా

న్యూఢిల్లీ: అమెరికా వీసాల కోసం భారత్‌లో విపరీతమైన డిమాండే సుదీర్ఘమైన వెయిటింగ్ పీరియడ్‌కు కారణమని యూఎస్ చార్జ్ డి అఫైర్స్ రాయబారి ఎలిజబెత్ జోన్స్ అన్నారు. ''దీన్ని వీలైనంతగా తగ్గించడానికి అమెరికా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది'' అని శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమె మీడియాకు తెలిపారు. ''భారీగా కౌన్సెలర్లను నియమించుకుంటున్నాం. వారందరికీ వాషింగ్టన్లో యుద్ధ ప్రాతిపదికన శిక్షణ నడుస్తోంది. వారిలో వీలైనంత మందిని భారత్‌కు రప్పించుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. వచ్చే వేసవికల్లా ఢిల్లీ, ఇతర కాన్సులేట్లలో పూర్తిస్థాయి సిబ్బంది అందుబాటులోకి వస్తారు'' అని చెప్పారు. దరఖాస్తుదారులంతా ఓపిక పట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అమెరికా వీసాకు తొలిసారిగా దరఖాస్తు చేసుకుంటున్న వారు ఇంటర్వ్యూల కోసం ఏకంగా మూడేళ్ల దాకా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది!

గుజరాత్ మొదటి దశలో 63.31% ఓటింగ్

గత ఎన్నికల్లో కంటే తక్కువే: ఈసీ

అహ్మదాబాద్: గుజరాత్‌లో 2017 అసెంబ్లీ ఎన్నికల మొదటి దశతో పోలిస్తే ఈసారి తక్కువ శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం తెలిపింది. గురువారం జరిగిన మొదటి దశ పోలింగ్‌లో మొత్తమ్మీద 63.31% ఓటింగ్ నమోదైంది. గత 2017 ఎన్నికల్లో 19 జిల్లాల్లోని ఇవే 89 సీట్లకు జరిగిన మొదటి దశ పోలింగ్‌లో 66.7% పోలింగ్ నమోదైందని ఈసీ శుక్రవారం తెలిపింది. గిరిజన ప్రాబల్య నర్మదా జిల్లాలో అత్యధికంగా 78.24% ఓటింగ్ నమోదు కాగా, ఆ తర్వాత తాపిలో 76.91%, నవ్‌సారిలో 71.06% ఓటింగ్ నమోదైందని ఈసీ పేర్కొంది. నర్మదా జిల్లా దెడియాపడలో అత్యధికంగా 82.71%, వల్సాడ్ జిల్లా కప్రాడాలో 79.57% ఓటింగ్ నమోదైనట్లు వెల్లడించింది. అత్యల్పంగా బొతడ్, అమ్రేలీ జిల్లాల్లో 57.58%, 57.59% చొప్పున ఓటింగ్ నమోదైనట్లు వివరించింది. రెండో దశలో 93 సీట్లకు 5న పోలింగ్ జరగనుంది.

సార్వత్రిక ఎన్నికలపై బీజేపీ గురి

- సోమవారం నుంచి రెండు రోజులు పార్టీ ఆఫీస్ బేరర్ల సమావేశం
- హాజరు కానున్న పార్టీ జాతీయ కార్యదర్శులు, రాష్ట్ర అధ్యక్షులు

సాక్షి, న్యూఢిల్లీ: 2024 సార్వత్రిక ఎన్నికలపై అధికార బీజేపీ దృష్టి సారించింది. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ, రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. పార్టీ జాతీయ కార్యదర్శులు, రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఇన్‌చార్జిలు ఇందులో పాల్గొంటారు.

దిశానిర్దేశం చేయనున్న నడ్డా

గత లోక్‌సభ ఎన్నికల్లో 303 స్థానాలు గెలిచిన బీజేపీ ఈసారి అంతకుమించి నెగ్గాలని లక్ష్యం నిర్దేశించుకుంది. 2014, 2019ల్లో చెప్పుకోదగ్గ రీతిలో ఓట్లు సాధించని 144 నియోజకవర్గాలను బీజేపీ అధిష్టానం గుర్తించింది. ఈ లోక్‌సభ స్థానాలు ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ పాగా వేసేలా వ్యూహాలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే నలుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. ఈ బృందం పలు నియోజకవర్గాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులతో సమావేశాలు నిర్వహించింది. మరోవైపు ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో ఇప్పటికే కేంద్ర మంత్రుల బృందాలు పర్యటించాయి. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై జేపీ నడ్డా పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర ఆఫీస్ బేరర్ల భేటీలో ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. కచ్చితంగా నెగ్గాలని లక్ష్యంగా పెట్టుకున్న లోక్‌సభ స్థానాలతోపాటు త్వరలో జరగబోయే త్రిపుర, కర్ణాటకతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షిస్తారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, మరింత చేరువ కావాల్సిన ప్రాంతాలు, వర్గాలను గుర్తించడంతోపాటు ఓట్ల శాతాన్ని మెరుగుపర్చుకోవడానికి వ్యూహాలను ఖరారు చేయనున్నట్లు బీజేపీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఆఫీసు బేరర్ల సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగించే అవకాశం ఉందని మరో నాయకుడు చెప్పారు.

అమరీందర్‌కు కీలక బాధ్యతలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌ను వీడి కాషాయ కండువా కప్పుకున్న పలువురు పంజాబ్ నేతలకు బీజేపీ కీలక బాధ్యతలు అప్పగించింది. మాజీ సీఎం అమరీందర్ సింగ్, మాజీ ఎంపీ సునీల్ జాఖడ్, యూపీ బీజేపీ మాజీ అధ్యక్షుడు స్వతంత్ర దేవ్ సింగ్‌ను జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమించింది. కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి జైవీర్ షేర్‌గిల్‌ను అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నగరాలు చాలా కాస్ట్లీ

జాబితాలో అగ్రభాగంలో న్యూయార్క్, సింగపూర్

అక్కడ ఏడాదిలో 8% పెరిగిన జీవన వ్యయం

చౌకైన నగరం ట్రిపోలీ



లండన్: ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరాలుగా న్యూయార్క్, సింగపూర్ అగ్రభాగంలో నిలిచాయి. పెరుగుతున్న జీవన వ్యయం ఆధారంగా చేసుకొని లండన్‌కు చెందిన ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) 172 నగరాల జాబితాను రూపొందించింది.ఈ నగరాల్లో గత ఏడాదితో పోల్చి చూస్తే కాస్ట్ ఆఫ్ లివింగ్ సగటున 8.1% పెరిగినట్టు తాను విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నగరం గత ఏడాది మొదటి స్థానంలో ఉంటే ఈసారి మూడో స్థానానికి తగ్గింది. ఆసియా దేశాల్లో ఏడాదిలో జీవన వ్యయం సగటున 4.5% పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. న్యూయార్క్, సింగపూర్ మొదటి స్థానాన్ని పంచుకుంటే నాలుగో స్థానంలో హాంకాంగ్, లాస్‌ఏంజెలెస్ నిలిచాయి.

సర్వే ఎలా చేశారంటే.!

ప్రపంచవ్యాప్తంగా 172 నగరాల్లోని 200కిపైగా నిత్యావసర వస్తువుల ధరలు, 400 వరకు రవాణా, వైద్య చికిత్స వంటి సేవల ధరల్ని పోల్చి చూస్తూ ఈ జాబితాను రూపొందించారు. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో ఈ సర్వే నిర్వహించినట్టుగా ఈఐయూ సంస్థ చీఫ్ ఉపాసన దత్ వెల్లడించారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షలు, చైనాలో జీరో కోవిడ్ విధానం వల్ల ప్రపంచ వ్యాప్తంగా వస్తు సామాగ్రి రవాణాలో ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగిపోయాయని , గత 20 ఏళ్లలో ఈ స్థాయిలో ధరలు పెరగడం ఎప్పుడూ చూడలేదని ఆమె తెలిపారు. అమెరికాలో ధరాభారం విపరీతంగా పెరిగిపోవడంతో ఆ దేశంలోని మూడు నగరాల్లో మొదటి పది స్థానాల్లో నిలిచాయని ఉపాసన వివరించారు.

మన నగరాలు చౌక

ఇక భారత్‌లోని నగరాల్లో కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువని ఈ సర్వేలో తేలింది. మొత్తం 172 దేశాలకు గాను మన దేశంలో బెంగుళూరు 161 స్థానంలోనూ చెన్నై 164, అహ్మదాబాద్ 165 స్థానంలోనూ నిలిచాయి. అత్యంత చౌక నగరాలుగా సిరియా రాజధాని డమాస్కస్, లిబియాలోని ట్రిపోలీ అట్టడుగున వరసగా 172, 171 స్థానాల్లో నిలిచాయి.

టాప్-10 ఖరీదైన నగరాలు ఇవే	
1.	న్యూయార్క్ (అమెరికా)
1.	సింగపూర్
3.	టెల్ అవీవ్ (ఇజ్రాయెల్)
4.	హాంకాంగ్
4.	లాస్ ఏంజెలెస్ (అమెరికా)
6.	జ్యూరిచ్ (స్విట్జర్లాండ్)
7.	జెనీవా (స్విట్జర్లాండ్)
8.	శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా)
9.	పారిస్ (ఫ్రాన్స్)
10.	కోపెన్‌హాగెన్ (డెన్మార్క్)
10.	సిడ్నీ (ఆస్ట్రేలియా)

సాక్షి విజయనగరం

శనివారం । 3 । డిసెంబర్ । 2022

మైనారిటీ సంక్షేమాధికారిగా చంద్రశేఖరరావు



విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా(ఎఫ్ఏసీ) టి.చంద్రశేఖరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. విజయనగరంతో పాటు శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాలకు మైనారిటీ సంక్షేమాధికారిగా కొనసాగుతున్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో రాణించిన రాజకుమార్



తెర్లాం: గత నెల 28 నుంచి 30 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన సెంట్రల్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తెర్లాం మండలం గంగన్నపాడు గ్రామానికి చెందిన కొప్పర రాజకుమార్ రాణించాడు. అత్యుత్తమ ఆటతీరుతో ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో కీలక భూమిక పోషించాడు. క్రీడాకారుడుని తల్లిదండ్రులు సుమలత, శంకరరావు, కోచ్ సింహాచలం అభినందించారు.

6న పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వేతర కళాశాలలో 2022-23 సంవత్సరానికి సంబంధించి పారామెడికల్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 6వ తేదీన వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

గడువు పెంపు

విజయనగరం ఫూల్‌బాగ్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 5లోగా పరీక్ష ఫీజు చెల్లించుకునేందుకు అవకాశం కల్పించినట్టు డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ లాగిన్‌లోని ఎస్‌బీఐ కలెక్ట్ ద్వారా దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. పరీక్ష ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలని కోరారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

• డీఈఓ లింగేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం ఫూల్‌బాగ్: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక పోర్ట్‌సిటీ స్కూల్‌లో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మండలాల వారీగా సూపర్-60 బ్యాచ్‌లను సిద్ధంచేసి బోధన సాగించాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల కార్యాచరణ ప్రణాళిక, నాడు-నేడు, జగనన్న గోరుముద్ద తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ స్వామినాయుడు, డిప్యూటీ డీఈఓలు కె.వాసుదేవరావు, తిరుపతినాయుడు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్‌వర్సిటీ కబడ్డీ పోటీలకు ధీరజ్, నితిన్



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్



నితిన్‌కుమార్

చీపురుపల్లిరూరల్ (గరివిడి)/నెల్లిమర్ల: ఇంటర్ వర్సిటీ కబడ్డీ పోటీలకు గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎస్.ధీరజ్ యాదవ్, జేఎన్‌టీయూ విద్యార్థి నితిన్‌కుమార్ అర్హత సాధించారు. ఈ నెల 1న లెండీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన యూనివర్సిటీ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపారు. ఈ నెల 7 నుంచి 10 వరకు బెంగళూరులో జరగనున్న ఇంటర్ వర్సిటీ కబడ్డీ పోటీల్లో ఆడనున్నారు. విద్యార్థులను కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎ.శ్రీకుమార్, వి.జాషువాజయప్రసాద్, పీడీలు అభినందించారు.

సాఫ్ట్‌బాల్‌లో సత్తాచూపిన పారాది విద్యార్థులు



విజేతలతో జెడ్పీ పాఠశాల సిబ్బంది

బొబ్బిలి రూరల్: గతనెల 25 నుంచి 29వ తేదీ వరకు కర్నూల్ జిల్లా మాంటిస్సోరిలో జరిగిన సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పారాది జెడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన చైతన్యకుమారి, శాంతి, సుప్రియ, వేణు, రంజిత్‌లు బంగారు పతకాలు సాధించారు. క్రీడా కోటాలో ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. నూజివీడులో అమృత, శ్రీకాకుళంలో స్వాతి, మోహన్‌కృష్ణఠాగూర్ సీట్లు సాధించారు. వీరందరినీ హెచ్‌ఎం నాగేశ్వరరావు, పీడీ సత్యనారాయణ ఉపాధ్యాయులు శుక్రవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు.

దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం

గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం... ఊరూరా, వార్డువార్డులో ఉండే దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతోంది. మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ ప్రగతి బాటలు వేస్తోంది. సచివాలయం వేదికగా ప్రభుత్వం కేటాయించిన అదనపు నిధులతో పనులు చకచకా సాగుతుండడం, సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతుండడంతో స్థానికులు సంతోషపడుతున్నారు. పాలకులు, అధికారులకు మనసారా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- 'గడప గడపకు మన ప్రభుత్వం'తో పలు సమస్యలు వెలుగులోకి!
- సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అదనపు నిధులు
- ప్రతి గ్రామ/వార్డు సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున కేటాయింపు
- జిల్లాలో 929 పనుల ప్రతిపాదన
- రూ.24.87 కోట్ల నిధుల మంజూరుకు పరిపాలనా అనుమతులు



ఇది మెంటాడ మండలం చల్లపేట గ్రామంలో నిర్మించిన సీసీ రహదారి. వాస్తవానికి దీన్ని నిర్మించాలని గ్రామస్తులు కొన్నేళ్లుగా గత ప్రభుత్వాల హయాంలో విన్నవించినా స్పందన శూన్యం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దాదాపు మూడు నెలల కిందట ఈ గ్రామానికి డిప్యూటీ ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర వచ్చారు. ఇళ్ల మధ్య మురుగు నిలిచిపోతోందని డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు ఆయనను కోరారు. గ్రామ సచివాలయానికి మంజూరు చేసిన రూ.20 లక్షల నిధుల్లో కొంత మొత్తాన్ని కేటాయించడంతో సీసీ రోడ్డు నిర్మాణమైంది.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

జిల్లాలో దీర్ఘకాలంగా ప్రజలకు గుదిబండగా ఉన్న సమస్యలన్నీ త్వరలోనే తీరిపోనున్నాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ సంబంధిత ఎమ్మెల్యే, అధికారులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్థానికుల విన్నపం మేరకు ప్రతిపాదించిన మౌలిక వసతుల కల్పన పనులన్నింటికీ మోక్షం కలగనుంది. దీనికోసం ప్రతి గ్రామ/వార్డు సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున అదనపు నిధులను మంజూరు చేస్తోంది. జిల్లాలో ఇప్పటివరకూ గుర్తించిన 929 అభివృద్ధి పనుల నిమిత్తం రూ.24.87 కోట్లు నిధులు మంజూరు చేసింది. వీటికి పరిపాలనా అనుమతులు ఇస్తూ గత నెల 24వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.

నిధులు, పనుల ప్రగతి ఇలా...

అసెంబ్లీ నియోజకవర్గం	ప్రతిపాదించిన పనులు	పురోగతిలో పనులు	ప్రారంభమైనపనుల విలువ (రూ.లక్షల్లో)
రాజాం	81	5	11.05
బొబ్బిలి	126	14	38.00
చీపురుపల్లి	111	40	118.71
నెల్లిమర్ల	243	122	322.51
విజయనగరం	22	-	-
ఎస్.కోట	183	104	342.55
గజపతినగరం	133	86	330.56
సాలూరు (మెంటాడ మండలం)	30	18	55.00
మొత్తం	929	389	1218.38

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట...

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ప్రతీ ఎమ్మెల్యే తన నియోజకవర్గం పరిధిలో అన్ని సచివాలయాల పరిధిలోని ఇంటింటికీ స్వయంగా వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపిస్తున్నారు. ప్రధానంగా క్షేత్ర స్థాయిలో రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీరు, రక్షణ గోడలు, శానిటేషన్, సీసీ రోడ్లు, లింక్ రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. దీర్ఘకాలంగా ప్రజలను వెంటాడుతున్న సమస్యలు పరిష్కరించేందుకు ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.20 లక్షల అదనపు నిధులు ఉపయోగపడుతున్నాయి.

ఇప్పటివరకూ దాదాపు వెయ్యి విన్నపాలు..

మౌలిక వసతుల కల్పనపై ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా ముఖం చాటేసింది. ఏవో తాత్కాలిక కార్యక్రమాలు తప్ప సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించలేదు. అందుకు నిదర్శనంగా ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతులు కల్పించాలన్న విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని 626 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఇప్పటివరకూ 929 ప్రతిపాదనలు వచ్చాయి. ఆయా అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం రూ.24.87 కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. వాటిలో రూ.12.18 కోట్ల నిధులతో 389 పనులను ఆయా ఎమ్మెల్యేలు లాంఛనంగా ప్రారంభించారు. మిగతా పనులు కూడా టెండరు దశలో ఉన్నాయి. ఈ ప్రక్రియ కూడా ఈ నెల మొదటి వారంలో పూర్తి చేస్తామని, వెనువెంటనే పనులు మొదలవుతాయని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు.

తాగునీటి కష్టాలిక ఉండవు



నెల్లిమర్ల నియోజకవర్గం భోగాపురం మండల కేంద్రంలో వేస్తున్న పైపులైన్ చిత్రమిది. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దృష్టికి ఇక్కడి తాగునీటి సమస్యను తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు రూ 2.5 లక్షలు మంజూరయ్యాయి. కొత్తగా పైపులైను ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

మురుగు సమస్యకు మోక్షం...



గజపతినగరం నియోజకవర్గం బొండపల్లి మండలంలోని అంబటివలసలో జాతీయ రహదారి పక్కన మురుగు నీటి కాలువల నిర్మాణ పనుల దృశ్యమిది. గతంలో ఇక్కడ మురుగునీరు ఇళ్ల మధ్య స్తంభించిపోయేది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గత నెల ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, అధికారులు ఈ గ్రామానికి వచ్చారు. మురుగు సమస్యను స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రూ.5 లక్షలు మంజూరు చేశారు.

మురుగునీటి కాలువల పనులు...



రాజాం మండలం పెనుబాక గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యమిది. రెండు నెలల కిందట ఈ గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఇక్కడి రెండు వీధుల్లో రూ.5 లక్షల అంచనా వ్యయంతో మురుగుకాలువల నిర్మాణానికి మోక్షం కలిగింది. విద్యుత్ స్తంభాలు మార్చేందుకు రూ. 5 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు రోజుల్లో కాలువల పనులు ప్రారంభమవుతాయని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, సర్పంచ్ బోడమ్మ చెబుతున్నారు.

బురద కష్టాలకు చెక్



ఇది చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో నిర్మిస్తున్న డ్రైనేజీ. వాస్తవానికి ఇక్కడి ఎస్సీ కాలనీలో ఎన్నో ఏళ్లుగా బురద సమస్య ఉంది. వీధి కాలువల్లేక వర్షపునీరే కాదు ఇళ్లల్లో వాడుక నీరు కూడా రోడ్డుపైనే స్తంభించేది. దీంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా ఉంటోంది. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆ సమస్య తీరలేదు. ఇన్నాళ్లకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో వారి కష్టాలు తీరనున్నాయి. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశాలతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ కాలనీలో రెండు చోట్ల రూ.3 లక్షల చొప్పున నిధులతో కాలువలు నిర్మిస్తున్నారు.

వాడుకనీరు మళ్లింపునకు కాలువల నిర్మాణం



నీరు నిలిచిపోయి నిత్యం బురదబురదగా ఉండే చీపురుపల్లి మండలం నిమ్మలవలస గ్రామంలోని ప్రధాన బీటీ రోడ్డు ఇది. రాజాంతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి ఇదే మార్గం. వర్షపునీరు, ఇళ్లల్లో వాడుక నీరు స్తంభించడంతో బీటీ రోడ్డు దెబ్బతింటోంది. బురద పేరుకుపోతోంది. ఇటీవల నిమ్మలవలస గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ వద్ద స్థానికులు ఈ సమస్యను ప్రస్తావించారు. వారి ఆదేశాలతో కాలువల నిర్మాణానికి రూ.4.9 లక్షలు మంజూరయ్యాయి. మరో రెండు రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభంకానున్నాయి.

గురుకుల విద్యార్థినులకు స్వల్ప అస్వస్థత

- ఆహారం జీర్ణం కాకపోవడమే కారణం
- ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు
- కోలుకుంటున్న విద్యార్థినులు



ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థినులను పరామర్శిస్తున్న డీఎమ్‌హెచ్‌ఓ రమణ కుమారి

శృంగవరపుకోట: మండలంలోని తాటిపూడి బాలికల గురుకుల విద్యాలయంలో 175 మంది చదువుతున్నారు. వీరంతా గురువారం రాత్రి యథావిధిగా భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. వీరిలో వై.హరిపూజిత, వై.శ్రీదేవి, పి.లిఖిత, డి.వరలక్ష్మి కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో అవస్థ పడ్డారు. వీరిని ఉపాధ్యాయులు ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందించాక తిరిగి కళాశాలకు పంపించారు. శుక్రవారం ఉదయం కె.నవ్యదీపిక, బి.లావణ్య, బి.రమ్య, పి.శ్యామల, పి.వెంకటజయశ్రీ, ఎ.వైష్ణవిప్రియలు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికావడంతో ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ రమణకుమారి, డీసీహెచ్ నాగభూషణరావు, ఆర్డీఓ సూర్యకళ, తహసీల్దార్ శ్రీనివాసరావు ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యం బాగుందని, శనివారం డిశ్చార్జ్ చేస్తామని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.వి.సత్యశేఖర్ తెలిపారు. మరోవైపు కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య, సిబ్బంది తాటిపూడి గురుకులంలో వైద్య శిబిరం నిర్వహించారు. బాలికలందరికీ వైద్య పరీక్షలు చేశారు. ముగ్గురికి స్వల్ప లక్షణాలు ఉండడంతో మందులు అందజేశారు. విద్యార్థినులు నిత్యం తీసుకున్న ఆహారం జీర్ణం కాకపోవడం, నిద్రలేమి వల్లే అస్వస్థతకు గురైనట్టు డీఎమ్‌హెచ్‌ఓ రమణ కుమారి తెలిపారు.

ఐక్యంగా సాగుదాం

- విద్యాశాఖ మంత్రి బొత్స సమక్షంలో బీసీ ప్రజాప్రతినిధుల ఐక్యత
- 7న జరిగే 'జయహో బీసీ మహాసభ' పోస్టర్ ఆవిష్కరణ



జయహో బీసీ మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

విజయనగరం అర్బన్: విజయవాడలో ఈ నెల 7న చేపట్టే 'జయహో బీసీ మహాసభ'కు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో జిల్లా బీసీ ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గృహంలో 'జయహో బీసీ మహాసభ' కార్యక్రమంపై ఉమ్మడి విజయనగరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో శుక్రవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత 'జయహో బీసీ మహాసభ' ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పట్టించుకోని బీసీలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్ల పాలనలో అన్ని రంగాల్లో ప్రాధాన్యమిచ్చారన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా నెల్లూరులోని జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో ప్రకటించిన హామీల్లో 99 శాతం మూడేళ్లలోనే పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రిదని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో భాగంగా మంజూరు చేసిన రూ.1,79,000 కోట్లలో బీసీలకు అత్యధికంగా రూ.83 వేల కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు వంటి ప్రతినిధులతోపాటు పలు నామినేటెడ్ పదవుల పొందిన బీసీ ప్రతినిధులు జిల్లా నుంచి గర్జనకు హాజరవుతారని తెలిపారు. ప్రతీ మండలం నుంచి కనీసం రెండు బస్సులలో బీసీలు బయలుదేరాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు డాక్టర్ పీ.సురేష్ బాబు, రఘురాజు, ఉమ్మడి విజయనగరం జిల్లా ఎమ్మెల్యేలందరూ పాల్గొన్నారు.

తారలు దిగివచ్చిన వేళ...

- అభిమానుల కేరింత
- ఫ్యాన్స్‌తో కిటకిటలాడిన అంబటిసత్రం, రైల్వేస్టేషన్ రోడ్డు



హీరోయిన్లను చూసేందుకు తరలివచ్చిన అభిమానులు





సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌లో తళుక్కుమన్న తారలు



సీఎమ్ఆర్ బయట అభిమానులతో మాట్లాడుతున్న అనుఇమాన్యూయేల్


విద్యలనగరమైన విజయనగరంలో సినీ తారలు శుక్రవారం సందడి చేశారు. అభిమానులను చూసి పులకరించిపోయారు. ముగ్గురు నటీమణులు పట్టణానికి వస్తున్నారని తెలుసుకున్న యువతీయువకులు అంబటిసత్రం జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్డుకు చేరుకున్నారు. అభిమాన హీరోయిన్లను చూసేందుకు పోటీపడ్డారు. అంబటిసత్రం కూడలి వద్ద సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 28వ షోరూంను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. షాపింగ్‌మాల్ దినదినాభివృద్ధి చెందాలని, విజయనగరవాసుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యత కలిగిన వస్త్రాలను, నగలను అందించాలని ఆకాంక్షించారు. అనంతరం సర్దార్ ఫేమ్ రాశి ఖన్నా, ఆర్ఎక్స్100, జిన్నా ఫేమ్ పాయల్ రాజ్‌పుత్‌లు షోరూమ్‌ను సందర్శించారు. అన్నిరకాల వస్త్రాలు, బంగారు ఆభరణాలను చూసి మురిసిపోయారు. ప్రతి ఒక్కరూ షాపింగ్ మాల్‌ను సందర్శించి, నచ్చినవి కొనుగోలు చేయాలని కోరారు. తమ సినీ అనుభవాలను అభిమానులతో పంచుకున్నారు. అలాగే, రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న సీఎమ్ఆర్ షాపింగ్ మాల్ పునఃప్రారంభంలో పాల్గొన్న ఊర్వశివో.. రాక్షసివో సినీ ఫేమ్ అనూ ఇమాన్యుయేల్ అభిమానులతో కేరింతలు కొట్టించారు. సినీ డైలాగ్‌లతో అలరించారు.

– విజయనగరం టౌన్

క్లుప్తంగా

ఆద్యంతం ఆధ్యాత్మికం

● ఆకట్టుకున్న గరికిపాటి ప్రసంగం


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న గరికపాటి నరసింహారావు

విజయనగరం టౌన్: మహాసహస్రావధాని గరికపాటి నరసింహారావు స్థానిక పశుపతి నాథేశ్వర స్వామి ఆలయం, జ్ఞాన సరస్వతి ఆలయ మంటపంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆధ్యాత్మిక ప్రవచన ప్రసంగంలో తొలిరోజు త్రిశక్తి కటాక్షంపై వివరించారు. సరస్వతి అమ్మవారి విశిష్టత, పిల్లల చదువులపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన తీరుతెన్నులు, వారు నడుచుకోవాల్సిన విధానాలను స్పష్టంగా తెలియజేశారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్దసంఖ్యలో వచ్చిన గరికపాటి అభిమానులు ఆద్యంతంశ్రద్ధగా ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. కార్యక్రమాన్ని శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.

మాజీ ఎంపీకి గురజాడ కవితా బహుమతి


సాహితీవేత్త జక్కు రామకృష్ణ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం టౌన్: ఇటీవల గురజాడ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కవితా పోటీల్లో విజేతగా నిలిచినందుకు మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ డీవీజీ.శంకరరావును ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ మేరకు శుక్రవారం గురజాడ స్వగృహంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ చేతుల మీదుగా మాజీ ఎంపీని సత్కరించి ,ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే కన్యాశుల్కం పుస్తకాన్ని గురజాడ ఇందిర ఆయనకు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు చేయూత ఇవ్వాలి


దివ్యాంగులతో జగదీష్‌బాబు

కొత్తవలస రూరల్: దివ్యాంగులపై ప్రపంచం మొత్తం జాలి చూపిస్తుందని, వారికి కావలసింది జాలి కాదని, కొండంత తోడు. వారి కాళ్లపై వారు నిలవడానికి కావలసిన శిక్షణ, ప్రోత్సాహం అని గురుదేవా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్‌బాబు అంటున్నారు. గడిచిన 20 సంవత్సరాలలో లక్ష మందికి పైగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, కాలిపర్స్, వీల్‌చైర్లు అందిస్తూ 9 రాష్ట్రాలలో దివ్యాంగులకు ఆయన అండగా నిలుస్తున్న ఆయన దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా జీవించేందుకు కుట్టు, పేపర్ ప్లేట్ల తయారీలో శిక్షణ ఇస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. ఆయన అందించిన అవయవాలకు ప్రతి 6 నెలలకు ఒకసారి మరమ్మతులు కూడా ఉచితంగా చేస్తున్నారు. వాటికి అదనంగా గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో 30 పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చి నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఆ ఆస్పత్రిలో అంకాలజీ, న్యూరోఫిజీషియన్, పిడియాట్రిక్, గైనిక్ తదితర సమస్యలు ప్రత్యేక వైద్యులు సేవలు అందిస్తున్నారు.

ధాన్యం సేకరణకు.. గోనెసంచుల కొరత రానివ్వం

● జీడి, అరటి పంటలకు బీమా వర్తించేందుకు కృషి
● జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
● స్థాయీ సంఘం సమావేశాల్లో పలు అంశాలపై చర్చ


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


హాజరైన సభ్యులు

విజయనగరం గంటస్తంభం: రెండు జిల్లాల్లో జీడి, అరటి పంటలకు బీమా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అవసరమైన గోనె సంచులను సరఫరా చేస్తామన్నారు. జిల్లా పరిషత్ ఏడు స్థాయీ సంఘాల సమావేశాలను, ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జెడ్పీ సమావేశ భవనంలో శుక్రవారం వరుసగా నిర్వహించారు.

ముందుగా జరిగిన 3వ స్థాయీ సంఘం సమావేశంలో, వ్యవసాయం, ధాన్యం సేకరణ అంశాలపై జరిగిన చర్చ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, గోనెసంచుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని, కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోతలు జరిగి, కొనుగోలుకు ధాన్యం సిద్ధంగా ఉన్నచోట, వెంటనే గోనె సంచులను పంపిస్తామని తెలియజేశారు. విజయనగరం జిల్లాలో జీడి పంటకు, పార్వతీపురం జిల్లాలో అరటి పంటకు బీమా సదుపాయం ఉందని చెప్పారు. ఈ రెండు పంటలకూ రెండు జిల్లాల్లో బీమా సదుపాయాన్ని కల్పించేందుకు, సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. దీనివల్ల వేలాదిమంది పేద రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. జిల్లాలో పశు సంపద వద్ధికి ప్రభుత్వం వివిధ రకాల చర్యలు తీసుకుందని చెప్పారు. కత్రిమ గర్భధారణ పద్ధతుల ద్వారా మేలు జాతి పశు సంపదను వృద్ధి చేస్తారని తెలిపారు.

మిల్లర్ల ప్రమేయం లేకుండా కొనుగోలు

సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, పలువురు ఇతర సభ్యులు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలులో ఎక్కడా మిల్లర్ల ప్రమేయం లేకుండా, అత్యంత పారదర్శకంగా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. గోనె సంచులను ప్రభుత్వమే పూర్తిగా సరఫరా చేయాలని లేనిపక్షంలో రైతులనే సమకూర్చుకోవాలని సూచించాలని, తగినన్ని సరఫరా కాకపోతే, పరిస్థితి గందరగోళంగా మారుతుందని అభిప్రాయ పడ్డారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని, మండల స్థాయిలో వెంటనే సమావేశాలను నిర్వహించాలని సూచించారు. స్థాయీ సంఘం సమావేశాల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, 6వ స్థాయీ సంఘం చైర్మన్, జెడ్పీ వైస్ చైర్మన్ కొరద్రన్ని సింహాచలం, 5వ స్థాయీ సంఘ చైర్‌పర్సన్ సంకిలి శాంత కుమారి, జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, రెండు జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించడమే ధ్యేయం

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు


కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు

గుర్ల: ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే ధ్యేయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అన్నారు. మండలంలోని కెల్లలో జలజీవన్ మిషన్ కింద రూ. కోటి 24 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఇంటింటి కుళాయి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా, ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందిస్తామన్నారు. కెల్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీపీ పాట్నూరు ప్రమీల, సర్పంచ్ కెల్ల లక్ష్మి, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, పాట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, వరదా ఈశ్వరరావు, అంబళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్స్ దొంగ అరెస్ట్

● అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్


మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్

సీతానగరం: రెండు జిల్లాల్లో మోటార్ సైకిల్స్ చోరీచేస్తూ జల్సాగా తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ జల్సాలకు అలవాటుపడి తేలికగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో మోటార్ సైకిల్స్ చోరీ చేస్తున్న నిందితుడు..పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో సీతానగరం ఎస్సై కె.నీలకంఠం, సిబ్బందికి పట్టుబడినట్లు తెలియజేశారు. పార్వతీపురం మండలం అడ్డాపుశీల పంచాయతీ పిన్నింటి రామినాయుడువలస గ్రామానికి చెందిన మోటార్ సైకిల్ చోరీ కేసులో అరెస్ట్ చేసిన నిందితుడు మరిపి గోవింద రావు అలియాస్ గౌతమ్ ఇంటర్మీడియట్ వరకు చదువుకుని వెల్డింగ్ పనులు చేసుకుంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై, అక్రమమార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలు అలవాటు చేసుకున్నాడన్నారు. గతంలో నిందితుడు గోవిందరావుపై పార్వతీపురం టౌన్, విజయనగరం 1 టౌన్ పోలీస్ స్టేషన్, విజయనగరం 2 టౌన్ పోలీస్ స్టేషన్, సీతానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారం, మోటార్ సైకిల్స్ చోరీకి పాల్పడి జైలుకి వెళ్లి వచ్చినట్లు రికార్డుల్లో నమోదై ఉందన్నారు. ప్రస్తుతం ఎల్విన్ పేట, బొబ్బిలి, రాజాం, బాడంగి, పెదమానాపురం సీతానగరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10 మోటర్ సైకిల్స్ చోరీకి పాల్పడినట్లు తెలియజేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన మంత్రి


బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

గుర్ల: చీపురుపల్లి నుంచి నాగళ్లవలస మీదుగా విజయనగరం వరకు ప్రత్యేక బస్ సర్వీసును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. నెల రోజుల క్రితం నాగళ్లవలస సచివాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి బొత్సతో.. గ్రామం నుంచి కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, బస్సు సర్వీసు ప్రారంభించాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు విద్యార్థుల ఉన్నత శ్రేయస్సు కోసం, చదువుకునే విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మంత్రి బొత్స సత్యనారాయణ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ప్రత్యేక బస్ సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చారు. బస్సు సర్వీసును ప్రారంభించిన అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఆర్టీసీ రిజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ , ఎంపీపీ పాట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, విద్యార్థులు ప్రయాణించారు. బస్ సర్వీస్ ప్రారంభించిన మంత్రి బొత్స సత్యనారాయణకు విద్యార్థులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వరదా ఈశ్వరరావు, బెల్లాన బంగారునాయుడు, అంబళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వెళ్లి పింఛన్ అందజేత


లబ్ధిదారు బలగ నారాయణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కింతల ప్రియాంక

పార్వతీపురం టౌన్: ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వృద్ధురాలి దగ్గరికి వలంటీర్ వెళ్లి పింఛన్ అందజేసింది. మండలంలోని సంగంవలస గ్రామానికి చెందిన బలగ నారాయణమ్మ శ్రీకాకుళం జిల్లా రాగోలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ కింతలి ప్రియాంక వెళ్లి అక్కడికి వెళ్లి పింఛన్ అందజేయడంతో ఆమె సేవాభావాన్ని లబ్ధిదారుతో పాటు కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

భార్యాపిల్లలను అప్పగించిన పోలీసులు


భార్యాభర్తలకు కౌన్సెలింగ్ చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

వీరఘట్టం: తన భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు మండలంలోని నడుకూరు గ్రామానికి చెందిన వ్యక్తి గురువారం ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేసి 24 గంటల్లోనే వారి ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం భార్యాభర్తలకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ చేసి తల్లీపిల్లలను భర్తకు అప్పగించారు. ఇక నుంచి కుటుంబసభ్యులంతా హాయిగా జీవనం సాగించాలని హితవు పలికారు. చిన్నచిన్న విషయాలకు అనవసరంగా మనస్పర్థలు తెచ్చుకోవద్దని సూచించారు. 24 గంటల్లోనే వివాహిత, పిల్లల ఆచూకీని గుర్తించిన ఎస్సై ఎం.హరికృష్ణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రాష్ట్రస్థాయి కుస్తీపోటీలకు శ్రీరాం కళాశాల విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శ్రీరాం జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో డిసెంబర్-1న జరిగిన కుస్తీ పోటీల్లో అండర్-19 విభాగంలో కళాశాలకు చెందిన వి.లావణ్య, ఎం.రోహిణి, ఎ.భాగ్యశ్రీ, ఆరుద్ర, వి.మురళీకృష్ణ, డి.మధు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని గాయత్రి 15వందలమీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించి భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,అకడమిక్ అడ్వైజర్ రవి, పీడీలు శ్రీనివాస్, భానుమూర్తి అభినందించారు.

నాణ్యమైన వస్త్రాల విక్రయంతో సీఎమ్ఆర్‌కు మంచి గుర్తింపు

● ఆ సంస్థ అధినేత మావూరి వెంకటరమణ
● సినీ నటి అనూ ఇమాన్యుయేల్ సందడి


కొనుగోలుదారులకు స్పాట్ గిఫ్టలను అందజేస్తున్న సినీనటి అనూ ఇమాన్యుయేల్

విజయనగరంటౌన్: కొనుగోలుదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించడంతో సీఎమ్ఆర్ షాపింగ్‌మాల్ ప్రజల ఆదరణ చూరగొందని సీఎమ్ఆర్ సంస్థ అధినేత మావూరి వెంకటరమణ పేర్కొన్నారు. విజయనగరం రైల్వేస్టేషన్ వద్దనున్న సీఎమ్ఆర్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 వసంతాలు పూర్తిచేసుకుని తమ సంస్థ మంచి గుర్తింపు పొందిందన్నారు. వినియోగదారులకు మంచి ఆఫర్లతో స్పాట్ గిఫ్టలను అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఊర్వశివో..రాక్షసివో ఫేమ్ సినీ నటి అనూఇమాన్యూయేల్ సందడి చేశారు. జ్యోతిప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌లో కలియతిరిగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అతి తక్కువ ధరలకు నాణ్యమైన వస్త్రాలను వినియోగదారులకు అందించడంలో సీఎమ్ఆర్ షాపింగ్‌మాల్‌కు మరేదీ సాటిరావన్నారు. పలువురు కొనుగోలుదారులకు స్పాట్ గిఫ్టలను అందజేసి ఆనందాన్ని నింపారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ సిబ్బంది, కొనుగోలు దారులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 540.00
విజయనగరం	రూ. 544.00
శ్రీకాకుళం	రూ. 544.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	53,730-00
బంగారం(22సి. 10గ్రా.)	49,250-00
వెండి (కిలో)	71,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

జాతీయస్థాయి చిత్రలేఖన పోటల్లో ధర్మవరం విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

శృంగవరపుకోట: ముంబైకి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ధర్మవరం జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి కిలారి శ్యాం సుందర్ ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. గడిచిన ఆగస్టు నెలలో ఆన్‌లైన్‌లో ఈపోటీలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం రహీం షేక్ లాల్ తెలిపారు. తమ విద్యార్థికి బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని ఆ సంస్థ అందజేసిందని హెచ్ఎం తెలియజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థిని హెచ్ఎంతో పాటు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు శుక్రవారం అభినందించారు.

యువకుడి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై భాస్కరరావు


రాజాం సిటీ: రాత్రి 11 గంటల వరకు తమ్ముడితో పిచ్చాపాటి కబుర్లు చెప్పిన సోదరుడు తెల్లవారేసరికి విగతజీవిగా మారడాన్ని ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోయింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఏఎస్సై భాస్కరరావు తెలిపారు. రాజాం పట్టణంలోని పుచ్చలవీధికి చెందిన అనుపోజు రమేష్ (32) బంగారం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 1న రాత్రి మేడపై ఇంట్లో నిద్రించేందుకు వెళ్లాడు. అతనితోపాటు తమ్ముడు హరీష్ కూడా 11 గంటల వరకు ఉన్నాడు. వారిద్దరూ అంతవరకు గత నెల 30న జరిగిన తమ వదినమ (పెద్ద సోదరుడి భార్య) సీమంతపు విశేషాల గురించి మాట్లాడుతూ సంతోషంగా గడిపిన అనంతరం హరీష్ కింద ఇంట్లో నిద్రించేందుకు వచ్చాడు. ఏమైందో కానీ ఉదయం 7.30 గంటలైనా రమేష్ కిందికి రాకపోవడంతో తల్లి కళావతి పైకి వెళ్లి చూసింది. పైన ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన కుమారుడిని చూసి నిర్ఘాంత పోయి కేకలు వేసింది. దీంతో వీధివాసులతోపాటు కుటుంబ సభ్యులు వెళ్లి చూసి ఫ్యాన్‌కు వేలాడుతున్న రమేష్‌ను కిందికి దించారు. అప్పటికే మృతిచెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. రమేష్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోయి మద్యానికి బానిసయ్యాడు. సోదరులు కొంతమేర అప్పులు తీర్చినప్పటికీ ఇంకా మిగిలి ఉండడం, బంగారం పనికూడా సరిగా లేకపోవడంతో అప్పులు తీర్చే మార్గం దొరక్క తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న ప్రవల్లిక

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలం సింగనాపురం పంచాయతీకి చెందిన విద్యార్థిని ఎం.ప్రవల్లిక మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. వరుసకు బాబాయి అయిన శివ ఆమెను ఎప్పుడూ టీజ్‌చేస్తూ వేధించేవాడు. ఈవిషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపినా పట్టించుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో వరుసకు ఆమె సోదరుడు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెకు తల్లిలేదు. విశాఖలో ఉంటున్న తండ్రి నిత్యం మద్యం తాగుతూ పట్టించుకోవడంలేదు. వివాహితుడైన శివ పార్వతీపురంలో బజాజ్ ఆటో షోరూంలో పనిచేస్తున్నాడు.

ఎలుకల మందు తాగి వివాహిత..


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నమ్మ

పార్వతీపురం: పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలసలో గల కొత్తపోలమ్మ కాలనీకి చెందిన చదునుపల్లి చిన్నమ్మ ఎలుకల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యా యత్నం చేసింది. ఆమెకు వివాహమై పదేళ్లు గడిచాయి. ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయికి జన్మనిచ్చింది. భర్త చంద్రరావు ఏడు నెలల క్రితం చనిపోయాడు. భర్తను మరిచిపోలేక, ముగ్గురు పిల్లలను పోషించలేక మనస్తాపంతో ఎలుకల మందు తాగేసింది. ఆమె పరిస్థితిని చుటుపక్కల వారు గమనించి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈమేరకు ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు పార్వతీపురం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు

పార్వతీపురంటౌన్: జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలకు పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన కశ్మీర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ క్రీడలకు కళాశాలకు చెందిన పుల్లేరు పాలి, పుల్లేరు ప్రవీణ్ ఎంపిక కావడం హర్షణీయమన్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు, పార్వతీపురం మన్యం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, తదితరులు

డెంకాడ: ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ సందర్భంగా డెంకాడ గ్రామంలోని టీబీ రోగులకు రొంగలి సత్యవతి సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం చేతుల మీదుగా సరుకులు అందించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పావని, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



అర్చకుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న యువత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన అర్చకుడి కుటుంబానికి గ్రామ యువత ఆర్థిక సాయం అందజేశారు. శివాలయ అర్చకుడు బండారు బ్రహ్మానందం కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ నిరుపేదలు కావడంతో యువకులు రూ. 75 వేలు పోగుచేసి శుక్రవారం అందించారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు వలంటీర్ పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలోని భోగాపురం, సవరవిల్లి, కొండ్రాజుపాలెం గ్రామాల్లో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టులకు గాను 8 మంది అభ్యర్థులు హాజరుకాగా.. అధికారులు ఇంటర్వ్యూ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, సీనియర్ అసిస్టెంట్ హేమసుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

దుక్కు లేకుండా మొక్కజొన్న సాగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త యోగేష్‌కుమార్

నెల్లిమర్ల రూరల్: వరి మాగాణిలో సీడ్‌డ్రిల్ యంత్రంతో దుక్కు లేకుండా నేరుగా మొక్కజొన్న సాగు చేసుకోవచ్చునని అంతర్జాతీయ మొక్కజొన్న పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త (న్యూఢిల్లీ) యోగేష్‌కుమార్ సింగ్ తెలిపారు. మండలంలోని పినతరిమిలో రైతులకు క్షేత్రస్థాయిలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూలీల కొరత అధికంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో వరికోతల అనంతరం దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ విధానంతో ఖర్చు ఆదా అవుతుందన్నారు. పైగా నేలలో ఉన్న పోషకాలు సమృద్ధిగా అంది పంట ఏపుగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త లక్ష్మీనరసింహమూర్తి, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులు రాజ్యాంగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఫూల్‌బాగ్‌లోని అయ్యప్పనగర్‌లో మోడల్ స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజ్యాంగంపై పౌరులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రాజ్యాంగంపై డిబేట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సానా పర్వీన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నగరాభివృద్ధే ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



రహదారి శిలాఫలకం ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: నగర అభివృద్ధే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. స్థానిక మయూరి జంక్షన్‌లో రూ.4.22 కోట్లతో నిర్మిస్తున్న రహదారికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మయూరి నుంచి బాలాజీ జంక్షన్ వరకు ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రహదారి నిర్మించనున్నట్లు చెప్పారు. నగరంలో అసంపూర్తిగా మిగిలి ఉన్న రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలోనే కలెక్టరేట్ నుంచి కంటోన్మెంట్ వరకు రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అనేక ప్రధాన రహదారుల నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయని తెలిపారు. అటువంటి రోడ్లను కూడా పూర్తి చేస్తామన్నారు.

కోలగట్ల కృషి అభినందనీయం..

నగర అందాలను ఇనుమడింపజేసే విధంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు అన్నారు. 17వ డివిజన్‌లోని పాత బస్టాండ్ ప్రాంతం నుంచి ఏర్పాటు చేయనున్న డివైడర్ గ్రిల్లింగ్ పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశపు వేణు మాట్లాడుతూ, పాత బస్టాండ్ ప్రాంతం నుంచి డివైడర్ డ్రిల్లింగ్ పనులను 19 లక్షల రూపాయలతో చేపడుతున్నామన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన నగరాన్ని ఎమ్మెల్యే సహకారంతో అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా నిలుపుతున్నామన్నారు. ఓ వైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి సమపాలల్లో చేపడుతూ ప్రజలకు చేరువవుతున్నామని తెలిపారు. శాసనసభ్యుడిగా గెలుపొందినప్పటి నుంచి వార్డు పర్యటనలు చేస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కోలగట్ల కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, జోనల్ ఇన్‌చార్జ్ బంగారు నాయుడు, బోడసింగి ఈశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు జీవీ రంగారావు, గాదెం మురళి, బండారు ఆనందరావు, దాసరి సత్యవతి, బోనెల ధనలక్ష్మి, భోగాపురపు రవిచంద్ర, వజ్రపు శ్రీను, నామాల సర్వేశ్వరరావు, గుండు వీరభద్రరావు, ముద్దాడ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

- డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నవంబర్ 9వ తేదీ నుంచి జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమానికి రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో మార్పులు – చేర్పుల కోసం, కొత్త ఓటర్ల నమోదు కోసం డిసెంబర్ 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజల్లోకి ఈ అంశాన్ని విస్తృతంగా తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందేలా చొరవ చూపాలని కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని జిల్లాలోని ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. డిసెంబర్ 3, 4 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నుంచి రొంగలి పోతన్న, జనసేన ప్రతినిధి ఆదాడ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యుడి వితరణ



కలెక్టర్ సూర్యకుమారికి చెక్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు గరివిడి జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు రూ.40 వేల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని కలెక్టర్ ఎ.సూర్యకుమారికి జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం అందజేశారు. శ్రీనివాసరావు కొద్ది నెలల ముందు కూడా రెడ్‌క్రాస్‌కు 10 వేల రూపాయల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాల అడ్డగింత

భోగాపురం: మండలంలోని రావాడ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 64–1 కొండ పోరంబోకు స్థలంలో గ్రావెల్ తవ్వకాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి చేరుకోగానే అక్రమార్కులు వాహనాలతో సహా పరారయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోతున్నారని గ్రామస్తులు తెలిపారు. తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వీఆర్‌ఓ తెలిపారు.

ముగ్గురి అదృశ్యం

విజయనగరం క్రైమ్: వ్యసనాలకు బానిసై కుటుంబ పోషణను పట్టించుకోకుండా బయటకు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి గురువారం ఇంటినుంచి వెళ్లిన ధర్మపురి బీసీ కాలనీకి చెందిన బూర్లి జగన్నాథం తిరిగి రాకపోవడంతో భార్య భవాని రూరల్ పోలీసులను ఆశ్రయించి శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రూరల్ హెచ్‌సీ రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మండల పరిధిలోని రాకోడు గ్రామానికి చెందిన బుత్తల అప్పలకొండ అనే మహిళ, కుమారుడు శ్యామ్ కుమార్‌తో కలిసి నవంబరు 18న రాకోడులో ఉన్న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి, ఇప్పటి వరకూ తిరిగి రాలేదని బాధితకుటుంబ సభ్యులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభయహస్తం పింఛన్ల పంపిణీ



అభయహస్తం పింఛను డబ్బులు అందజేస్తున్న అనంతం

చీపురుపల్లి: అర్హత ఉన్న ప్రతీ లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు ఏపీఎం ఎంపీ రాజశేఖర్‌తో కలిసి అభయహస్తం పింఛను లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్ నగదులు పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా 11 అభయహస్తం పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు అర్హత ఆధారంగా అభయహస్తం పథకం కింద నెలకు రూ.500 పింఛన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. పింఛను కోసం ఎలాంటి పైరవీలు అవసరం లేదని, అర్హత ఉంటే వలంటీర్ల సాయంతో సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు వాటిని పరిశీలించి పింఛను మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మీసాల రమణ, పనస అప్పారావు, దాలయ్య, అప్పన్న, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు కత్తెర పురుగు



చౌడవాడలో మొక్కజొన్న సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పూసపాటిరేగ: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశిస్తోందని శాస్త్రవేత్త ఎం. స్వాతి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె. భారతి అన్నారు. మండలంలోని చౌడవాడ ఆర్‌బీకే పరిధిలోని మొక్కజొన్న పంట పొలాలను శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రారంభదశలోనే కత్తెర పురుగును నివారించాలన్నారు.

స్థానిక వ్యవసాయాధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పరిశీలనలో ఏఓ కె. నీలిమ, ఆర్‌బీకే ఇన్‌చార్జ్ ఎ. పార్థసారథి, రైతులున్నారు.

పాడిరైతులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీడీ రామచంద్రరావు

గంట్యాడ: ఆడపెయ్యి దూడల ఉత్పత్తి పథకంపై పాడిరైతులకు అవగాహన కల్పించి, వినియోగించుకునేలా చూడాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎ.రామచంద్రరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో శుక్రవారం వైద్యులు, పరావెట్స్, గోపాల మిత్రలకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో ప్రభుత్వం పెయ్యి దూడల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా ఎదకు వచ్చే ఆవు, లేదా గేదెకు ఆడదూడలు పుట్టేలా ఇంజిక్షన్ చేస్తారని, ఇందుకోసం పాడిరైతులు రైతుభరోసా కేంద్రంలో గాని, పశు వైద్యశాలలో గాని ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పాడి ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఎస్.దామోదరరావు, ఏడీ రెడ్డి కృష్ణ, వైద్యులు నరేష్, అప్పలనాయుడు, సంధ్య, అంజలి, గీతరాణి, సత్యనారాయణ, లక్ష్మి పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో డ్రైడే అమలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

గంట్యాడ: పరిసరాల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రైడే కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. అపరిశుభ్రత వల్ల వ్యాధులు వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితులు ఉంటే వారికి వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. వృద్ధులు, బెడ్‌రెస్ట్ పేషెంట్లకు వారి ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శీతల్‌వర్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా గ్రామకంఠం భూముల సర్వే

బొండపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ కంఠం భూముల గుర్తింపు సర్వే చురుగ్గా జరుగుతోందని తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా తెలిపారు. గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా ఎలాంటి హక్కులకు నోచుకోని ఉన్న గ్రామకంఠం భూములను సర్వే చేసి పూర్తి నివేదికను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. సర్వే నివేదికతో గ్రామకంఠం సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: ఘంటసాల శతజయంతిని పురస్కరించుకుని ఆయనకు భారతరత్న ఇవ్వాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రా, తెలంగాణ ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. శుక్రవారం స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో ప్రశాంతి సంగీత వాయిద్య శిక్షణ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అమర గాయకునికి అమృత గలార్చన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి ఘంటసాల చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఘంటసాల ఒక పరిపూర్ణ గాయకుడన్నారు. ఎన్నో మధురమైన గీతాలను పాడి తెలుగు వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మధుర గాయకుడని కొనియాడారు. అనంతరం డాక్టర్ శరత్‌చంద్ర స్వర సారథ్యంలో అమృత గలార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డిప్యూటీ స్పీకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపుగంటి ప్రకాష్, గ్రంధి విష్ణుమూర్తి, ఎం.రామారావు, ముచ్చు రామలింగస్వామి, సంగీత కళాశాల అధ్యాపక సిబ్బంది, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

రైతులు మోసపోకూడదు..



చొల్లంగిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

- ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు

డెంకాడ: రైతులు దళారుల చేతులో మోసపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తోందని ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు అన్నారు. మండలంలోని చొల్లంగిపేట ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ వాసుదేవరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్ము నాయుడు, డెంకాడ సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు.

కార్యక్రమంలో ఏఓ నిర్మల, డీటీ సూర్యకాంతం, సర్పంచ్ కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పతివాడ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుజ్జిరాజు, చిట్టిబాబు, తొత్తడి శ్రీను, పలువురు రైతులు, నాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో మహిళలకు స్విమ్మింగ్ పూల్

- కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లు



ప్రకాశం పార్కులో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం: నగరంలో మహిళలకు త్వరలో ఓ స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తామని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ప్రకాశంపార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ఎమ్మెల్యే కోలగట్ల సహకారంతో నగరంలోని పార్క్‌లను సుందరంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రకాశం పార్క్‌ను అభివృద్ధి చేయడానికి కోటి 80 లక్షల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధులతో పిల్లలకు ప్రత్యేకంగా క్రీడా ప్రాంగణం, మహిళలకు స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తామన్నారు. నగర సుందరీకరణలో భాగంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్ బండారు ఆనందరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మహిళలకు పెరటికోళ్లు అందజేస్తున్న ఉప్పాడ, తదితరులు

భోగాపురం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పెరటికోళ్లు పంపిణీ చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని సవరవిల్లి రైతుభరోసా కేంద్రంలో సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో మండల మహిళ సమాఖ్య సంఘ సభ్యులకు బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా మంజూరైన పెరటికోళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలానికి 50 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కో యూనిట్‌లో 11 కోళ్లు, 8 దాణా ప్యాకెట్లు (ఒక్కో ప్యాకెట్ 30 కిలోలు) 3 పెట్టెలు ఉంటాయని చెప్పారు. మహిళలు పెరటికోళ్లను బాగా పెంచుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పట్నా తాతయ్యలు, ఏసీ రాజ్‌కుమార్, ఏపీఎం రమణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లింగవివక్షకు ముగింపు పలుకుదాం..



పురిటిపెంటలో లింగవివక్ష నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం, పురిటిపెంట గ్రామాల్లో వైకేపీ ఏపీఎం యు.జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు లింగ వివక్షపై శుక్రవారం అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు, దాడులు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు గ్రామంలోని మహిళలను చైతన్యం చేయాలని సూచించారు. మహిళల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ వంటి వివిధ రకాల రుణాలను అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం లింగ వివక్షకు ముగింపు పలకాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఎం(ఎఫ్‌పీఓ) ఎస్.సత్యవతి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ జి.రామునాయుడు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

గంట్యాడ: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని కొర్లాం గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలనపై పొదుపు సంఘాల మహిళలతో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల బాలికల్లో ఆరోగ్య సమస్యలు వస్తాయని, పుట్టే పిల్లలు కూడా తక్కువ బరువుతో, పౌష్టికాహార లోపంతో పుట్టే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్‌లైన్, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ర్యాలీలో సీసీలు చిన్నంనాయుడు, అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జస్టిస్ సీతారామిరెడ్డికి హైకోర్టు ఘన నివాళి

సాక్షి, అమరావతి: అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.సీతారామిరెడ్డికి హైకోర్టు ఘనంగా నివాళి అర్పించింది. ఇటీవల కన్నుమూసిన జస్టిస్ సీతారామిరెడ్డికి నివాళులు అర్పించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలో న్యాయమూర్తులందరూ శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. న్యాయవ్యవస్థకు జస్టిస్ సీతారామిరెడ్డి అందించిన సేవలను ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ పీకే మిశ్రా, అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ తదితరులు కొనియాడారు. ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

బ్యాంక్‌లో రూ.3.5 కోట్ల విలువైన నగలు చోరీ

దొడ్డబళ్లాపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా దొడ్డ తాలూకా జి.హొసహళ్లిలోని కర్ణాటక గ్రామీణ బ్యాంక్‌లో భారీ చోరీ జరిగింది. రూ.3.5 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.14 లక్షలను దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటన గత నెల 26న తెల్లవారుజామున జరగ్గా బ్యాంక్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయకుండా జాప్యం చేశారు. గురువారం హొసహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసు అధికారులు వచ్చి పరిశీలించారు. దుండగులు ప్రధాన ద్వారం వద్ద షెట్టర్‌ను గ్యాస్ కట్టర్‌తో తొలగించి లోపలకు చొరబడి లాకర్లు తెరచి ఆభరణాలు, నగదును దోచుకున్నారు. ముసుగులు ధరించిన ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీసీటీవీలో నమోదైంది. జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి శుక్రవారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. హొసహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి దొంగల కోసం గాలింపు చేపట్టారు. బ్యాంక్ అధికారుల జాప్యంపై కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.

క్రికెట్ కార్యకలాపాలు మాకు ముఖ్యం కాదు

- ఏసీఏ ప్రస్తుత కార్యవర్గం విజ్ఞప్తిని తోసిపుచ్చిన ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అపెక్స్ కౌన్సిల్ ఎన్నిక ఫలితాలను వెల్లడించవద్దని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాలని, ఇందుకు సంబంధించి లంచ్ మోషన్ రూపంలో అప్పీల్ దాఖలు చేసేందుకు అనుమతివ్వాలన్న ఏసీఏ ప్రస్తుత కార్యవర్గం తరఫు న్యాయవాది ఎస్.రవిప్రసాద్ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అత్యవసరంగా విచారించాల్సినంత కేసు కాదని హైకోర్టు స్పష్టంచేసింది. లంచ్‌మోషన్‌కు అనుమతిని నిరాకరిస్తున్నట్లు తెలిపింది. క్రికెట్ కార్యకలాపాలు తమకంత ముఖ్యం కాదని తేల్చిచెప్పింది. కానీ, శనివారం ఎన్నిక, సర్వసభ్య సమావేశం జరగనుందని రవిప్రసాద్ తెలిపారు. క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ వంటివి తమకు ఎంతమాత్రం ముఖ్యం కాదని, అంతకుమించి ముఖ్యమైన కేసులు చాలా తమ ముందున్నాయని ధర్మాసనం తేల్చిచెప్పింది.

బీసీ సబ్‌ప్లాన్ నిధులు దిగమింగారు: కొల్లు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ఎత్తివేసి 16,800 మందికి రాజ్యాధికారం దూరం చేసిందని, బీసీల సబ్ ప్లాన్ నిధులు రూ.34 వేల కోట్లు దిగమింగారని టీడీపీ నేత కొల్లు రవీంద్ర ఆరోపించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల కోసం టీడీపీ తెచ్చిన పథకాలన్నింటినీ జగన్ రద్దు చేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 26మంది బీసీ నేతల్ని హత్య చేశారని ఆరోపించారు. బీసీలపై ఎనలేని ప్రేమాభిమానాలున్నట్టు, వారిని నమ్మించే ప్రయత్నం చేస్తున్న సీఎం పెట్టిన సభకు పేరే దొరక్కపోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ ప్రపంచ వ్యాప్తంగా ఎలుగెత్తిచాటిన 'జయహో బీసీ' నినాదమే వారికి దిక్కయిందని విమర్శించారు.

నారా లోకేశ్‌పై కేసు కొట్టివేత

సాక్షి, అమరావతి: కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించారంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు గతేడాది నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టేసింది. పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా విజయవాడ కోర్టులో జరుగుతున్న విచారణను రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈఎస్ఐ అక్రమాలకు సంబంధించి కార్మిక శాఖ మాజీ మంత్రి అచ్చెన్నాయుడును గతేడాది పోలీసులు అరెస్ట్ చేసి విజయవాడ కోర్టుకు తీసుకొచ్చారు. అక్కడికి వచ్చిన లోకేశ్ కోవిడ్ మార్గదర్శకాలను ఉల్లంఘించారని పోలీసులు కేసు నమోదు చేశారు.

అంకబాబుపై సీఐడీ కేసు కొట్టివేత

పాత్రికేయుడు కొల్లు అంకబాబుపై సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం హైకోర్టు కొట్టేసింది. గన్నవరం విమానాశ్రయంలో బంగారం స్మగ్లింగ్ ఘటనతో సీఎం కార్యాలయంలో పనిచేసే ఓ అధికారికి సంబంధం ఉందంటూ వాట్సాప్‌లో వచ్చిన సందేశాన్ని వ్యాప్తి చేసి, వ్యక్తుల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారంటూ అంకబాబుపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ అంకబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



విశాఖ జిల్లా మధురవాడలో మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కృష్ణా జిల్లా కలపటంలో సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న మంత్రి జోగి రమేష్

గడప గడపకు మన ప్రభుత్వం



ప్రకాశం జిల్లా సీతానాగులవరంలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ఎస్పీఎస్సార్ నెల్లూరు జిల్లా లేగుంటపాడులో బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

నేవల్, మెరైన్ హబ్‌గా విశాఖ

- ఐఈఐ మెరైన్ ఇంజినీర్స్ సమావేశంలో మేధావులు
- రోడ్లు, జల, వాయు మార్గాలతో విశాఖలో మెరైన్ రంగం అభివృద్ధి
- సముద్ర రంగంలో విశాఖ ప్రపంచంలోనే అగ్రగామి అయ్యే అవకాశాలు
- ఆర్ అండ్ డీలో కేంద్ర ప్రభుత్వ వ్యూహాలకు ప్రశంసలు



సావనీర్ విడుదల చేస్తున్న భుజంగరావు తదితరులు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): నేవల్, మెరైన్ హబ్‌గా విశాఖ మారుతోందని ప్రముఖ మెరైన్ ఇంజినీర్లు చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ), నేవల్ సైన్స్ అండ్ టెక్నికల్ లాబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) సంయుక్తంగా శుక్రవారం ఇక్కడ నిర్వహించిన మెరైన్ ఇంజినీర్స్ సమావేశంలో 'నావికాదళ సాంకేతికతలో సమకాలీన అభివృద్ధి' అనే అంశంపై మేధావులు చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ వి.భుజంగరావు మాట్లాడుతూ ప్రపంచ పోటీని ఎదుర్కొనేందుకు, సముద్ర ఆస్తుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మెరైన్ ఇంజినీరింగ్‌లో సాంకేతిక పురోగతిని పెంపొందించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగవుతుందని తెలిపారు. తీర ప్రాంత నిఘా, తీర రేఖ భద్రత, సముద్ర కాలుష్యాన్ని తగ్గించడంపై ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. కోవిడ్ తరువాత ప్రపంచ వాణిజ్యం పునరుజ్జీవం పొందుతోందన్నారు. మెరైన్ ఇంజినీరింగ్ ఆర్ అండ్ డీలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాలను ప్రశంసించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లు, ఓడ రేవులు, వాయు మార్గాలు వంటి సౌకర్యాలతో విశాఖలో మెరైన్ రంగం అభివృద్ధి చెందుతోందన్నారు. ఐఈఐ విశాఖ లోకల్ సెంటర్ చైర్మన్ పీవీఎస్ గణేష్ కుమార్ మాట్లాడుతూ గ్రీన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్, అటానమస్ వెహికల్స్, ఆల్టర్నేటివ్ మెటీరియల్స్, హైడ్రో డైనమిక్, డిజైన్లు, రెన్యూవబుల్ ఎనర్జీ, డీప్ ఓషన్ ఎక్స్‌ప్లోరేషన్ తదితర అంశాలపై సెమినార్ దృష్టి సారిస్తోందని తెలిపారు. మెరైన్ డివిజన్ బోర్డు చైర్మన్ సీడీఆర్ భాస్కర్ ఎం.భండార్కర్ మాట్లాడుతూ సముద్ర రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా ఎదగడానికి విశాఖకు అన్ని అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఐఈఐ కౌన్సిల్ సభ్యుడు ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, పూణే డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వైస్ చాన్సలర్ డాక్టర్ సీపీ రామనారాయణన్ తదితరులు ప్రసంగించారు. వృత్తిలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన పలువురు విశ్రాంత ఇంజినీర్లు, యువ ఇంజినీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భుజంగరావు సావనీర్‌ను విడుదల చేశారు.

నేవీ రిహార్సల్స్ అదుర్స్



బాంబుల వర్షం కురిపిస్తున్న మిగ్ విమానం



బీచ్ రోడ్డు (విశాఖ తూర్పు): నేవీ డే సందర్భంగా శుక్రవారం విశాఖ తీరంలో నిర్వహించిన ఫైనల్ రిహార్సల్స్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. యుద్ధ విమానాలు, ఫైటర్ జెట్స్, మిగ్ విమానాలు బాంబు దాడులతో సాగరతీరం దద్దరిల్లింది. యుద్ధ నౌకలు, స్పీడ్ బోట్లు మీద బాంబుల వర్షం కురిపిస్తూ సాగర తీరాన్ని రణరంగంగా మార్చాయి. ముందుగా వాటర్ బాంబ్‌తో విన్యాసాలు ప్రారంభమయ్యాయి. సామాన్యులను తీవ్రవాదులు బంధించారన్న సమాచారం అందుకు నేవీ కమాండర్స్ హెలికాప్టర్ ద్వారా తాళ్లతో తీరంలోని అప్పటికే సిద్ధంగా ఉన్న స్పీడ్ బోట్లపై ల్యాండ్ అయ్యారు. వాటితో కళ్లు చెదిరే వేగంతో తీరానికి చేరుకుని ఉగ్రవాదులపై బాంబు దాడులు చేసి బందీగా ఉన్నవాళ్లను రక్షించారు. తర్వాత ఆయిల్ రింగ్‌పై బాంబులతో దాడి చేసి శత్రువులను మట్టికరిపించారు. ఆరు యుద్ధనౌకలు వరుస క్రమంలో దూసుకొచ్చి శత్రువులపై బాంబులతో దాడి చేశాయి. ఆరుగురు కమాండర్లు పారాచూట్ ద్వారా స్కై డ్రైవ్ చేసి ప్రధాన వేదిక వద్దకు చేరుకొని ముఖ్య అతిథికి బహుమతులు అందజేశారు. సముద్రంలో చిక్కుకున్న బాధితులను హెలికాప్టర్ ద్వారా రక్షించే ప్రదర్శన ఆకట్టుకుంది. 4 యుద్ధనౌకల మీద నాలుగు హెలికాప్టర్లను చాకచక్యంగా ల్యాండ్ చేయడంతో నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. నేవీ బ్యాండ్ మెలోడీ సాంగ్స్‌తో ప్రేక్షకులను అలరించారు. విద్యుత్ కాంతులతో యుద్ధనౌకలను అలంకరించారు.

రాష్ట్ర భవిష్యత్తు కాపాడేందుకే వచ్చా

- వైఎస్సార్‌సీపీ పాలనలో ఊరికో సైకో
- నిడదవోలు సభలో ప్రతిపక్ష నేత చంద్రబాబు



నిడదవోలులో మాట్లాడుతున్న చంద్రబాబు

సాక్షి, రాజమహేంద్రవరం/నిడదవోలు/సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్ర భవిష్యత్తు వైఎస్సార్‌సీపీ సైకోల చేతిలో సర్వనాశనం అయిపోతుంటే కాపాడుకునేందుకే వచ్చానని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. టీడీపీ నిర్వహించిన 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో రోడ్‌షోలు, బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఈ సభల్లో చంద్రబాబు మాట్లాడుతూ.. సైకో దెబ్బకు కంపెనీలన్నీ రాష్ట్రం దాటి వెళ్లిపోతున్నాయన్నారు. అమరరాజా బ్యాటరీస్ రూ.9,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. నారాయణ విద్యా సంస్థల అధినేతనూ అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. పోలవరం తాను నాటిన మొక్క అని చెప్పుకున్నారు. సర్పంచులకు కేంద్రం ఇచ్చే డబ్బులూ లాగేస్తున్నారని అన్నారు. ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను దూరం చేయడం ఎక్కడైనా ఉందా... అని ప్రశ్నించారు. మద్యం షాపులు వాళ్లవేనని, తయారు చేసేది వాళ్లేనని, చీప్ లిక్కర్ అమ్మేసి మీ ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని, మీ ఆరోగ్యం గోవిందా.. అంటూ వ్యాఖ్యానించారు. 1983లో వ్యవసాయ మీటర్లు పెడితే అప్పటి సీఎం ఎన్టీఆర్ తీసేశారని, ఇప్పుడు జగన్ పెడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఓడించకపోతే పోలీసుల చేతిలో చస్తామన్నారు. మధ్య మధ్య 'మీకు కోపం రావడం లేదా? రాష్ట్రాన్ని కాపాడుకోవాలని లేదా..' అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఈ ప్రభుత్వం ఆక్వా రంగాన్ని నిర్వీర్యం చేసిందని అన్నారు.

కార్యకర్తలకు మందు, బిర్యానీ

కొవ్వూరులో చంద్రబాబు రోడ్‌షో, బహిరంగ సభలకు హాజరైన కార్యకర్తలకు జోరుగా మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పంచారు. ఒక్కొక్కరికి క్వార్టర్ బాటిల్ అందించారు.



వద్దు బాబూ వద్దు.. నువ్వు రావద్దు

- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఫ్లెక్సీలతో ప్రజల నిరసన

తాడేపల్లిగూడెం: 'నువ్వొస్తే గుడులు కూలుస్తావ్.. 14 ఏళ్ల నీ దుర్మార్గపు పాలన ప్రజల ఖర్మ. వద్దు.. బాబోయ్.. వద్దు' అంటూ పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు చంద్రబాబుకు నిరసన తెలిపారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే వికేంద్రీకరణ తెరమరుగవుతుందని, వలంటీర్ల వ్యవస్థ రద్దు చేస్తారని ప్రజలు ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం తాడేపల్లిగూడెం వచ్చిన చంద్రబాబుకు అడుగడుగునా నిరసనలు ఎదురయ్యాయి. బాబు పాలనలో జరిగిన దుర్మార్గాలను ఎండగడుతూ నందమూరు, ఆరుళ్ల, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, ప్రత్తిపాడు, తాడేపల్లిగూడెంలో 500కు పైగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. 'నువ్వొస్తే ఉచితాలు అనుచితమంటావ్, నువ్వొస్తే ప్రకృతి వైపరీత్యాలు, మోసం దగా, కులతత్వం. నువ్వొస్తే క్షామం. నువ్వొస్తే బడులు ప్రైవేటీకరణ అంటావ్. నువ్వొస్తే వెన్నుపోట్లు... వద్దు బాబోయ్ వద్దు' వంటి అనేక నినాదాలతో ఫ్లెక్సీలు కనిపించాయి. బాబు వస్తే ఆయన వర్గీయులకు మాత్రమే లాభమని, అభివృద్ధి అధోగతేనని, పోలవరం ప్రగతి పడకేనని వాటిలో వివరించారు.

రాజకీయ సమాధి ఖాయం

- బాబుకు అధికారం ఇక కలే: మాజీ మంత్రి పేర్ని నాని
- 14 ఏళ్ల పాలన గురించి చెప్పుకునే ధైర్యం లేక వైఎస్సార్, జగన్‌లా పాలన చేస్తానంటూ కోతలు



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 2024 ఎన్నికల తరువాత ఇక రాజకీయాల్లో కనిపించరని, ఆయనకు అధికారం ఇక కలేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చెప్పారు. నిన్నటి దాకా సీఎం జగన్ ప్రజలకు డబ్బులు పంచి పెడుతున్నారంటూ కారుకూతలు కూసి ఇప్పుడు ఆయన కంటే ఎక్కువ ఇస్తానని దొంగ స్వామీజీలా మాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో ఉందన్న విషయాన్ని చంద్రబాబు తెలుసుకోవాలని సూచించారు. 14 ఏళ్ల తన పాలన గురించి చెప్పుకునే ధైర్యం లేక వైఎస్సార్, జగన్ మాదిరిగా పరిపాలిస్తానంటూ చంద్రబాబు నమ్మబలుకుతున్నారని ధ్వజమెత్తారు. 600కి పైగా హామీలను గుప్పించి అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను మాయం చేసిన ఘనత చంద్రబాబుదేనని వ్యాఖ్యానించారు.

బాబు బాదుడు గురించే చర్చ..

బీసీలను, ఎస్సీలను చంద్రబాబు అవమానించారని, మత్స్యకారులను బెదిరించారని గుర్తు చేశారు. పోలవరాన్ని సందర్శించే అర్హత కూడా చంద్రబాబుకు లేదని స్పష్టం చేశారు. బాదుడే బాదుడు కార్యక్రమం సూపర్ హిట్ అని చంద్రబాబు చెప్పుకోవటాన్ని తప్పుబట్టారు. అధికారంలో ఉండగా చంద్రబాబు బాదుడు గురించే ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు. తనకు ఇవే చివరి ఎన్నికలని చంద్రబాబు ప్రకటించడంతో రామోజీరావు, రాధాకృష్ణ హతాశులయ్యారన్నారు. మల్లెల బాబ్జీ మరణ వాంగ్మూలం చూస్తే చంద్రబాబు ఎంత నీచుడో అర్థం అవుతుందన్నారు. రాజకీయంగా చేవ చచ్చిన చంద్రబాబును చంపాల్సిన అవసరం ఎవరికి ఉంటుందని ప్రశ్నించారు. నాడు లక్ష్మీపార్వతి బ్యాగ్, కాళ్లు పట్టుకుని ఎంత మోసం చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు.

బాబు, నారాయణ పిటిషన్లపై విచారణ జనవరి 24కు వాయిదా

- స్టేతో అమరావతి రాజధాని అసైన్డ్ భూముల బదలాయింపు కేసు ముందుకు సాగడంలేదు
- ఎఫ్ఐఆర్ దశలోనే ఆగిపోయింది
- అత్యవసరంగా విచారించాలని కోరిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- నాలుగైదేళ్ల కిందట స్టే ఇచ్చిన కేసులు చాలా పెండింగ్‌లో ఉన్నాయన్న న్యాయమూర్తి

సాక్షి, అమరావతి: అమరావతి రాజధాని అసైన్డ్ భూముల బదలాయింపు వ్యవహారానికి సంబంధించి సీఐడీ నమోదుచేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ సీఎం చంద్రబాబునాయుడు, మాజీమంత్రి పొంగూరు నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు తదుపరి విచారణను జనవరి 24కి వాయిదా వేసింది. హైకోర్టు స్టేవల్ల వీరిరువురిపై సీఐడీ నమోదు చేసిన కేసు ఎఫ్ఐఆర్ దశలోనే ఆగిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దర్యాప్తు ముందుకు సాగడంలేదన్నారు. అందువల్ల ఈ వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. గత నాలుగైదేళ్ల కింద స్టే ఇచ్చిన కేసులు చాలా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రా హాజరవుతారని, అందువల్ల ఈ వ్యాజ్యాలపై విచారణను జనవరికి వాయిదా వేయాలని చంద్రబాబు, నారాయణల తరఫు న్యాయవాదులు పోసాని వెంకటేశ్వర్లు, గింజుపల్లి సుబ్బారావు కోర్టును కోరారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారణను జనవరి 24కి వాయిదా వేశారు.

అప్పట్లో చట్టవిరుద్ధంగా కొనుగోళ్లు

అమరావతియే రాజధాని అని అప్పటి ప్రభుత్వ పెద్దల ద్వారా తెలుసుకున్న తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నేతలు, కీలక వ్యక్తులు సమీప గ్రామాల పేదలకు చెందిన అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా నామమాత్రపు ధరకే కొన్నారు. కొందరు పేదలను బెదిరించి మరీ కొనుగోళ్లు చేశారు. ఇలా కొనుగోలు చేసిన భూములను భూ సమీకరణ కింద ప్రభుత్వానికి ఇచ్చి ప్రతిగా ఖరీదైన నివాస, వాణిజ్య ప్లాట్లు పొందారు. ఈ భారీ అసైన్డ్ భూముల క్రయ, విక్రయాల కుంభకోణంపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అప్పటి పురపాలక శాఖ మంత్రి నారాయణ మరికొందరిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు, నారాయణ వేర్వేరుగా 2021లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అప్పట్లో వీటిపై విచారణ జరిపిన హైకోర్టు.. సీఐడీ నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అనంతరం ఈ మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పలుమార్లు పొడిగించింది. తాజాగా.. ఈ వ్యాజ్యాలు శుక్రవారం మరోసారి విచారణకు వచ్చాయి. పిటిషనర్ల అభ్యర్థన మేరకు విచారణను జనవరి 24కి వాయిదా వేశారు.

మిల్లర్లకు రైతులను తాకట్టుపెట్టిన చంద్రబాబు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు



సోము వీర్రాజును సత్కరిస్తున్న నాయకులు

నెల్లూరు (బారకాసు): రాష్ట్రంలోని రైతులను మిల్లర్లకు తాకట్టుపెట్టిన ఘనత చంద్రబాబుదేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు చెప్పారు. నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించిన భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి సోము వీర్రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రైతులు పండించిన ధాన్యాన్ని వారు అమ్ముకునే అవకాశం లేకుండా చేశారన్నారు. మిల్లర్లు ఇచ్చింది తీసుకునే పరిస్థితి ఉండేదని మండిపడ్డారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను చంద్రబాబు తన పథకాలుగా ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులను నిర్మిస్తే.. అవి తానే నిర్మించినట్లుగా చంద్రబాబు మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల సంక్షేమాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ బలోపేతానికి కిసాన్‌మోర్చా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజును కిసాన్‌మోర్చా విభాగ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, పార్టీ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సత్యకుమార్, సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు 'వడ్డీ చెల్లింపు' ఆదేశాలు రద్దు

- కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల విషయంలో హైకోర్టు ధర్మాసనం తీర్పు
- ఒప్పందంలో లేనప్పుడు వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు
- సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు రద్దు



సాక్షి, అమరావతి: ఆయా ప్రభుత్వ శాఖల్లో చేసిన పనులకు గానూ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేసినందుకు కాంట్రాక్టర్లకు 12 శాతం వార్షిక వడ్డీని కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు ధర్మాసనం రద్దు చేసింది. ఒప్పందంలో వడ్డీ చెల్లింపు లేనప్పుడు.. పిటిషనర్లు కళ్లు తెరుచుకుని మరీ ఒప్పందంలోని నిబంధనలన్నింటికీ ఆమోదం తెలిపినప్పుడు వారికి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఒప్పందంలో లేకపోయినా కూడా వడ్డీ చెల్లించడం వడ్డీ నిబంధనల్లోని క్లాజ్ 43కి విరుద్ధమని తెలిపింది. ప్రస్తుత కేసులో పిటిషనర్లకు వడ్డీ చెల్లించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించడం ద్వారా సింగిల్ జడ్జి న్యాయపరంగా తీవ్ర తప్పిదం చేశారని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్లు వడ్డీ కోసం సివిల్ సూట్, ఇతర మార్గాల ద్వారా తగిన ఫోరంలను ఆశ్రయించవచ్చని సూచించింది. ఒప్పందంలో వివాద పరిష్కార క్లాజ్ ఉన్నప్పుడు పిటిషనర్లు దాన్ని వాడకుండా నేరుగా హైకోర్టును ఆశ్రయించారని ఆక్షేపించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

గతంలో వడ్డీ చెల్లించాలంటూ ఆదేశాలిచ్చిన సింగిల్ జడ్జి..

తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట పరిధిలో వ్యవసాయ శాఖకు చెందిన పనులను వై.బాబూరావు అనే కాంట్రాక్టర్ పూర్తి చేశారు. తనకు చెల్లించాల్సిన రూ.23.21లక్షల బకాయిలను వడ్డీతో సహా చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్.. పిటిషనర్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని 12 శాతం వార్షిక వడ్డీతో కలిపి నాలుగు వారాల్లో చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ ఆదేశాల ప్రకారం ప్రభుత్వం రూ.23.21లక్షలను పిటిషనర్‌కు చెల్లించింది. అయితే వడ్డీ చెల్లించాలన్న ఆదేశాలపై ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. ఇదే రీతిలో మరికొన్ని వ్యాజ్యాల్లోనూ అప్పీళ్లు చేసింది. వీటన్నింటిపై విచారణ జరిపి తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం తన నిర్ణయాన్ని తాజాగా వెలువరించింది. వడ్డీ చెల్లింపు అన్నది ఆయా కాంట్రాక్టుల ఒప్పందాల్లో పేర్కొన్న పలు అంశాలపై ఆధారపడి ఉంటుందని తెలిపింది. వడ్డీ రేట్ల ఖరారు విషయంలో మార్కెట్ ఒడిదుడుకులను, ఇతర పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. వడ్డీ చెల్లింపు కోసం పలు ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించింది. 12 శాతం వార్షిక వడ్డీని పిటిషనర్లకు చెల్లించాలన్న సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసింది.


ఏవోబీలో తొలిరోజు పీఎల్‌జీఏ వారోత్సవాలు ప్రశాంతం



పాడేరులో అనుమానిత వ్యక్తుల నుంచి సమాచారం సేకరిస్తున్న పోలీసులు

సాక్షి, పాడేరు: మావోయిస్ట్ పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాలు శుక్రవారం తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటుగా సరిహద్దు ప్రాంతాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలను కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేయడంతో పోలీసులంతా కూబింగ్ చర్యల్లో నిమగ్నమయ్యారు. వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్ట్ ఏవోబీ నేత గణేష్ పత్రిక ప్రకటనలో పిలుపునిచ్చారు. 22 మండలాల్లో అన్ని పోలీస్‌స్టేషన్లను ఎస్పీ సతీష్‌కుమార్ అప్రమత్తం చేశారు. ఒడిశా పోలీస్ బలగాలతో సమన్వయం చేసుకుంటూ అడవిని జల్లెడపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

రష్యా టు కోరంగి



గ్రేట్‌నాట్ పక్షి కోరంగి అభయారణ్యంలో ప్రత్యక్షం

ఐదు నెలలు... 7,500 కిలోమీటర్ల ప్రయాణం

ఏటిమొగలో 450 వరకు పక్షులను గుర్తించిన అటవీశాఖ

ప్రపంచంలో అంతరించిపోతున్న పక్షిజాతుల్లో ఒకటైన 'గ్రేట్ నాట్' కాకినాడ సమీపంలోని కోరంగి అభయారణ్యంలో ప్రత్యక్షమైంది. రష్యా నుంచి ఐదు నెలలపాటు సుమారు 7,500 కిలోమీటర్లు ప్రయాణించి ఏటిమొగకు వచ్చి వాలింది. సంతానోత్పత్తి కోసమే 400 నుంచి 450 వరకు 'గ్రేట్‌నాట్' పక్షులు ఇటీవల కోరంగి అభయారణ్యానికి వచ్చినట్లు అటవీ బయాలజీ అధికారులు భావిస్తున్నారు. అంతరించిపోతున్న జాబితాలో చేరిన ఈ నీటిజాతి పక్షి... సంతానోత్పత్తి కోసం ఇంతదూరం రావడం శుభపరిణామమని చెబుతున్నారు.

కోరంగికే ఎందుకు వచ్చిందంటే...

'గ్రేట్‌నాట్' పక్షులు రష్యా, సైబీరియా, మంగోలియా వంటి దేశాల్లో నివశిస్తాయి. ఈ పక్షులు శీతాకాలంలోనే సంతానోత్పత్తి చేస్తాయి. అయితే, రష్యా, సైబీరియా, మంగోలియా దేశాల్లో శీతాకాలంలో మంచు గడ్డకట్టే వాతావరణం ఉంటుంది. అక్కడి పక్షుల సంతానోత్పత్తి కేంద్రాలు మంచుతో మూసుకుపోతాయి. దీంతో పక్షులు శీతాకాలంలో ఆహారం (ఫైటో ప్లాంటన్, వామ్స్, నత్తగుల్లలు) సమృద్ధిగా లభించే భూమధ్య రేఖకు దిగువన ఉన్న దక్షిణ భారతదేశం వైపు వస్తుంటాయి. శీతోష్ణస్థితులు స్థిరంగా ఉండటంతోపాటు సముద్రతీర ప్రాంతం, నదీ ముఖద్వారాలు, చిత్తడినేలలు ఎక్కువగా ఉన్న కోరంగి అభయారణ్యం వైపు రావడానికి గ్రేట్‌నాట్ పక్షులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయి.

లెగ్ ఫ్లాగ్ ప్రొటోకాల్ ద్వారా గుర్తింపు

వివిధ దేశాల్లో పక్షుల వలసలను గుర్తించేందుకు లెగ్ ఫ్లాగ్ ప్రొటోకాల్ అనే విధానాన్ని అవలంబిస్తారు. ఈ విధానంలోనే గ్రేట్‌నాట్ పక్షులను కోరంగి అభయారణ్యంలోని ఏటిమొగలో అటవీశాఖ బృందం నాలుగు రోజుల క్రితం గుర్తించింది. ఏటా వలస పక్షులు వచ్చే అక్టోబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు సర్వే జరుగుతుంది. ఈ క్రమంలో అటవీ శాఖ కాకినాడ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ (వైల్డ్ లైఫ్), బయాలజిస్ట్ డి.మహేష్‌కుమార్‌తో కూడిన బృందం కోరంగి అభయారణ్యంలో గ్రేట్‌నాట్ పక్షులు రష్యా టాగ్ (బ్లాక్ అండ్ ఎల్లో కాంబినేషన్)తో ఉండటాన్ని గుర్తించారు. రష్యాలోని కమచ్‌తక ప్రాంతంలో జూలై 28న ప్రయాణం మొదలు పెట్టిన గ్రేట్‌నాట్ పక్షులు వారం రోజుల క్రితం ఏటిమొగకు వచ్చినట్లు వాటికి ఉన్న ట్యాగ్ ఆధారంగా అధికారులు నిర్ధారించారు.

- సాక్షిప్రతినిధి, కాకినాడ

వివాదాల్లో 'గవర్నర్ గిరీ'!

- రాష్ట్రాల పాలనా వ్యవహారాల్లో కలగజేసుకుంటున్న గవర్నర్లు
- రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్ల మధ్య ఉప్పునిప్పులా పరిస్థితులు

(సాక్షి ప్రత్యేక ప్రతినిధి కె.శ్రీకాంత్‌రావు)

దేశంలో గవర్నర్ల వ్యవస్థ వివాదాస్పదం అవుతోంది. రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకోని వ్యక్తులను గవర్నర్లుగా నియమిస్తుండటంతో.. వారు తమ పూర్వాశ్రమ వాసనలు వదిలిపెట్టలేక పోతున్నారన్న విమర్శలు పెరుగుతున్నాయి. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పాలనా వ్యవహారాల్లో తల దూరుస్తుండటంతో గవర్నర్‌కు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు తలెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ నాయకులను గవర్నర్లుగా నియమిస్తుండటం, తద్వారా రాష్ట్రాలపై పెత్తనం ఉండేలా చూసుకోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలోని ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఏవీ కూడా దీనికి అతీతం కాదు. మరీ గతంలో మాదిరిగా గవర్నర్లు ఆర్టికల్ 356ను వినియోగించి ప్రభుత్వాలను రద్దు చేయకున్నా.. అడ్డంకులు సృష్టించడం, బహిరంగా ప్రభుత్వ విధానంపై వ్యాఖ్యానాలు చేయడం జరుగుతోంది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా తాత్సారం చేయడమూ కనిపిస్తోంది. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నప్పుడు పార్టీలకు అతీతంగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు గవర్నర్లు తమకు లేని అధికారాన్ని పాలనలో చూపించాలని యత్నించినప్పుడు వివాదాలు వస్తున్నాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల నిర్ణయాలను గవర్నర్లు విచక్షణాధికారం పేరిట మోకాలడ్డుతుండటంతో అసలు గవర్నర్ల వ్యవస్థపైనే విమర్శలు వస్తున్నాయి. గవర్నర్ల వ్యవస్థ హద్దులు దాటనంత వరకు మంచిదేనని, రాజ్యాంగ పరిరక్షణకు వారు పరిమితమైతే మంచిదని న్యాయ నిపుణులు అంటున్నారు. గవర్నర్ల మితిమీరిన జోక్యమే ఆ వ్యవస్థ నష్టమని ప్రతిపక్షాలు కూడా అభిప్రాయపడుతున్నాయి. గవర్నర్లను నియమించే వ్యవస్థలో పారదర్శకత కోసం ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో ఎంపిక కమిటీ ఉంటే బాగుంటుందన్న అభిప్రాయాలూ ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, గవర్నర్ల వ్యవస్థకు సంబంధించి సర్కారియా కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

రూ.78.26 కోట్లతో పెద్దవాగు ఆధునికీకరణ

- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు ప్రతిపాదించిన గోదావరి బోర్డు
- దామాషా పద్ధతిలో వ్యయం భరించేందుకు ఇప్పటికే రెండు రాష్ట్రాల అంగీకారం
- 15న సర్వ సభ్య సమావేశంలో చర్చించాలని గోదావరి బోర్డు నిర్ణయం

సాక్షి, అమరావతి: గోదావరి నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల ఏకైక ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగు ఆధునికీకరణకు రూ.78.26 కోట్లతో గోదావరి బోర్డు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 2020, జూన్ 5న నిర్వహించిన బోర్డు తొమ్మిదో సర్వ సభ్య సమావేశంలో రెండు రాష్ట్రాలు అంగీకరించిన మేరకు.. ఆయకట్టు ఆధారంగా దామాషా పద్ధతిలో ఆధునికీకరణకు నిధులివ్వాలని కోరింది. ఈ అంశంపై ఈ నెల 15న నిర్వహించే సర్వ సభ్య సమావేశంలో పెద్దవాగు ఆధునికీకరణపై రెండు రాష్ట్రాలతో చర్చించి, తుది నిర్ణయం తీసుకోవాలని బోర్డు చైర్మన్ ముకేష్‌కుమార్ సిన్హా నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద పెద్దవాగుపై 1.5 టీఎంసీల సామర్థ్యంతో 1981లో పెద్దవాగు ప్రాజెక్టును నిర్మించారు. 47 మీటర్ల పొడవున 75.133 మీటర్ల ఎత్తుతో స్పిల్ వేను.. దానికి అనుబంధంగా 2.468 కి.మీ.ల పొడవున మట్టికట్టను నిర్మించారు. కుడి, ఎడమ కాలువల కింద 16 వేల ఎకరాలకు నీళ్లందించేలా డి్స్ట్రిబ్యూటరీలను అభివృద్ధి చేసి.. ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారు. విభజన నేపథ్యంలో ప్రాజెక్టు హెడ్ వర్క్స్ తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ఈ ప్రాజెక్టు కింద తెలంగాణలో 2,360 ఎకరాలు ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 13,640 ఎకరాల ఆయకట్టు ఉంది. స్పిల్ వే గేట్లు, కాలువల రెగ్యులేటర్లు, డి్స్ట్రిబ్యూటరీలు దెబ్బతినడం వల్ల ఆయకట్టు చివరి భూములకు నీళ్లందడం లేదు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును ఆధునికీకరించాలని గోదావరి బోర్డు చేసిన ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి.

ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: స్వాత్మానందేంద్ర



అభయాంజనేయ ఆలయం వద్ద స్వాత్మానందేంద్ర

అనంతపురం కల్చరల్: సనాతన హిందూ ధర్మాన్ని రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. స్వధర్మ ప్రచార వాహినిలో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం అనంతపురం తపోవనంలోని శ్రీక్షేత్రాన్ని సందర్శించి అక్కడ కొలువైన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుడు, హయగ్రీవుడు, గోదా రంగనాథులు తదితర దేవతామూర్తులకు పూజలాచరించారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేస్తూ హిందూ మతాన్ని, సనాతన ఆచార వ్యవహారాలను నేటి తరం పాటించేలా ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు. సోములదొడ్డి గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గోశాలను సందర్శించి గోవుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జ్వాలాపురం శ్రీకాంత్ పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాత్మానందేంద్ర పూజలు చేశారు. దేవదాయ అర్చక ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అర్చకులనుద్దేశించి మాట్లాడారు.

విశాఖలో బీఎస్ఎన్ఎల్ పీడబ్ల్యూఏ జాతీయ సమావేశాలు

- హాజరైన సంఘం జాతీయ నేతలు



మాట్లాడుతున్న పీఎస్ రామన్‌కుట్టి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): బీఎస్ఎన్ఎల్ పీడబ్ల్యూఏ (పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్) జాతీయ సమావేశాలు విశాఖలోని రైల్వే న్యూ కాలనీ సమీపంలోని సుబ్బలక్ష్మి కళ్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సమావేశంలో ముందుగా ఆహ్వాన కమిటీ చైర్మన్ ఎంఆర్ పట్నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు రామన్ కుట్టి అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాలను ప్రారంభించారు. రామన్ కుట్టి ప్రసంగిస్తూ..2007లో ప్రారంభమైన పెన్షనర్ల అసోసియేషన్ ఇప్పటికి 70,000 మందితో దేశంలో ప్రథమ స్థానంలో ఉందని, ఈ సంఘానికి ఏపీ నుంచి సుమారు 10,000 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంటీఎన్ఎల్ జనరల్ సెక్రటరీ జేఎం బక్షి మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ యూనియన్‌లన్నీ ఒకే తాటిపైకి వచ్చి పెన్షన్ రివిజన్ తదితర సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డి.గోపాలకృష్ణ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వ ఏడవ వేతన సంఘం సిఫార్సులను అనుసరించి పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి గంగాధరరావు, ఏపీ సర్కిల్ కార్యదర్శి వరప్రసాదరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, జిల్లా కార్యదర్శి కె.సోమసుందరరావు, ఆయా ప్రాంతాల సభ్యులు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశాలు శనివారం కూడా కొనసాగనున్నాయి.

ఊబకాయానికి ప్రకటనలే ప్రధాన కారణం

- 'లోకల్ సర్కిల్స్' సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలకు మార్కెట్‌లో లభిస్తున్న ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు కారణమవుతున్నాయి. ప్రస్తుతం ఇలాంటి వాటిని తినడానికే పిల్లలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పిల్లలు జంక్ ఫుడ్, ప్యాక్ చేసిన ఆహారం వైపు ఆకర్షితులు కావడానికి వాటిని ఉత్పత్తి చేసే సంస్థల వాణిజ్య ప్రకటనలే ప్రధాన కారణమని దేశంలో సగానికిపైగా తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై 'లోకల్ సర్కిల్స్' అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఇదే విషయం వెల్లడైంది. దేశ వ్యాప్తంగా 304 జిల్లాల్లో సర్వే నిర్వహించగా.. సర్వేలో భాగంగా 24 వేల మంది నుంచి ఆ సంస్థ అభిప్రాయ సేకరణ జరిపింది. సర్వేలో 61 శాతం మంది పురుషులు పాల్గొనగా.. 39 శాతం మంది మహిళలు పాల్గొన్నారు.

56 శాతం మంది అభిప్రాయమిదే

ప్యాక్డ్ ఫుడ్స్ పట్ల 16 ఏళ్లలోపు పిల్లలు ఆకర్షితులు కావడానికి ప్రకటనలే ప్రధాన కారణమని 56 శాతం మంది తల్లిదండ్రులు వెల్లడించారు. ప్రకటనలు, ఇతర ఏ అంశాల ప్రభావం లేకుండానే పిల్లలు ఈ ఆహారాన్ని కోరుతున్నారని 12 శాతం మంది అభిప్రాయపడ్డారు. ప్రకటనలను చూసే తమ పిల్లలు ఈ ఆహార పదార్థాల వైపు ఆకర్షితులయ్యే అవకాశం ఉంటోందని 18 శాతం మంది అన్నారు. కాగా మిగిలిన 14 శాతం మంది మాత్రం ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు.

ఆ ప్రకటనల్ని నిషేధిస్తే మేలు

'ప్యాక్ చేసిన ఆహార పదార్థాలకు సంబంధించిన ప్రకటనలు 16 ఏళ్లలోపు పిల్లలను ఆకర్షించకుండా నిషేధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలా' అనే అంశంపై 12,408 మంది నుంచి అభిప్రాయం సేకరించారు. వీరిలో 81 శాతం మంది తప్పకుండా నిషేధం విధించాలని కోరారు. 11 శాతం మంది 12 ఏళ్లలోపు పిల్లలపై ప్రభావం పడకుండా తప్పకుండా నిబంధనలు తీసుకురావాలని స్పష్టం చేశారు. 4 శాతం మంది నిబంధనలు తీసుకుని రావాల్సిన అవసరం లేదని అభిప్రాయం వ్యక్తం చేయగా.. మరో 4 శాతం మంది ఏమీ స్పందించలేదు.

కంటైనర్‌ను ఢీకొన్న లారీ... నలుగురు సజీవదహనం

- కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



కంటైనర్‌ను లారీ ఢీకొట్టడంతో చెలరేగిన అగ్నికీలలు

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి నలుగురు సజీవదహనమయ్యారు. కడియంలో ఇసుక లోడ్ చేసుకుని విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ ధర్మవరంలోని పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను దాటి రాజమహేంద్రవరం వైపు అనకాపల్లి నుంచి భీమవరం రొయ్యల లోడుతో వెళుతున్న కంటైనర్‌ను ఢీకొంది. లారీ నేరుగా కంటైనర్ డీజిల్ ట్యాంక్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో రెండు వాహనాల్లో ఉన్న నలుగురు వ్యక్తులు కాలిపోయారు. కంటైనర్‌లో ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ వినోద్‌కుమార్ యాదవ్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం యనమదుర్రుకు చెందిన కాళి పెద్దిరాజు, కృష్ణా జిల్లా కోడూరు మండలం మెరకగుంటపాలేనికి చెందిన ఇసుక లారీ డ్రైవర్ జన్ను శ్రీను, మరో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందారు. మృతదేహాలను ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్, ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు, ఎస్ఐలు కె.సుధాకర్, శోభన్‌బాబు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విజయనగరంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

- సందడి చేసిన సినీ తారలు రాశిఖన్నా, పాయల్ రాజ్‌పుత్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సినీతారలు రాశిఖన్నా, పాయల్ రాజ్‌పుత్

విజయనగరం టౌన్: సంప్రదాయాలకు ప్రతీకగా, అధునాతన వస్త్ర శైలితో ఉత్తరాంధ్ర ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 28వ షోరూంను విజయనగరంలోని మూడులాంతర్లు కూడలి వద్ద ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి షాపింగ్ మాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలుదారుల ఆలోచనలకు అనుగుణంగా మరిన్ని సేవలందించాలని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యాన్ని కోరారు. కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఈ షాపింగ్‌మాల్ ఏర్పాటుతో సుమారు 400 మంది స్థానికులకు ఉద్యోగావకాశాలు కలగడం సంతోషకరమన్నారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో రాశిఖన్నా, పాయల్ రాజ్‌పుత్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముందుగా షాపింగ్ మాల్‌లో జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం వస్త్రశ్రేణిని, కలెక్షన్స్ పరిశీలించి ప్రశంసించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న శ్రీవారి హుండీ

- వరుసగా తొమ్మిదో నెల రూ.100 కోట్లు దాటిన హుండీ ఆదాయం
- ఎనిమిది నెలలకే రూ.1,164 కోట్ల పైనే
- నవంబరులో రూ.127.30 కోట్ల ఆదాయం
- ఈ ఏడాది రూ.1,600 కోట్లు దాటే అవకాశం



తిరుమల: శ్రీవారి హుండీ ఆదాయం సరికొత్త రికార్డులు నమోదు చేస్తోంది. ఈ ఏడాది వరుసగా తొమ్మిదో నెల హుండీ ఆదాయం రూ.100 కోట్లను దాటింది. ఈ వార్షిక సంవత్సరం (టీటీడీలో మార్చి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు)లో హుండీ ద్వారా రూ. 1,000 కోట్లు ఆదాయం వస్తుందని టీటీడీ అంచనా వేసింది. అయితే, మార్చి నుంచి నవంబరు వరకు 9 నెలలు నెలకు రూ. 100 కోట్లు దాటి హుండీ ఆదాయం వచ్చింది. గత 8 నెలల్లోనే రూ.1,164 కోట్లను దాటేసింది. నవంబరు నెలలో రూ.127.30 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో ఈ వార్షిక సంవత్సరంలో శ్రీవారికి రూ.1,600 కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తుందని టీటీడీ భావిస్తోంది.

కోరిన కోర్కెలు తీర్చే తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు మొక్కుల చెల్లింపులో భాగంగా హుండీలో కానుకలు సమర్పిస్తారు. ఇలా హుండీ ద్వారా శ్రీవారికి ఏటా వేల కోట్ల రూపాయల ఆదాయం లభిస్తోంది. ఇప్పటికే టీటీడీ ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.15,938 కోట్లు దాటగా, బంగారం నిల్వ 10,258 కేజీలు దాటింది. 1950వ సంవత్సరం వరకు శ్రీవారికి నిత్యం లభించే హుండీ ఆదాయం లక్ష రూపాయల లోపు ఉండగా, 1958లో మొదటిసారి లక్ష రూపాయలు దాటింది. 1990కి నిత్యం కోటి రూపాయలు పైగా హుండీ ఆదాయం లభించడం ప్రారంభమైంది. ఆ తర్వాత ఏటేటా పెరుగుతోంది. 2010 అక్టోబర్ 23న రూ.3.6 కోట్లు, 2011 నవంబర్ 1న రూ.3.8 కోట్లు, 2012 జనవరి 1న రూ.4.23 కోట్ల ఆదాయం వచ్చింది. 2012 ఏప్రిల్ ఒకటో తేదీన అత్యధికంగా రూ.5.73 కోట్ల ఆదాయం లభించింది. ఈ ఏడాది జూలై 4వ తేదీకి రూ.6 కోట్లు దాటేసింది. 2015-16 సంవత్సరంలో హుండీ ఆదాయం రూ.1,000 కోట్లు దాటగా, 2019 - 20లో రికార్డు స్థాయిలో రూ.1,313 కోట్లు రావడం విశేషం.

కోవిడ్ కారణంగా వరుసగా రెండు సంవత్సరాలు స్వామి వారి హుండీ ఆదాయం గణనీయంగా తగ్గింది. 2020 -21లో రూ.731 కోట్లు, 2021-22లో రూ.933 కోట్లు వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభిస్తోంది. వరుసగా 9వ నెల కూడా స్వామికి లభించిన హుండీ ఆదాయం రూ.100 కోట్ల మార్క్‌ను దాటింది. కోవిడ్ కారణంగా రెండేళ్లు శ్రీవారి దర్శనానికి దూరంగా ఉన్న భక్తులు ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొనడంతో తిరుమలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీవారి ఆదాయం గణనీయంగా పెరుగుతున్నట్లు టీటీడీ అధికారులు చెబుతున్నారు.

- తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్‌లు 16 నిండాయి. దర్శన టోకెన్లు లేనివారికి 16 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు పడుతోంది.

పెళ్లికెళ్దాం పదండి

- మోగిన పెళ్లి బాజాలు.. కల్యాణ మండపాలకు భారీగా డిమాండ్

మచిలీపట్నం: రాష్ట్రంలో పెళ్లిళ్ల సందడి మొదలైంది. డిసెంబర్ 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పెళ్లిబాజాలు మోగనున్నాయి. ముందుగా కుదుర్చుకున్న లగ్నాల (ఎంగేజ్‌మెంట్ల) మేరకు వివిధ ముహూర్తాలలో వధూవరులను ఒక్కటి చేసేందుకు పెళ్లింట అంతా సిద్ధం చేసుకుంటున్నారు. పెళ్లి తంతుకు అవసరమైన సరుకుల కొనుగోళ్లతో మార్కెట్ కళకళలాడుతున్నాయి. ఈసారి కార్తీక మాసంలో మూఢం ఉండటంతో ఎటువంటి శుభకార్యాలు జరగలేదు. మాఘ మాసం (ఫిబ్రవరి) వరకు ఆగేకంటే.. ఈ నెలలోనే పెళ్లి వేడుకను పూర్తి చేయటం మంచిదనే భావనలో ఎక్కువ మంది ఉన్నారు. మార్గశిర మాసం అనువైన కాలం కావటంతో ఇదే మంచి తరుణంగా భావించి గృహ ప్రవేశాలు, నూతన వ్యాపార ప్రారంభోత్సవాలు వంటి శుభకార్యాలకు సిద్ధమవుతున్నారు. ఈ నెలలో 11 ముహూర్తాలు ఉండటంతో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌కు డిమాండ్ పెరిగింది.

పది లక్షల ప్రాణాలను కాపాడాయ్!

ప్రాణదాతలుగా ఆదుకుంటున్న 108 అంబులెన్స్‌లు

- గ్రామీణ ప్రాంతాల్లో కాల్ చేసిన 20 నిమిషాల్లోపే రాక
- అత్యధికంగా 19 శాతం ఎమర్జెన్సీ కేసుల్లో ఆస్పత్రులకు గర్భిణుల తరలింపు
- ప్రజల ప్రాణాలు కాపాడేందుకు సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యం
- 432 కొత్త అంబులెన్స్‌లు కొనుగోలు చేసి నిరంతర సేవలు



సాక్షి, అమరావతి: కుయ్.. కుయ్ అంటూ పరుగులు తీసే అంబులెన్స్‌లను చూస్తే గుర్తొచ్చేది నాడు వైఎస్సార్.. నేడు సీఎం జగన్. గత సర్కారు హయాంలో 108 వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. ప్రాణాపాయంలో ఉన్నవారు 108కి ఫోన్ చేస్తే డీజిల్ లేదని, డ్రైవర్లు లేరనే సమాధానం వచ్చేది. ఒక్కోసారి అసలు స్పందించే నాథుడే ఉండడు. అలాంటి వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే తిరిగి గాడిలో పెట్టారు. మండలానికి కచ్చితంగా ఒకటి అందుబాటులోకి తెచ్చి నిరంతరం సేవలందించేలా చర్యలు చేపట్టారు. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు పది లక్షలకు పైగా ప్రాణాలను 108 అంబులెన్స్‌లు కాపాడగలిగాయి.

ఏజెన్సీలో అరగంట లోపే..

గత జనవరి నుంచి నవంబర్ 25వ తేదీ వరకు 10,10,383 ఎమర్జెన్సీ కేసులను 108 అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రులకు తరలించారు. గిరిజన ప్రాంతాల్లో కాల్ చేసిన అరగంట లోపే చేరుకుంటున్నాయి. 108 అంబులెన్స్‌ల వ్యవస్థ పనితీరును విశ్లేషిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఈమేరకు నివేదిక రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ చేసిన 20 నిమిషాల లోపు 108 అంబులెన్స్‌లు చేరుకోవాలనే నిబంధన విధించగా 18 – 19 నిమిషాల్లోనే వస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 15 నిమిషాల గడువు విధించగా ట్రాఫిక్ తదితర సమస్యల కారణంగా 15 నుంచి 18 నిమిషాల సమయం పడుతోంది. అత్యధికంగా 19 శాతం ఎమర్జెన్సీ కేసుల్లో గర్భిణులను 108 అంబులెన్స్‌లు ప్రసవం కోసం ఆస్పత్రులకు తరలిస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే 432 కొత్తగా 108 అంబులెన్స్‌లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 768 అంబులెన్స్‌లు పనిచేస్తున్నాయి. ఇందులో బేసిక్ లైఫ్ సపోర్ట్, అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, నవజాత శిశువుల అంబులెన్స్‌లు తదితరాలున్నాయి.

ఈ ఏడాది జనవరి – నవంబర్ 25 వరకు ఎమర్జెన్సీ కేసులు

జనవరి	ఫిబ్రవరి	మార్చి
93451	76142	88775
ఏప్రిల్	మే	జూన్
92337	89032	86225
జూలై	ఆగస్టు	సెప్టెంబర్
97865	96212	98746
అక్టోబర్	నవంబర్	
100234	81364	

108 ద్వారా ఎలాంటి ఎమర్జెన్సీ కేసులు? (శాతాల్లో)

కేసు రకం	శాతం
గర్భిణులు	19
కిడ్నీ, డయాలసిస్	16
ఇతర	13
మూత్రపిండ సమస్యలు	9
శ్వాస సంబంధిత	8
ప్రసూతి సంరక్షణ	5
వాహనేతర గాయాలు	5
పొత్తి కడుపు నొప్పి	4
గుండె సమస్యలు	4
జ్వరం	4
అపస్మారక స్థితి	3
విష ప్రయోగం	3
పాము, కీటకాల కాటు	2
దాడులు	2
ఫిట్స్	2
డయాబెటిక్	1

ఫైన్ వెరైటీలకు ప్రోత్సాహం



విదేశాలకు అవసరమైన బియ్యం రకాలను రాష్ట్రంలో పండించేలా చర్యలు

- 1010, 1153, 1156 రకాల ఎగుమతికి అవకాశం
- ప్రస్తుతం ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ నుంచి కొంటున్న ఎగుమతిదారులు
- ఇతర రాష్ట్రాల్లోనూ ఈ రకాల కొరత
- నాలుగైదేళ్ల కిందటి వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాగు
- డిమాండ్ దృష్ట్యా ఇటువంటి రకాలకు తిరిగి ప్రోత్సాహం
- వ్యాపారులు లేదా ఎఫ్‌సీఐ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు
- దిగుబడి ఎక్కువ, పంట కాలం తక్కువ
- రైతులకు, ఎగుమతిదారులకు మేలు

సాక్షి, అమరావతి: విదేశాలకు అవసరమైన ఫైన్ రకం ధాన్యాన్ని రాష్ట్రంలో పండించి ఎగుమతి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఒకప్పుడు ఉత్తరాంధ్రలో పండించిన 1010, 1153, 1156 వంటి సన్న రకాల (ఫైన్ వెరైటీలు) బియ్యానికి ఆఫ్రికా, ఆసియా దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. నాలుగైదేళ్ల కిందటి వరకు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలు, విశాఖలోని కొంత విస్తీర్ణంలో ఈ సన్న రకాలు సాగులో ఉండేవి. రాష్ట్రంలో వీటి వినియోగం తక్కువగా ఉండటం, ప్రభుత్వం పీడీఎస్ కింద వినియోగించే సాధారణ ధాన్యం రకాలకే మద్దతు ధర ఇవ్వడంతో వీటిని రైతులు సాగు చేయడం మానేశారు. రాష్ట్రానికి చెందిన ఎగుమతిదారులు వీటిని ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ నుంచి కొని స్థానికంగా మిల్లింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ వీటి కొరత ఉంది. దీంతో ఈ రకాలను తిరిగి ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా రైతులకు, ఎగుమతిదారులకు మేలు కలుగుతుంది. వీటికి సాధారణ రకాలతో పోలిస్తే 5 నుంచి 10 శాతం దిగుబడి ఎక్కువ వస్తుంది. ఎకరానికి మూడు టన్నుల (34–35 బస్తాలు) వరకు దిగుబడి ఉంటుంది. 120 రోజులకే చేతికొస్తుంది. గింజ పొడవు 5.9 నుంచి 6 మిల్లీమీటర్లు ఉండటం విశేషం. గింజ విరగడం కూడా చాలా తక్కువగా ఉంటుంది.

పక్కాగా మద్దతు

విదేశాలకు ఎగుమతయ్యే ఇటువంటి రకాలను పండించిన రైతులకు పక్కాగా మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇటీవల బియ్యం ఎగుమతిదారులు పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును కలిశారు. విదేశాలకు అవసరమైన రకాలను రాష్ట్రంలోనే పండిస్తే దూర ప్రాంతాల నుంచి తెచ్చుకునే అవసరం ఉండదని చెప్పారు. పౌర సరఫరాల శాఖ అధికారులు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)తో కూడా చర్చించి సెంట్రల్ పూల్ కింద ఇతర రాష్ట్రాల అవసరాలు తీర్చడానికి ఈ వెరైటీలను మద్దతు ధరకు కొనేలా ఒప్పించారు. త్వరలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి వీటి సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

ఫైన్ వెరైటీలకు మంచి రోజులు

ఉత్తరాంధ్రలో పండించే ఆహార ధాన్యాల సాగుకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. అంతరించిపోతున్న వాటి సాగును తిరిగి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పక్కా మద్దతు ధర కూడా కల్పిస్తోంది. రైతులు ఎగుమతిదారులకు అమ్ముకోవచ్చు లేదా ప్రభుత్వమే కొంటుంది. రాష్ట్రంలో ఎగుమతులను పెంచేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుంది.

–హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌర సరఫరాల శాఖ

జయ రకం సాగుపై రైతుల ఆసక్తి

గోదావరి జిల్లాల్లో పండించే జయ రకం బొండాలకు మార్కెట్‌లో మంచి రేటు ఉంది. ఇటీవల కేరళ ప్రభుత్వం సైతం ఈ ధాన్యం సరఫరా చేసేలా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. రేటు పెరుగుతుండటంతో రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. ఎఫ్‌సీఐ వద్ద ఈ బాయిల్డ్ వెరైటీల కొరత ఉండటంతో మద్దతు ధరకు తీసుకునేందుకు సిద్ధంగా ఉంది. గోదావరి జిల్లాల్లోనే బాయిల్డ్ రైస్ మిల్లులు కూడా ఉండటంతో ఇక్కడే మిల్లింగ్ చేసి బియ్యం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

బాబును నమ్మి మళ్లీ మోసపోం

796వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలను నమ్మి ప్రజలు మళ్లీ మోసపోయేందుకు సిద్ధంగా లేరని బహుజన పరిరక్షణ సమితి నేతలు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 796వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మూడు రాజధానుల ఉద్యమం రాష్ట్రంలో ఉగ్రరూపం దాలుస్తోందని, అన్ని ప్రాంతాల ప్రజలు వికేంద్రీకరణ కోసం గళం విప్పడంతో బాబు అండ్ కో డ్రామా కంపెనీ వెనుకంజ వేసి పారిపోయిందని ఎద్దేవా చేశారు. అమరావతి ఉద్యమ నిర్మాతలు బాబు, రామోజీ తదితర కులవాదులంతా ఆర్టిస్టులుగా చేరి ప్రజలను మోసగించేందుకు నానా తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అధికారం కోసం బరితెగించి ప్రజలను రెచ్చగొడుతున్న బాబు అండ్ కోకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. ప్రజలందరి అభీష్టం మేరకు సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల నిర్ణయం తీసుకుంటే.. వ్యతిరేకిస్తూ కులవాదులు తప్పుడు కేసులు వేయడం వెనుక బాబు అండ్ కో ప్రయోజనాలు దాగున్నాయనేది బహిరంగ సత్యమన్నారు. అమరావతి ఉద్యమం పేరుతో కొనసాగుతున్న దొంగ యాత్రలకు ఇక కాలం చెల్లిందన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య పలువురు దళిత నేతలు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనింగ్‌లో ఏపీవి ఉత్తమ ఫలితాలు

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నాగరాజు ప్రశంస

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం మైనింగ్ రంగంలో మంచి సంస్కరణలు అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిందని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఎం.నాగరాజు ప్రశంసించారు. విజయవాడలోని ఏపీఎండీసీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర మైనింగ్ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఏపీఎండీసీ వీసీ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి ఇతర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సుల్యారీ, జార్ఖండ్ బొగ్గు గనులకు సంబంధించి కేంద్రం ద్వారా అవసరమైన సహకారాన్ని ఎటువంటి జాప్యం లేకుండా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. దేశీయంగా మనకు అపారంగా ఉన్న ఖనిజాలను వెలికితీయడంపై కేంద్రం దృష్టి సారించిందన్నారు. ఇందుకోసం అన్ని రాష్ట్రాల్లోనూ మైనింగ్ విధానాలను పర్యవేక్షించడం, కొత్త మైనింగ్ ఆపరేషన్స్‌ను ప్రారంభించడం కోసం ఆయా రాష్ట్రాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లోని సుల్యారీ బొగ్గు గనిని దక్కించుకుని జాతీయ స్థాయిలో వాణిజ్య సరళిలో బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలైన కోల్ ఇండియా, సింగరేణి సరసన ఏపీఎండీసీ నిలిచినట్లు తెలిపారు. త్వరలో జార్ఖండ్‌లోని బ్రహ్మదియా గనిలో కోకింగ్ కోల్ ఉత్పత్తిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. 2024–25 నాటికి రూ.4,250 కోట్ల మేర మైనింగ్ ఆదాయాన్ని ఆర్జించాలనే లక్ష్యంతో ఏపీఎండీసీ పనిచేస్తోందని వివరించారు.

● తెలంగాణ

సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణ అరెస్టు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి: ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో అనేకమందిని ఆకర్షించి నిండాముంచిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ బి.లక్ష్మీనారాయణ శుక్రవారం అరెస్టయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా 2,500 మంది నుంచి సాహితీ ఇన్‌ఫ్రా రూ.900 కోట్ల వరకు వసూలుచేసినట్లు ఆరోపణలు ఉన్నాయని అదనపు పోలీస్ కమిషనర్ ఏఆర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమీన్‌పూర్‌లోని 23 ఎకరాల విస్తీర్ణంలో సాహితీస్ శ్రావణి ఎలైట్ పేరుతో ఓ ప్రాజెక్టుకు లక్ష్మీనారాయణ శ్రీకారం చుట్టారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ప్రీలాంచ్ ఆఫర్ల దందా మొదలెట్టారు. 38 అంతస్తుల్లో నిర్మిస్తున్న ఈ అపార్ట్‌మెంట్‌లో 1,200, 1,700 చదరపు అడుగుల విస్తీర్ణంతో డబుల్, ట్రిపుల్ బెడ్ రూమ్స్‌తో కూడిన ఫ్లాట్స్ ఉంటాయని ప్రచారం చేశారు. దీనికి ఆకర్షితులైన 1,700 మంది నుంచి రూ.539 కోట్లు వసూలుచేసి మోసంచేశారు. నగరం చుట్టుపక్కల మరికొన్ని ప్రాంతాల్లోనూ వెంచర్లు ప్రారంభించి ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో మోసాలకు ఆయన పాల్పడ్డారు. సాహితీ ఇన్‌ఫ్రా దందాపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరోవైపు.. సాహితి ఇన్‌ఫ్రా వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగినట్లు తెలిసింది.

టీటీడీ సభ్యత్వానికి రాజీనామా

అరెస్టు నేపథ్యంలో.. బుదాటి లక్ష్మీనారాయణ తన టీటీడీ పాలక మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో తాను సమర్పిస్తున్న రాజీనామాను ఆమోదించాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కోరారు.

కవితకు సీబీఐ నోటీసులు

ఢిల్లీ లిక్కర్ కుంభకోణం.. విచారణకు హాజరు కావాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితకు సీబీఐ శుక్రవారం రాత్రి సీఆర్‌పీసీ 160సి కింద నోటీసులు జారీ చేసింది. ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లో లేదా ఢిల్లీలో ఎక్కడైనా సరే విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సీబీఐ డిప్యూటీ సూపరింటెండెంట్ అలోక్ కుమార్ షాహి నోటీసు జారీ చేశారు. ఢిల్లీ మద్యం పాలసీలో కుట్ర కోణానికి సంబంధించి జూలై 22న ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, మరో 14 మందిపై నమోదైన కేసు విచారణ సమయంలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయని అందులో పేర్కొన్నారు. ఆయా అంశాలపై దర్యాప్తులో భాగంగా విచారణకు హాజరు కావాలని కోరారు. కాగా, రెండు రోజుల కిందట ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సన్నిహితుడు అమిత్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ సమయంలో కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో కవిత పేరును ప్రధానంగా ప్రస్తావించారు. సౌత్ గ్రూపు నుంచి విజయ్‌నాయర్‌కు రూ.100 కోట్లు ముడుపులు అందాయని, ఎక్సైజ్ అధికారులకు రూ.కోటి లంచం ఇచ్చారని అధికారులు పేర్కొన్నారు. ఈ సౌత్ గ్రూపును కల్వకుంట్ల కవిత, శరత్‌చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాస్‌రెడ్డి నియంత్రించారని రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. కాగా, తనకు సీబీఐ నుంచి నోటీసులు అందిన మాట వాస్తవమేనని, ఈ నెల 6న తన నివాసంలోనే విచారణకు హాజరవుతానని సీబీఐకి సమాచారం ఇచ్చానని కవిత వెల్లడించారు.

ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో ఈడీ సోదాలు

డైరెక్టర్లు, కోశాధికారి నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు

- నిధులు కొల్లగొట్టి సొంత ఖాతాలకు మళ్లించిన అకాడమీ పెద్దలు
- ఎన్‌ఆర్‌ఐ అకాడమీ నిధులతో సొంత ఆస్పత్రి నిర్మాణం
- మేనేజ్‌మెంట్ కోటా మెడికల్ సీట్లలోనూ గోల్‌మాల్
- కోవిడ్ నిధులనూ నొక్కేసిన వైనం
- అక్రమాల వెనుక తెలుగుదేశం పార్టీ పెద్దల హస్తం
- కీలక ఆధారాలు సేకరించాకే దాడులకు ఉపక్రమించిన ఈడీ




ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో ఈడీ అధికారుల తనిఖీలు

సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: టీడీపీ పెద్దల గుప్పిట్లో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న గుంటూరు జిల్లా చినకాకానిలోని 'ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్'లో అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝుళిపించింది. ఆ అకాడమీ నిర్వహిస్తున్న ఆస్పత్రి, మెడికల్ కాలేజీల నిధులను నిబంధనలకు విరుద్ధంగా కొల్లగొట్టడంపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఎన్ఆర్ఐ ఆస్పత్రితోపాటు విజయవాడలో నివసిస్తున్న ఆ ఆస్పత్రి డైరెక్టర్లు నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, ఉప్పలాపు శ్రీనివాసరావు, వల్లూరిపల్లి నళినీమోహన్‌ల నివాసాలలో ఈడీ బృందాలు శుక్రవారం ఏకకాలంలో విస్తృతంగా సోదాలు నిర్వహించాయి. ఈనాడు రామోజీరావుకు సమీప బంధువు కూడా అయిన ఎన్ఆర్ఐ ఆస్పత్రి కోశాధికారి అక్కినేని మణి నివాసంతోపాటు విజయవాడలో ఆమె నిర్మించిన 'అక్కినేని ఉమెన్స్ ఆస్పత్రి'లో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. 40 మంది ఈడీ అధికారులు బృందాలుగా విడిపోయి శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా 8 గంటలపాటు సోదాలు నిర్వహించడం గమనార్హం. అక్కినేని మణి ఎన్ఆర్ఐ ఆస్పత్రి నిధుల మళ్లింపులో కీలకంగా వ్యవహరించినట్టు ఈడీ అధికారులు భావిస్తున్నారు. విజయవాడ భారతీనగర్‌లోని అక్కినేని ఉమెన్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి నిధులు ఎలా సమకూర్చారని ఆమెను ఈడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఎన్ఆర్ఐ ఆస్పత్రి నిధులను దారి మళ్లించి, ఈ ఆస్పత్రిని నిర్మించినట్టు భావిస్తున్నారు. అక్కినేని ఉమెన్స్ ఆస్పత్రి నిర్మాణ బిల్లులను ఎన్ఆర్ఐ ఆస్పత్రినిధుల నుంచి చెల్లించడం గమనార్హం. ఈ మేరకు ఈడీ అధికారులు కీలక ఆధారాలు సేకరించి, అక్కినేని మణిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

టీడీపీ పెద్దల పాత్రపైనా దృష్టి

టీడీపీ పెద్దలు తమ అక్రమాలకు అక్షయపాత్రగా ఎన్ఆర్ఐ అకాడమీని వాడుకున్నారని తెలుస్తోంది. చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన టీడీపీకి చెందిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజ) కుటుంబం నియంత్రణలో ఎన్ఆర్ఐ అకాడమీ పాలక మండలి చాలా ఏళ్లుగా కొనసాగుతోంది. ఎన్ఆర్ఐ ఆస్పత్రికి అనుబంధంగా ఎన్ఆర్ఐ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో ఆలపాటి రాజ, ఆయన సతీమణి కీలకంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఐ ఆస్పత్రి నిధుల మళ్లింపు వ్యవహారం వెనుక వీరి కుటుంబం పాత్రపైనా ఈడీ దృష్టి సారించినట్టు తెలుస్తోంది. వైద్య పరికరాల కొనుగోలు పేరిట కూడా నిధులు నొక్కేసినట్లు ఈడీ గుర్తించినట్లు తెలుస్తోంది. గతంలో ఈ అకాడమీ డైరెక్టర్‌గా వ్యవహరించిన తన సోదరుడు రవి ద్వారా రాజా ఈ వ్యవహారాలు సాగించినట్లు తెలుస్తోంది. మరోవైపు చంద్రబాబుకు సన్నిహితుడు, ప్రస్తుతం బీజేపీలో ఉన్న సుజనా చౌదరి చేతిలో ఎన్ఆర్ఐ అకాడమీ రిమోట్ కంట్రోల్ ఉందన్నది బహిరంగ రహస్యం. ఈ అకాడమీలో అక్రమాలపై కేసులు నమోదైన నేపథ్యంలో సుజనా చౌదరి వ్యూహాత్మకంగా తన సన్నిహితుడిని ఆస్పత్రిలో కీలక స్థానంలో చేర్చారు. ఆయన ద్వారా గుట్టుచప్పుడు కాకుండా నిధులు దారి మళ్లించారు. కీలక ఆధారాలను ధ్వంసం చేసేందుకు కూడా యత్నించారని తెలుస్తోంది. కంప్యూటర్లలో హార్డ్ డిస్క్‌లను గల్లంతు చేసినట్టు సమాచారం. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన ఈడీ అధికారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్ఆర్ఐ ఆస్పత్రి, డైరెక్టర్లు, ఇతర కీలక వ్యక్తుల నివాసాల్లో ఈడీ అధికారులు శనివారం కూడా సోదాలు కొనసాగిస్తారని సమాచారం. కాగా తాజా సోదాలపై ఈడీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.

సీట్ల పేరిట భారీగా వసూలు

చినకాకానిలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రితో పాటు నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, ఉప్పాల శ్రీనివాసరావు, నళిని మోహన్ నివాసాల్లో నిర్వహించిన సోదాల్లో కూడా నిధుల మళ్లింపునకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించారు. ఎన్ఆర్ఐ ఆస్పత్రి నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఇతర సంస్థలకు మళ్లించినట్టు ఈడీ అధికారులు కీలక ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది. ఎన్ఆర్ఐ ఆస్పత్రి మేనేజ్‌మెంట్ కోటా సీట్ల పేరిట నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఫీజులు వసూలు చేసినట్టు కూడా ఈడీ గుర్తించింది. 2020–21లో ఆస్పత్రి నిధులను ఎన్ఆర్ఐ పాలక మండలి సభ్యులు తమ వ్యక్తిగత ఖాతాలకు మళ్లించినట్టు కూడా ఈడీ ఆధారాలు సేకరించింది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న దాదాపు 2 వేల మంది వివరాలను కూడా ఈడీ అధికారులు అడగడం గమనార్హం. ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో కొందరు ఉద్యోగులను అధికారులు ప్రత్యేకంగా విచారించారు. ముందుగా వారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, అనంతరం వారిని రహస్య ప్రదేశానికి తీసుకువెళ్లి మరీ విచారించి కీలక సమాచారాన్ని రాబట్టారని తెలిసింది. ఆ సమాచారం ఆధారంగానే కొందరు ఆస్పత్రి ఉన్నతాధికారుల నివాసాల్లోనూ తనిఖీలు చేశారు.

కుప్పలు కుప్పలుగా తప్పుడు కథనాలు

రైతుల పేరు వాడుకుంటూ ఈనాడు బురద చల్లుడు

- దళారులను ఆశ్రయించి మోసపోయారంటూ శోకాలు
- రైతు తాజాగా ఆర్బీకేలో ధాన్యాన్ని విక్రయిస్తే.. పది రోజుల క్రితమే దళారులకు అమ్ముకున్నట్లు ఫేక్ స్టోరీలు
- కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగడంతో వాస్తవాలు బహిర్గతం



రైతు వెంకటనాయుడితో మాట్లాడుతున్న కలెక్టరు నిశాంత్‌కుమార్

ఫ్యాక్ట్ చెక్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అదిగో వరి పొలం... రైతులకు అన్యాయం జరుగుతోందంటూ ఇవాళ ఏదోకటి రాయాల్సిందే! నిజ నిర్ధారణతో ఏమాత్రం పనిలేదు!! ఇదీ ఈనాడు రోత రాతల తీరు! కోతలు 40 శాతం కూడా పూర్తి కాకముందే ఎల్లో మీడియా అబద్ధాల కోతలు మొదలయ్యాయి. నూర్పిళ్లు ఇంకా పూర్తవలేదు కానీ ఈనాడు పత్రిక మాత్రం నిరాధార కథనాలను వండివార్చింది. రైతుల పేరుతో రొచ్చు రాతలు రాసేసింది. విజయనగరం జిల్లాలో ఓ రైతు తాజాగా ఆర్బీకేలో ధాన్యాన్ని విక్రయిస్తే రెండు వారాల క్రితమే గిట్టుబాటు ధర లభించక దళారులను ఆశ్రయించి మోసపోయాడంటూ పచ్చి అబద్ధాలను ప్రచురించింది.

- ధాన్యం దళారుల పాలు అంటూ ఈనాడు పత్రిక 23.11.2022న తప్పుడు కథనాన్ని ప్రచురించే నాటికి వరి పొలాల్లో కోతలు 40 శాతం కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. కోసినవారు కూడా నాలుగు రోజులు పనలు ఆరబెట్టి తర్వాత కుప్పలు వేస్తుంటే అన్నదాతలు ఆందోళనతో దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారంటూ శోకాలు పెట్టింది. ఆ వార్తకు పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం తుమరాడకు చెందిన రైతు వెంకటనాయుడి పేరును వాడుకుంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో దళారులకు ధాన్యం విక్రయిస్తున్నామని, 82 కిలోల బస్తాను రూ.1,150కి కొనుగోలు చేస్తున్నారని ఆయన చెప్పినట్లు ఓ కథనం అల్లేసింది. దీనిపై అధికార యంత్రాంగం రంగంలోకి దిగి నిజానిజాలు ఆరా తీయగా అసలు విషయం బహిర్గతమైంది.
- 'ప్రభుత్వం ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని సేకరిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు తొలిగాయి. నాలుగు ఎకరాల సొంత భూమితో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. 180 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో పాటు వ్యవసాయాధికారులు శుక్రవారం ధాన్యాన్ని పరిశీలించారు. నిబంధనల మేరకు మద్దతు ధర అందిస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో బాగున్నాయి. ఇతర రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు' అని వెంకటనాయుడు 'సాక్షి'కి తెలిపారు.
- 'ఈనాడులో నా అభిప్రాయం తప్పుగా వచ్చింది. గత నెల 23వ తేదీ నాటికి వరి కోతలు మాత్రమే పూర్తయ్యాయి. అప్పటికి ఇంకా ధాన్యం ఆరనే లేదు. ఇప్పుడు మాకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం 170 బస్తాలు విక్రయించా' అని వెంకటనాయుడు శుక్రవారం స్వయంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వెల్లడించడం గమనార్హం.



మాట వినకపోతే మాట పలకలేము.
మాటతో నిండిన ఈ ప్రపంచంలో
మాట లేకపోతే శూన్యతే.
సోను ఆనంద్ శర్మ ఆ శూన్యత
నుంచే బయలుదేరింది.
పూర్తి బధిరత్వం వల్ల
మాటకు కూడా దూరమైన సోను
ఈ ప్రపంచంతో బ్యాట్‌తోనే మాట్లాడాలనుకుంది.
బధిర బాడ్మింటన్ క్రీడాకారిణిగా
సోనువి ఘన విజయాలు.
ఆ తర్వాత కోచ్‌గా మారి
దేశానికి ఎందరో క్రీడాకారులనిచ్చింది.
కాని ఇదంతా సులభమా?
బధిరత్వం ఉంటే ఇన్ని ఆటంకాలా?
దివ్యాంగుల గెలుపు కథల్లో సోను కథ
ముఖ్యమైనది.

సోను ఆనంద్ శర్మ

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

నిశ్శబ్ద విజయం



2021 బ్రెజిల్ డెఫ్లింపిక్స్‌లో తన టీమ్‌తో సోనూ ఆనంద్

'పూర్తిగా వినపడకపోతే ఏమవుతుందో తెలుసా?' అని అడుగుతుంది సోను ఆనంద్ శర్మ.

పూర్తిగా వినపడని వారు దానికి పూర్తి సమాధానం చెప్పలేరు. ఎందుకంటే పూర్తిగా వినపడని వారికే ఆ బాధ తీవ్రత తెలుస్తుంది. 'వినడం వల్లే భాష మాట్లాడతాం. వాక్యాన్ని నిర్మిస్తాం. గ్రామర్ నేర్చుకుంటాం. పూర్తి వాక్యం రాస్తాం. పూర్తిగా వినపడకపోతే మీరు మాట్లాడలేరు. రాయలేరు. గ్రామర్‌తో సరిగ్గా రాయలేరు' అంటుందామె.

47 ఏళ్ల సోను ఆనంద్ శర్మ 'డెఫ్లింపిక్స్' (బధిరులకు జరిగే ఒలింపిక్స్)లో బాడ్మింటన్ క్రీడాకారిణిగా ఈ దేశానికి పతకాలు తెచ్చింది. ఆ తర్వాత కోచ్‌గా మారి శిష్యులను తయారు చేసి పతకాలను తెస్తోంది. అయినప్పటికీ ఆమె ఒక బధిరురాలిగా వివక్ష ఎదుర్కొంటూనే ఉంది.

'ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తే ప్రభుత్వం పది లక్షలు ఇస్తుంది. బధిరుల ఒలింపిక్స్‌లో నేను పతకాలు సాధించాను. నా మెడల్స్ కూడా అంతకు సమానమే. అయినా నాకు డబ్బు రాలేదు' అంటుందామె. అంతే కాదు... క్రీడాకారుల పెన్షన్‌లు, నజరానాలు అన్నీ కూడా అన్నీ సవ్యంగా ఉన్నవారికే. దివ్యాంగులకు వివక్షే.

'అయినా సరే నేను నా దేశం కోసం పని చేస్తూనే ఉంటాను' అంటుంది సోను.

సైన్ లాంగ్వేజ్ ఎక్కడ?

సోను ఆనంద్ శర్మది న్యూఢిల్లీ. పుట్టు బధిరురాలు. క్లాసుకు వెళితే టీచర్లకు సైన్ లాంగ్వేజ్ వచ్చేది కాదు. ఈమెకు పాఠాలు వినపడేవి కావు. 'మన దేశంలో ఆరున్నర కోట్ల మంది పూర్తి బధిరులు లేదా పాక్షిక బధిరులు. వారిలో 50 లక్షల మంది పిల్లలు. అయినా మన దేశంలో కేవలం 700 స్కూళ్లలోనే సైన్ లాంగ్వేజ్‌లో చదువు చెప్తారు. సైన్ లాంగ్వేజ్‌ను అధికారిక భాషగా ప్రకటిస్తే సమస్య చాలామటుకు తీరుతుంది. కాని ప్రకటించరు. చదువు రాకపోతే బధిరులు జీవితాంతం ఇబ్బంది పడుతూనే ఉండాలి' అంటుందామె. ఇప్పుడు ఆమె ఢిల్లీ టూరిజంలో ఉద్యోగం చేస్తుంది. మొత్తం డిజిటల్ కమ్యూనికేషనే జరుగుతుంది. సోను కమ్యూనికేట్ చేస్తుంది కాని భాష మెరుగ్గా ఉండదు. 'అందుకని నన్ను ఒకలా చూస్తారు కొలీగ్స్' అంటుందామె.

10 ఏళ్ల వయసు నుంచి

పాఠాలు అర్థం కాకపోవడం వల్ల సోను బాడ్మింటన్‌తో ఆ వెలితి పూడ్చుకోవాలని అనుకుంది. 'కాని మాకు మంచి కోచ్‌లు దొరికేవారు కాదు. కోచ్‌లు దొరికినా వారి దృష్టి నార్మల్ ఆటగాళ్ల మీద ఉండేది. బధిరుల మీద ఫోకస్ ఉండేది కాదు. అందుకని నన్ను నేను నమ్ముకున్నాను. రోజూ ఉదయం నుంచి రాత్రి దాకా ప్రాక్టీసు చేసేదాన్ని. మాది మధ్యతరగతి కుటుంబం. స్కూటర్ కూడా లేదు. బస్‌లో కోర్టుకు తిరుగుతుంటే మా తల్లిదండ్రులు భయపడేవారు... ఆడపిల్లనని... మాటలు రావని. మా నాన్న ఆఫీస్ నుంచి వచ్చి నా కోసం నేను ప్రాక్టీసు చేసే చోట కాచుకుని కూచునేవాడు' అని గుర్తు చేసుకుంది సోను. ఆ శ్రమ వృథా పోలేదు. 1997 సమ్మర్ డెఫ్లింపిక్స్ నుంచి 2009 సమ్మర్ డెఫ్లింపిక్స్ వరకూ దేశం తరఫున ఆడి పతకాల పంట పండించింది సోను ఆనంద్ శర్మ. 2014 నుంచి కోచ్ శిష్యుల ద్వారా పతకాలు తెచ్చి పెడుతోంది. బధిర బాడ్మింటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జెర్లిన్ అనిక ఈమె శిష్యురాలే.

'దివ్యాంగులను తక్కువ అంచనా వేయొద్దు. వారి సామర్థ్యాల పై సానుభూతి వద్దు. మమ్మల్ని గ్రహాంతర వాసుల్లా చూడొద్దు. మీలాగే సాటి మనుషులుగా చూడండి' అంటుంది సోను శర్మ.

వారికి అనువుగా సమాజం మారాలి. వారి కోసం కూడా ఈ సమాజం ఉంది. వారి సమాన వాటాను ఈ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గుర్తు చేసుకుందాం.

ఉమెన్ సేఫ్టీ

అక్షరాలా రక్షణ ఇస్తాయి

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ఇంజినీరింగ్ స్టూడెంట్స్ మహిళల భద్రతకు ఉపయోగపడే బ్రేస్‌లెట్ తయారుచేసి అభినందనలు అందుకున్నారు. గోరఖ్‌పుర్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కాలేజీ'కి చెందిన స్నేహ, అక్షితలు తయారుచేసిన ఈ బ్రేస్‌లెట్‌కు 'నిర్భయ' అని పేరు పెట్టారు. ఈ బ్రేస్‌లెట్ ఉమెన్ సేఫ్టీ యాప్‌కు అనుసంధానమై ఉండడంతో పాటు, అయిదు నంబర్లతో కనెక్టై ఉంటుంది.

మరికొన్ని గ్యాడ్జెట్స్ గురించి...



'బర్డ్‌ఐ' అనేది పర్సనల్ సేఫ్టీ అలారమ్. అన్నివేళలా దీన్ని వెంట తీసుకెళ్లవచ్చు. ఆపద సమయంలో పెద్ద శబ్దం, వెలుగుతో ఎటాకర్‌ను భయపెడుతుంది. చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేస్తుంది. సేఫ్టీగా ఫీలైన సమయంలో డీయాక్టివేట్ చేయవచ్చు. బ్యాగు, పర్స్‌లలో కూడా ఈ పరికరాన్ని తీసుకెళ్లవచ్చు.





డ్రైవ్ చేస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు కింద పడితే, చుట్టుపక్కల ఎవరూ లేకుంటే... ఇలాంటి సమయంలో యాపిల్ వాచ్ ఎస్ఇ(సిరీస్4)లోని 'ఫాల్ డిటెక్ట్ ఫీచర్' ఉపయోగపడుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్స్‌ను అప్రమత్తం చేస్తుంది. 'ది రోడ్ ఐడీ బ్రేస్‌లెట్' కూడా ఇలాంటిదే.



'ది గార్డెడ్ రింగ్' అనేది ఉత్త రింగ్ మాత్రమే కాదు. సెల్ఫ్ డిఫెన్స్ యాక్సెసరీ కూడా. ఆపద సమయంలో ఈ రింగ్‌లో రహస్యంగా అమర్చిన పదునైన బ్లేడ్‌ను ఉపయోగించుకోవచ్చు.

ఇంటిప్స్



- దుమ్ము పట్టేసిన బంగారు నగలను గుమ్మడి కాయ రసంతో తుడిస్తే కొత్తవాటిలా మెరుస్తాయి.
- పనీర్‌ని బ్లాటింగ్ పేపర్‌లో చుట్టి రిఫ్రిజరేటర్‌లో నిల్వ ఉంచితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.
- పనీర్‌ని నేరుగా ఫ్రై చేయకుండా, గోరువెచ్చని నీటిలో వేసి, తీసి ఫ్రై చేస్తే మెత్తగా ఉంటుంది.
- పెరుగు బాగా పుల్లగా అయితే పలుచని క్లాత్‌లో వేసి ఆ నీటిని వడకట్టేయాలి. తరువాత కొద్దిగా పాలు కలిపితే పెరుగు తాజాగా ఉంటుంది. వడకట్టగా వచ్చిన నీటిని వండుతున్న కూరల్లో వేస్తే గ్రేవీ రుచిగా ఉంటుంది.



బ్యూటిప్స్

నయనం మనోహరం



కొన్నిసార్లు మాటల్లో చెప్పలేని భావాలను కళ్లు వ్యక్త పరుస్తాయి. అలాంటి కళ్లకు సంబంధించిన సంరక్షణ తీసుకుంటే కలువల్లాంటి కళ్లు మీసొంతం అవుతాయి ఇలా...

- పడుకోబోయే ముందు రోజ్ వాటర్‌లో కాటన్‌ని ముంచి, కళ్ల చుట్టూ శుభ్రపరచుకుంటే దుమ్ము, ధూళి పోయి కళ్లు తేజోవంతమవుతాయి.
- రాత్రి కనుబొమలకు, కను రెప్పలకు ఆముదం పట్టించి, తెల్లవారి కడిగేస్తే కనుబొమలు, రెప్పలు ఒత్తుగా అవుతాయి.
- కళ్ల చుట్టూ తేనెతో మసాజ్ చేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కళ్లచుట్టూ ఉన్న ముడతలు మటుమాయం అవుతాయి.
- పచ్చిపాలలో కాటన్ ముంచి, కళ్లచుట్టూ సుతిమెత్తగా మర్దనా చేయాలి. ఇలా ప్రతిరోజూ చేస్తే కళ్ల చుట్టూ ఉన్న నల్లని వలయాలు తగ్గుముఖం పడతాయి.
- కీరా జ్యూస్‌లో, రోజ్ వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ అప్లై చేసి, 30 నిమిషాల తరువాత కడిగేయాలి.
- టొమాటో జ్యూస్‌లో నిమ్మరసం కలిపిన మిశ్రమాన్ని కళ్ల చుట్టూ అప్లై చేసి అరగంట తరువాత కడిగెయ్యాలి.
- కొబ్బరినూనెతో కళ్ల చుట్టూ సుతిమెత్తగా మర్దనా చేయాలి. వారంలో రెండుసార్లు ఇలా చేస్తే కళ్లకి అలసటతగ్గడమే కాకుండా నల్లటి వలయాలు కూడా నయం అవుతాయి.

రణతేజం

చాప్టర్ 18

అనుభవాన్ని మించిన జ్ఞానం ఏముంటుంది? ఆ అనుభవ జ్ఞానమే కొన్నిసార్లు ఆయుధజ్ఞానం కూడా అవుతుంది. ఉగ్రవాదంపై మోపే ఉక్కుపాదం అవుతుంది. ఉత్తరాఖండ్‌లోని ఔలి కేంద్రంగా జరిగిన 'యుద్ధ్ అభ్యాస్ 2022' ఈ చలికాలంలో వేడివేడిగా కొత్త శక్తిని మోసుకొచ్చింది.

'యుద్ధ్ అభ్యాస్ 2022' విజయవంతంగా పూర్తయింది. ఉత్తరాఖండ్‌లోని ఔలి మిలిటరీ బేస్ కేంద్రంగా ఇండియా, అమెరికా ఆర్మీలకు చెందిన మహిళా సైనికులు జాయింట్ ట్రైనింగ్ ఎక్సర్‌సైజ్‌లలో పాల్గొన్నారు. యుద్ధాలకు సంబంధించిన సాంకేతిక జ్ఞానంపై అవగాహన, సాధన, ఎత్తుగడలతో పాటు శాంతిపరిరక్షణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణ సహాయ కార్యక్రమాల గురించి ఎలాంటి కార్యాచరణను అనుసరించాలి?... ఇలా ఎన్నో విషయాలను అనుభవజ్ఞుల ద్వారా ఇరుదేశాల సైనికులు నేర్చుకున్నారు.

ఎంపిక చేసిన అంశాలలో నిపుణులతో చర్చా కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

ఒక దేశంలోని ఒక ప్రాంతంలో ప్రకృతి విపత్తు సంభవిస్తే ఏయే వనరులను ఎలా ఉపయోగించుకోవాలి, అంతర్జాతీయ సమాజం నుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలి?.. మొదలైన విషయాలతో పాటు హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ (హెచ్ఏడిఆర్) ఆపరేషన్స్, హెచ్ఏడిఆర్‌లో భారత దేశం పాత్ర ఏమిటి? వాటి నుంచి ఏం నేర్చుకోవచ్చు? ఎలాంటి మార్పులు చేయవచ్చు? డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ అంటే ఏమిటి?... ఇలా ఎన్నో విషయాల గురించి విస్తృత చర్చకు అవకాశం ఏర్పడింది.

'యుద్ధ్ అభ్యాస్'లో ఫీల్డ్ ట్రైనింగ్ ఎక్సర్‌సైజ్‌లు ప్రత్యేకంగా నిలిచాయి. ఒకటా రెండా... మౌంటెన్ వార్ ఫేర్ స్కిల్స్‌కు సంబంధించిన కసరత్తులతోపాటు ఫైరింగ్, షూటింగ్, నేవిగేషన్, ట్యాక్టిక్స్, టెక్నిక్స్ మొదలైన వాటిలో సాధన చేశారు.

'కంబాట్ ఇంజనీరింగ్' లోతు తెలుసుకునే ప్రయత్నం చేశారు.

అధికారిక కార్యక్రమాలు, శిక్షణ ఒక ఎత్తయితే ఇండియా–అమెరికాలకు చెందిన మహిళా సైనికుల పరిచయాలు, అభిప్రాయాలు, అనుభవాలు పరస్పరం పంచుకోవడం మరో ఎత్తు.

'ఉగ్రవాది ఒకడు ఒక ఇంట్లో దూరాడు. ఆ ఇంట్లో వాళ్లకి ఏం జరగకుండా ఉగ్రవాదిని అదుపులో తీసుకోవాలి. ఈ సున్నితమైన సమస్యను ఎలా డీల్ చేశామంటే..' అని చెప్పుకుంటూ పోతుంది మన దేశానికి చెందిన ఉమన్ సోల్జర్.


అమెరికన్ ఉమెన్ సోల్జర్స్ కూడా నేరనియంత్రణలో తాము అనుసరించిన విధానాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తాము ఎలా పని చేసిందీ వివరంగా చెప్పారు

'వినే ఓపిక ఉండాలేగానీ ఏదీ వృథా పోదు' అంటారు పెద్దలు.

ఇండియన్–అమెరికన్ సైనికులు ఒకరి ద్వారా ఒకరు విన్న విషయాలు, నేర్చుకున్న విషయాలు ఏవీ వృథాగా పోలేదు. ఎందుకంటే అవి తమ వృత్తిజీవితానికి పనికి వచ్చే విషయాలు. తమను తాము మరింత పదును పెట్టుకోవడానికి ఉపకరించే విషయాలు. అనుభవ జ్ఞాన మార్గాలు.

'అంతర్జాతీయ ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేయడానికి దేశాలు ఉమ్మడి ప్రణాళికలను రచించుకోవాల్సిన సమయం, సైద్ధాంతిక, సాంకేతిక జ్ఞానాన్ని పరస్పరం ఇచ్చిపుచ్చుకునే సమయం వచ్చేసింది' అంటున్నారు విశ్లేషకులు.

గత సంవత్సరం అలస్కా(యూఎస్) లో జరిగిన యుద్ధ్ అభ్యాస్–2021(చాప్టర్ 17), ఇండో–చైనా సరిహద్దుకు వంద కిలోమీటర్ల దూరంలో ఔలిలో జరిగి, విజయవంతమైన యుద్ధ్ అభ్యాస్ -2022 (చాప్టర్ 18)లను చూస్తే వారి నమ్మకం నిజమైందనే అనిపిస్తుంది.



ఉత్తరాఖండ్‌లోని ఔలి మిలిటరీ బేస్ కేంద్రంగా ఇండియా, అమెరికా ఆర్మీలకు చెందిన మహిళా సైనికులు జాయింట్ ట్రైనింగ్ ఎక్సర్‌సైజ్‌లలో పాల్గొన్నారు.



కాత్యాయని

కళానిధి... కాత్యాయని

ఐఐటీ చెన్నైతో మొదలైంది ఆమె ఉద్యోగ ప్రస్థానం. బిర్లా ఫార్మా, అద్వానీ ఆర్లికాన్, జందు ఫార్మా గ్రూప్ కంపెనీల్లో సాగింది. పెళ్లి తరవాత హైదరాబాద్‌కు వచ్చారామె. హైదరాబాద్‌లో టాటా క్రెడిట్ కార్డ్స్‌లో ఉద్యోగం. ఎంబీయే హెచ్‌ఆర్ చేసిన కాత్యాయని రెండు దశాబ్దాలకు పైగా ప్రఖ్యాతి చెందిన పెద్ద కంపెనీల్లో హెచ్‌ఆర్ మేనేజర్‌గా ఉద్యోగం చేశారు. ఓ సారి ప్రశాంతంగా సింహావలోకనం చేసుకున్నప్పుడు తెలిసింది ఏమిటంటే... ఇప్పటి వరకు తన మేధను, శ్రమను ఆయా కంపెనీల వృద్ధికే వెచ్చించడమైంది. ఇన్నేళ్ల తర్వాత తన ఐడెంటిటీ ఏమిటి? ఫలానా, ఫలానా కంపెనీల మాజీ ఉద్యోగి అనేది మాత్రమే. రిటైర్‌మెంట్ వరకు ఉద్యోగం చేసినా తన గుర్తింపు ఇదే. 'జీవితం అంటే ఇది కాదు' అని ఆమెకి అనిపించిన క్షణాలు చాలా బలమైనవే కావచ్చు. తనకు తానుగా గుర్తింపు తెచ్చుకోవాలి. ఇలా సాగిన ఆలోచనలకు ప్రతిరూపమే త్రిష ట్రెండ్స్. ఇప్పుడామె త్రిష ట్రెండ్స్ ఫౌండర్‌నని తనను తాను గర్వంగా పరిచయం చేసుకుంటున్నారు.

ప్రయోగాల పర్వం!

''మా కుటుంబ మూలాలు కడప జిల్లాలో ఉన్నాయి. నాన్న వ్యాపార ఉద్యోగాల రీత్యా నేను పెరిగింది, చదువు చెన్నైలోనే. పెళ్లితో హైదరాబాద్ వచ్చాను. ఈ నగరంతో మమేకమైపోయాననే చెప్పాలి. నా లైఫ్ జర్నీని ఉద్యోగం చేసిన రోజులు, ఉద్యోగాలిస్తున్న రోజులుగా విభజించుకోవచ్చు. సృజనాత్మకతకు అవకాశం ఉండాలి, నా మార్కు ప్రతిబింబించే పని చేయాలి, నా ఆలోచనలకు ఒక రూపం ఇవ్వాలి... ఇలా ఆలోచించి డిజైనర్ ట్రెండ్స్‌తో కొత్త పంథాలోకి వచ్చేశాను. డిజైనర్ క్లాత్ ఇండస్ట్రీ నిర్వహణ ఎంత సంతృప్తినిస్తోందంటే... ఏ రోజుకారోజు చైతన్యవంతంగా ఉంచుతోంది. ఒక కొత్త డిజైన్‌కి రూపకల్పన చేయడంలో ఉండే సంతోషాన్ని ఆస్వాదిస్తున్నాను.

మధురై, కంచి, కోయంబత్తూర్, భాగల్‌పూర్, కోట, అస్సాం, కోల్‌కతాల నుంచి మెటీరియల్ తెస్తాను. దక్షిణాది మెటీరియల్ మీద ఉత్తరాది ట్రెడిషనల్ డిజైన్స్, అక్కడి వస్త్రాల మీద మన దక్షిణాది డిజైన్‌ల సమ్మేళనంతో అనేక ప్రయోగాలు చేయడం... కొత్త ఉత్సాహాన్నిస్తోంది. మ్యాగజైన్‌లు, ఇంటర్‌నెట్ సర్ఫింగ్‌తో దేశంలోని అన్ని ప్రాంతాల ట్రెడిషనల్ డిజైన్‌లను, ఆలయాల మీద చెక్కిన శిల్పాల నుంచి కొత్త డిజైన్‌లను సేకరిస్తాను. ఆ పేపర్‌ని బ్లాక్ మేకర్స్‌కి ఇచ్చి బ్లాక్ చేయించుకుంటాను. అలా నేను సేకరించిన కళల నిధి, జ్ఞాన నిధి వేలాది బ్లాక్‌ల రూపంలో ఉంది. ప్రతి బ్లాక్ డిజైన్ వెనుక ఓ చరిత్ర, సంస్కృతి ఉంటుంది. గుజరాత్, సింధ్, రాజస్థాన్‌లో ప్రసిద్ధి చెందిన అజ్రక్ ప్రింట్ మీద కూడా స్టడీ చేసి బ్లాక్‌లు చేయించాను.

మహిళలకు మార్గదర్శనం

సగటు మహిళల విషయానికి వస్తే... సొంతంగా ఏదో ఒకటి చేయాలనుకునే వాళ్లు చాలా మంది ఉన్నారు. వాళ్లు సరైన దిశానిర్దేశం చేసే వాళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. నేను కూడా ఎమ్ఎస్ఎమ్ఈ ద్వారా ఇండస్ట్రీ పెట్టాను. నా దగ్గరకు వచ్చిన వాళ్లకు మొదట నేను అనుసరించిన విధానాన్ని వివరిస్తాను. ఎమ్ఎస్ఎమ్ఈ (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియమ్ ఎంటర్‌ప్రైజెస్) ద్వారా ప్రభుత్వ పథకాలను ఎలా అందుకోవాలో వివరిస్తాను. ఏదైనా చేయాలనే ఉత్సాహం ఉండి ఏం చేయాలో తెలియక అయోమయంలో ఉండే మహిళలకు నా సూచన ఒక్కటే... సమాజంలో అవసరాన్ని గుర్తించి ఆ ఇండస్ట్రీలో అడుగుపెట్టాలి. ఓ ఇరవై ఏళ్ల కిందట టెలిఫోన్ బూత్‌లు వీధికి రెండు–మూడు ఉండేవి. మొబైల్ ఫోన్ వచ్చిన తర్వాత అవి కనుమరుగయ్యాయి. మొబైల్ ఫోన్‌లు, రీచార్జ్, యాక్సెసరీస్ షాపులు కనిపిస్తున్నాయి. ఇక ఎప్పటికీ డిమాండ్ తగ్గని రంగాలు ప్రధానంగా మూడు... ఆహారం, ఔషధాలు, దుస్తులు. మనిషి పుట్టినప్పటి నుంచి ఆయుష్షు ఉన్నంత వరకు వీటి అవసరం ఉంటుంది. ఆ తర్వాత స్థానం బ్యూటీ ఇండస్ట్రీది. తమ అభిరుచిని, మార్కెట్ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుంటే జాబ్ సాటిస్‌ఫాక్షన్, ఇండస్ట్రీ గ్రోత్ రెండూ ఉంటాయి'' అని తన జీవనప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారు కాత్యాయని.

– వాకా మంజులారెడ్డి

పిల్లలకు కళల పాఠాలు!



స్కూళ్లు, కాలేజీల్లో ఫైన్ ఆర్ట్స్ స్టూడెంట్స్‌కి ఈ పాఠాలు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటున్నాయి. మా యూనిట్‌కి వచ్చే పిల్లలకు రంగులు కలపడం, డిజైన్ అద్దడం, బ్లాక్‌ల గురించి థియరీ వివరిస్తాను. మనం నేర్చుకున్న విద్య ఇచ్చే సంతోషం మాటల్లో వర్ణించనలవి కాదు. ప్రాజెక్ట్ వర్క్ కోసం వచ్చిన పిల్లలు వాళ్లు నేర్చుకున్న ఆర్ట్‌ని క్లాత్ మీద ముద్రించుకుని ఎంతగా మురిసిపోతారో! దానిని భద్రంగా పట్టుకోవడం, నలగకుండా జాగ్రత్తగా బుక్‌లో పెట్టుకోవడం చూస్తుంటే ముచ్చటేస్తుంది. నేను ఈ రంగంలో దాదాపుగా రీసెర్చ్ చేశాననే చెప్పాలి. నేను సేకరించిన వివరాలు, తెలుసుకున్న విషయాలను శాస్త్రబద్ధంగా గ్రంథస్తం చేయాలి.

– పులికుంట కాత్యాయని,
ఫౌండర్, త్రిష ట్రెండ్స్



వింటర్ కేర్ ఇంత

గత కొద్ది రోజులుగా చలితీవ్రత పెరుగుతూ వస్తోంది. పసి పిల్లలు, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే చలికాలంలో జలుబు, దగ్గు పిల్లలను ఇబ్బందులు పెట్టడం సర్వసాధారణం కాబట్టి వారి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను గుర్తు చేసుకుందాం.

శీతాకాలంలో చిన్నారులకు ఊపిరితిత్తుల సమస్య (ఆస్తమా) వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. చలి నుంచి రక్షించుకునేందుకు స్వెటర్లు వాడాలి. ఈ కాలంలో వైరల్ జ్వరాలు వ్యాపించే ముప్పు ఉంటుంది. దీంతో ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించడం, వైద్యుని సలహా మేరకు మందులు వాడటం మంచిది.

ఇన్ఫెక్షన్లు: చిన్నారులకు ఈ కాలంలో రకరకాల ఇన్ఫెక్షన్ సోకే అవకాశాలుంటాయి. ముఖ్యంగా చెవులలో చీముతో కూడిన కురుపులు వస్తుంటాయి. అలాగే చలికి ముక్కులోపల భాగం పొడిబారటం వల్ల రక్తం కారటం సర్వసాధారణం. అదేవిధంగా చర్మంపై దురదలు రావడం వల్ల గోకినప్పుడు పుండ్లు పడే వీలుంది. ఒకవేళ అలా పుండ్లు పడితే వైద్యులను సంప్రదించి తగిన వైద్యం చేయించాలి. చెవులు కవర్ అయే విధంగా మంకీ క్యాప్ పెట్టాలి. వైద్యుల సలహా మేరకు ముక్కులో, చెవిలో చుక్కల మందు వేయాలి.

చర్మ సంబంధమైన సమస్యలు రాకుండా శరీరానికి మాయిశ్చరైజింగ్ క్రీములు రాయాలి. లేదంటే స్నానం చేయించే ముందు వెన్న లేదా నువ్వుల నూనె రాసి కాసేపు ఎండ తగిలేలా ఉంచాలి. తర్వాత వారు తట్టుకోగలిగే వేడినీళ్లతో స్నానం చేయించాలి. చలి తీవ్రత తగలకుండా చిన్నారులకు రాత్రి, పగలు కూడా ఉన్ని దుస్తులు వేయాలి. చేతులకు గ్లౌజు వేయాలి.



శిరోజాలపై శ్రద్ధ

శీతాకాలంలో తొందరగా పొడిబారిపోయే గుణం ఉండటం వల్ల పిల్లలలో మాడుపై ఉండే తేమ ఆరిపోయి వారి లేత చర్మం చిట్లినట్లవుతుంది. అందువల్ల కొద్ది చుక్కల బేబీ హెయిరాయిల్‌ను తీసుకుని తలపై సున్నితంగా మర్దన చేయడం వల్ల తలపై ఉండే లేత చర్మం పగలకుండా నివారించవచ్చు.

పోషకాహారం



చలికాలంలో పోషకాలు ఉండే ఆహారాలను ఇవ్వడం వల్ల వారికి జబ్బులను తట్టుకునే శక్తి వస్తుంది. పాలిచ్చే తల్లులయితే తాము తీసుకునే ఆహారంలో తగిన పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఆహారం తీసుకునేంత పిల్లలయితే వారికి ఈ రుతువులో దొరికే పండ్లు తినిపించాలి.

స్నానంలో జాగ్రత్తలు



శిశువు చర్మసంరక్షణలో స్నానం ముఖ్యమైనది చలికాలం కదా అని కొందరు పిల్లలకు బాగా వేడి నీళ్లతో స్నానం చేయిస్తారు. దీని వల్ల పిల్లల్లో చర్మం పొడిబారుతుంది. అందువల్ల, చలికాలంలో స్నానానికి ఎక్కువ సమయం కేటాయించకుండా కొద్దిపాటి వేడినీటితో వీలయినంత తొందరగా స్నానం చేయించడం ఉత్తమం. దీనివల్ల చర్మంలోని తేమ నులభంగా తగ్గదు. వాతావరణం మరీ చల్లగా ఉంటే స్పాంజ్ బాత్ కూడా చేయించవచ్చు.

క్రీమ్, మాయిశ్చరైజర్: పిల్లల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి ఏదైనా క్రీమ్ లేదా లోషన్ ఉపయోగించే ముందు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం సహజ ఉత్పత్తులు లేదా డాక్టర్ ఆమోదించిన క్రీమ్ లేదా మాయిశ్చరైజర్‌ను ఉపయోగించడం మేలు. దీనిమూలంగా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. అంతేకాదు, చలికాలంలో పిల్లల చర్మం చాలా త్వరగా గరుకుగా మారుతుంది. స్నానం చేసిన తర్వాత వారికి బేబీ లోషన్ రాయాలి.

పెదవులు పగలకుండా: చలికాలంలో పిల్లలకు పెదవులు పగలడం సర్వసాధారణం. దీనిని నివారించడానికి వెన్న లేదా పేరిన నెయ్యిని వారి పెదవులకు రాస్తూ ఉండాలి. అది లోపలికి పోయినా ప్రమాదం ఉండదు.

డైపర్ ర్యాషెస్ రాకుండా...
ఏ కాలంలో అయినా పసిపిల్లలకు కు డైపర్ రాష్ సమస్యలు సాధారణం. డైపర్ రాష్‌ను ఎదుర్కోవడానికి వైద్యుల సలహా మేరకు క్రీమ్‌లు, మాయిశ్చరైజర్‌లను ఉపయోగించాలి.

అలాగే, డైపర్ ప్రాంతాన్ని ఆల్కహాల్ లేని వెట్ వైప్‌లతో శుభ్రం చేయడం మేలు. అలోవెరా జెల్ రాసినా ఫరవాలేదు.

అన్నింటికీ మించి బిడ్డలకు తల్లి కౌగిలి ఎక్కువ వెచ్చదనాన్ని, భద్రతను ఇస్తుంది కాబట్టి వీలయినంత వరకు పిల్లలకు దగ్గర గా ఉండేలా చూసుకోవాలి.

● హెల్త్ టిప్

పాలు, మెంతిపొడి కలిపి తీసుకుంటే...

● మెంతుల్ని ఏ రూపంలో తీసుకున్నా ఆరోగ్యపరంగా చాలా ప్రయోజనాలున్నాయి. అదే రాత్రి వేళ మెంతి గింజల్ని పాలలో ఉడకబెట్టి లేదా చిటికడు మెంతి పొడిని పాలలో కలిపి తాగితే సుఖమైన నిద్ర పడుతుంది.
● శరీరం అంతర్గతంగా పటిష్టమౌతుంది.
● వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
● శరీరంలో ఇమ్యూనిటీని పెంచేందుకు పాలు, మెంతులు చాలా బాగా ఉపయోగపడతాయి. అంతేకాకుండా.. జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యల్నించి ఉపశమనం కల్గిస్తుంది. అందుకే చలికాలంలో మెంతిపొడిని పాలలో కలిపి తాగడం వల్ల చాలా లాభాలున్నాయి.
● గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఎందుకంటే మెంతులు కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. బ్లడ్ ప్రెషర్ నియంత్రిస్తాయి. మెంతిపొడిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుంది.



● పాలలో తీసుకోలేనివారు రాత్రి పూట గ్లాసు నీళ్లలో అరచెంచా లేదా చెంచా మెంతులను నానబెట్టి ఉదయాన్నే ఆ మెంతులను నమిలి, నీటిని తాగినా మంచిదే. అయితే వేడిపాలలో చిటికడు మెంతుల పొడి కలుపుకుని తాగడం వల్ల పైన చెప్పిన ప్రయోజనాలు కలుగుతాయని అనుభవజ్ఞుల సూచన.

చలి కాలంలో వచ్చే కీళ్ల నొప్పులకు ఇంటి చిట్కాలు

ఆర్థరైటిస్ ఉన్నవారు సహజంగానే చలికాలంలో కీళ్లనొప్పులతో విలవిలలాడుతుంటారు. అయితే మందుల జోలికి వెళ్లకుండా కొన్ని చిట్కాలను పాటించడం వల్ల కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు.



అలోవెరా జెల్: గ్రామాలలో కలబంద అని పిలిచే అలోవెరాలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల ఆర్థరైటిస్ నొప్పులు తగ్గుతాయి. ఇందుకోసం కొద్దిగా కలబంద గుజ్జును తీసుకుని నొప్పి ఉన్న ప్రదేశంలో రాయాలి. కొంత కడుపులోకి తీసుకుంటే మంచిది. క్రమేణా కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

నీలగిరి ఆకుల తైలం (దీనికే యూకలిప్టస్ ఆయిల్ అని పేరు) 15 చుక్కల మోతాదులో తీసుకుని దానికి రెండు టేబుల్ స్పూన్ల బాదం నూనె కలిపి నొప్పి ఉన్న ప్రదేశంలో రాయాలి. అయితే నీలగిరి ఆకుల తైలం కొందరికి పడదు. అందుకు గాను వారు ముందుగా కొద్దిగా ఆయిల్‌ను తీసుకుని ముంజేతిపై రాసి కొద్దిసేపు వేచి ఉండాలి. ఎలాంటి రియాక్షన్ లేకపోతే నిరభ్యంతరంగా ఆ నూనెను వాడుకోవచ్చు. దీంతో కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

అల్లం రసం: దీనికి నొప్పులు, వాపులు తగ్గించే గుణం ఉంది. అందువల్ల అల్లం రసాన్ని తాగినా, దాంతో కషాయం చేసుకుని తాగినా లేదా అప్పుడప్పుడు చిన్న అల్లం ముక్కను నములుతూ ఉన్నా కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

గ్రీన్ టీ: అధిక బరువు, కీళ్లనొప్పులతో బాధపడేవారు గ్రీన్ టీ తాగితే మంచిది. ఎందుకంటే గ్రీన్ టీ లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వాపులను తగ్గిస్తాయి. అందువల్ల కీళ్ల నొప్పులు ఉన్నవారు గ్రీన్ టీ తాగాలి. గ్రీన్ టీ ఎక్స్‌ట్రాక్ట్ ట్యాబ్లెట్లు కూడా మనకు లభిస్తాయి. వాటిని వైద్యుల సూచన మేరకు వాడుకోవచ్చు.

పసుపు: ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. గ్లాసు వేడినీళ్లలో చిటికడు పసుపు వేసి మూతపెట్టి అవి గోరువెచ్చగా అయిన తర్వాత తాగాలి. లేదంటే వాపులు, నొప్పి ఉన్న ప్రదేశంలో కొద్దిగా పసుపు, నీరు మిశ్రమంతో మర్దనా చేయడం వల్ల నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

● మీకు తెలుసా?

సానుకూలతే సగం బలం



సానుకూల భావోద్వేగాలుగా చెప్పుకునే ప్రేమ, అనురాగం, అభిమానం, ఆప్యాయత వంటి గుణాలు కలిగి ఉన్న మనిషి ఆరోగ్యంగా ఉంటాడని వైద్యశాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే .... సానుకూలమైన అనుభూతులతో ఉన్న మనిషిలో తెల్ల రక్తకణాలు వృద్ధి చెంది, వ్యాధికారక క్రిములను పెరగకుండా నిరోధిస్తాయని కూడా చెబుతున్నారు. కోపం, ద్వేషం, దుఃఖం, విచారం, అసూయ వంటి ప్రతికూల భావోద్వేగాలు మనిషిని మానసికంగా ఒత్తిళ్లు, ఆందోళనలకు గురిచేసి తెల్ల రక్తకణాలను తగ్గిస్తాయి. ఫలితంగా మనిషి అనారోగ్యానికి గురవుతాడంటారు శాస్త్రజ్ఞులు. మంచి ఆలోచనలు మనిషిని ఆనందంగా, ఆరోగ్యంగా ఉంచుతాయంటున్నారు. అందుకే అన్నిటినీ నెగటివ్‌గా ఆలోచించి, అన్నింటిలోనూ నెగటివిటీని చూసే బదులు పాజిటివ్‌గా ఆలోచిస్తూ పాజిటివ్‌గా ఉండటం వల్ల అటు మానసికంగానూ, ఇటు శారీరకంగానూ కూడా ఆరోగ్యం బాగుంటుంది.

సినిమా

లేట్ అయినా లేటెస్ట్‌గా...


● ప్రభాస్


● ధనుష్

అభిమాన హీరో సినిమా విడుదల కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తారు. కానీ చెప్పిన తేదీకి ఆ సినిమా రాకపోతే నిరుత్సాహపడతారు. 2022లో అలా అభిమానులను నిరాశపరచిన స్టార్స్ ఉన్నారు. ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై కనిపించాల్సిన ఆ హీరోల సినిమాలు వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి. లేట్ అయినా కొన్ని మెరుగులు దిద్దుకుని లేటెస్ట్‌గా రావడానికి ఆ స్టార్స్ రెడీ అవుతున్నారు. ఇక వాయిదా పడిన కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

వరుస పాన్ ఇండియా సినిమాలతో దూసుకెళుతున్న ప్రభాస్ హీరోగా నటించిన మరో పాన్ ఇండియా మూవీ 'ఆదిపురుష్'. ఓం రౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాముడి పాత్రలో ప్రభాస్, సీత పాత్రలో కృతీ సనన్ నటించారు. 'ఆదిపురుష్' నుంచి రిలీజైన పోస్టర్‌లు, టీజర్ సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ చేశాయి. ఈ సినిమాని 2022 ఆగస్టు 11న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ తొలుత ప్రకటించడంతో సినీ అభిమానులు, ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా ఎదురు చూశారు. అయితే కొన్ని కారణాల వల్ల 'ఆదిపురుష్' ఆగస్టులో వాయిదా పడి 2023 సంక్రాంతి బరిలో నిలిచింది. జనవరి 12న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఇదిలా ఉంటే.. 'ఆదిపురుష్' ట్రైలర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. గ్రాఫిక్స్, పాత్రల తీరు బాగా లేవంటూ నెటిజన్లు విమర్శలు గుప్పించడంతో చిత్ర యూనిట్ దిద్దుబాటు చర్యలు చేపట్టిందని టాక్. ఈ క్రమంలోనే జనవరి 12న రిలీజ్ వాయిదా వేసి, జూన్ 16న విడుదల చేయడానికి నిర్ణయించుకుని ఉంటారని ఊహించవచ్చు. కాగా విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఖుషి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్రిస్మస్ సందర్భంగా ఈ డిసెంబర్ 23న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ మేరకు ప్రచార చిత్రాలను కూడా విడుదల చేసింది. అయితే, అనారోగ్య సమస్యల వల్ల సమంత షూటింగ్‌కి దూరం కావడంతో చిత్రీకరణ బ్యాలెన్స్ ఉందట. ఈ కారణంగా ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. అన్నీ అనుకున్నట్టు జరిగితే 2023 ఫిబ్రవరి లేదా వేసవిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ఆలోచనలో ఉందట యూనిట్. ఇక సమంత టైటిల్ రోల్‌లో నటించిన పాన్ ఇండియా సినిమా 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వం వహించారు. ఈ పీరియాడికల్ మూవీని నవంబర్ 4న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే ఆ డేట్‌కి వాయిదా పడింది. ఈ సినిమాను 3డీ ఫార్మాట్‌లో బెస్ట్ క్వాలిటీతో విడుదల చేయాలని చిత్రయూనిట్ నిర్ణయించుకుంది. ఈ పనుల కోసం మరింత సమయం పట్టనుండటంతో రిలీజ్‌ను వాయిదా వేసినట్లు యూనిట్ ప్రకటించింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే విషయంపై చిత్రబృందం త్వరలో క్లారిటీ ఇవ్వనుంది. అదేవిధంగా అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'ఏజెంట్' కూడా వాయిదాల లిస్ట్‌లో ఉంది. ఈ సినిమా కోసం అఖిల్ చాలా హార్డ్ వర్క్ చేసి, సిక్స్ ప్యాక్ బాడీని కూడా బిల్డ్ చేశారు. ఈ ఏడాది ఆగస్టు 12న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే కొన్ని కారణాల వల్ల అప్పుడు వాయిదా పడింది. ఆ తర్వాత ఈ డిసెంబర్‌లో రిలీజ్ ఉంటుందనే ప్రచారం జరిగింది. అయితే 'ఏజెంట్'ని 2023 సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్టు యూనిట్ ప్రకటించింది. అయితే సంక్రాంతికి చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ 'వీరసింహారెడ్డి', విజయ్ 'వారసుడు' చిత్రాలు విడుదలవుతున్నాయి. సీనియర్ హీరోల సినిమాల మధ్య యువ హీరో నటించిన 'ఏజెంట్' రిలీజ్ అవుతుందా? కాదా అనే టాక్ ఇండస్ట్రీలో నడుస్తోంది. ఈ సినిమా రిలీజ్‌పై చిత్ర యూనిట్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. అలాగే పవన్ కల్యాణ్ హీరోగా క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'హరి హర వీరమల్లు'. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దసరాకి అక్టోబరులో విడుదల చేయాలనుకున్నారు. అయితే పవన్ కల్యాణ్ అటు రాజకీయాలు, ఇటు సినిమాలు చేస్తుండటంతో షూటింగ్ ఆలస్యం అవుతోంది. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని టాక్. కాగా తమిళ హీరో ధనుష్ నటించిన తొలి స్ట్రయిట్ తెలుగు చిత్రం 'సార్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈ డిసెంబర్ 2న (శుక్రవారం) విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ మూవీ రిలీజ్‌ని వాయిదా వేస్తూ యూనిట్ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది చిత్ర యూనిట్. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకుడు. ఈ సినిమాని ఈ ఏడాది విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ తొలుత ప్రకటించింది. అయితే వచ్చే ఏడాది ఫిబ్రవరి 17కి వాయిదా పడింది.

ఇవే కాదు.. మరికొన్ని సినిమాలు కూడా వివిధ కారణాల వల్ల విడుదల తేదీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త ఏడాదిలో రిలీజ్‌కి సరికొత్తగా ముస్తాబవుతున్నాయి.


● విజయ్ దేవరకొండ, సమంత


● సమంత


● అఖిల్


● సాయితేజ్, జయంత్, బాపినీడు, బీవీఎస్ఎన్ ప్రసాద్

కొత్త ప్రారంభం

సాయితేజ్ హీరోగా శుక్రవారం హైదరాబాద్‌లో కొత్త సినిమా ఆరంభమైంది. జయంత్ పానుగంటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత భోగవల్లి బాపినీడు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో సాయి తేజ్ క్లాప్ ఇచ్చారు. సాయి తేజ్ తల్లి విజయదుర్గ, బీవీఎస్ఎన్ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిర్మాత బీవీఎస్ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ– ''సాయితేజ్‌తో మా నిర్మాణ సంస్థకు ఉన్న ప్రత్యేక అనుబంధంతో మరో సినిమా చేస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందనుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు.

కృష్ణవేణికి ఘంటసాల శతాబ్ది పురస్కారం



ప్రముఖ సీనియర్ నటి, నిర్మాత కృష్ణవేణి 'ఆకృతి- ఘంటసాల శతాబ్ది పురస్కారం' అందుకున్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆకృతి- ఘంటసాల శతాబ్ది పురస్కారాన్ని కృష్ణవేణికి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''ఎవరినైనా సక్సెస్ తర్వాతే గుర్తు పెట్టుకుంటారు. కానీ, ఎంతోమందికి సక్సెస్ ఇచ్చిన కృష్ణవేణిగారికి తగినంత గుర్తింపు రాకపోవడం బాధాకరం'' అన్నారు. ''నేటి తరం సినిమా వాళ్లకు కృష్ణవేణిగారి జీవితం పుస్తకంలా ఉపయోగపడుతుంది'' అన్నారు తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్. ''కృష్ణవేణిగారు ఒక లెజెండ్'' అన్నారు నటి రోజా రమణి. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మనవరాలు అజిత, ఫిక్కీ సీఎండీ అచ్యుత జగదీష్ చంద్ర, నటుడు మోహనకృష్ణ, 'ఆకృతి' సుధాకర్ పాల్గొన్నారు.

కథ వెనుక కథ... మంచి కథ - అలీ


● కృష్ణచైతన్య, అలీ, విశ్వంత్, అవనీంద్ర కుమార్, సునీల్

విశ్వంత్ దుద్దుంపూడి, శ్రీజిత ఘోష్, శుభశ్రీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమాకు 'కథ వెనుక కథ' అనే టైటిల్ ఖరారు చేశారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో సాయి స్రవంతి మూవీస్ సమర్పణలో దండమూడి బాక్సాఫీస్, సాయి స్రవంతి మూవీస్ పతాకాలపై అవనీంద్ర కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నటుడు, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ మాట్లాడుతూ– ''కథ వెనుక కథ మంచి కథ. దండమూడి అవనీంద్ర కుమార్‌గారిది గోల్డెన్ హ్యాండ్. ఏ వ్యాపారం చేసినా కలిసి వస్తుంది' అని అన్నారు. ''కథ వెనుక కథ'లో చాలా కథలున్నాయి'' అన్నారు సునీల్. ''ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం'' అన్నారు విశ్వంత్. ''ఈ సినిమాలో మంచి ట్విస్ట్‌లు ఉన్నాయి'' అన్నారు అవనీంద్ర కుమార్. ''నిర్మాత అవనీంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సాయిగార్ల వల్లే ఈ సినిమాను లార్జ్ స్కేల్‌లో చేస్తున్నాం'' అన్నారు కృష్ణచైతన్య.

న్యాయం కోసం...


● శ్రద్ధా శ్రీనాథ్

శ్రద్ధా శ్రీనాథ్, రోహిణి, షణ్ముగ రాజా, అళగం పెరుమాళ్, జి. సెల్వ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'విట్‌నెస్'. ఈ సినిమాకు దర్శకుడిగా వ్యవహరించడంతో పాటు సినిమాటోగ్రాఫర్‌గాను చేశారు దీపక్. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా సోనీ లివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ''పారిశుద్ధ్య కార్మికుల జీవితాల ఆధారంగా రూపొందిన చిత్రం ఇది. పార్తీపన్ అనే 20 ఏళ్ల కుర్రాడు ఓ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తూ మరణిస్తాడు. అప్పుడు అతని తల్లి ఇంద్రాణి న్యాయం కోసం ఎలా పోరాడింది? అనే నేపథ్యంలో మూవీ ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఘనంగా నీలిమ గుణ వివాహం


● యుక్త, రాగిణి, గుణశేఖర్, చిరంజీవి, రవి ప్రఖ్యా, నీలిమ, సురేఖ

ప్రముఖ దర్శక-నిర్మాత గుణశేఖర్ కుమార్తె నీలిమ గుణ వివాహం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ప్యాలెస్‌లో శుక్రవారం రాత్రి 12 గంటల 31 నిమిషాలకు (తెల్లవారితే శనివారం) ఈ పెళ్లి జరిగింది. హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ విద్య, వ్యాపారవేత్త, శ్రీ శక్తి గ్రూప్ అధినేతలు డా.రామకృష్ణ పింజల, సత్య పింజల కుమారుడు, వ్యాపారవేత్త రవి ప్రఖ్యాతో నీలిమ గుణ ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా 'రుద్రమదేవి' సినిమాకి సహనిర్మాతగా వ్యవహరించిన నీలిమ 'శాకుంతలం' (సమంత లీడ్ రోల్‌లో నటించారు) సినిమాతో నిర్మాతగా మారారు.

సాక్షి బిజినెస్
శనివారం
3-12-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
416	116
62,869	18,696

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ			
నాస్‌డాక్	11,405	▽	77
డోజోన్స్	34,334	▽	61
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,556	▽	2
డాక్స్	14,529	△	39
హాంసెంగ్	3,156	▽	9
నికాయ్	28,226	▽	448

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	53,656	△	475
బంగారం (99.5 స్వచ్ఛత)	53,441	△	473
వెండి (కేజీ)	64,434	△	1,231

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.39	82.06
€	యూరో	ఒకటి	83.96	86.94
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	97.86	101.14
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	59.16	61.08
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.22	56.54
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.43	61.42
SAR	సౌదీ రియాల్	బాంకుపడి	20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్	బాంకుపడి	21.24	23.04
¥	చైనా యువాన్	బాంకుపడి	10.45	12.48

మార్కెట్లోకి రెండు మెర్సిడెస్ బెంజ్ ఎస్‌యూవీలు

ధర శ్రేణి రూ. 63.8-74.5 లక్షలు

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం మెర్సిడెస్-బెంజ్ ఇండియా తాజాగా దేశీ మార్కెట్లోకి రెండు సెవెన్ సీటర్ స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలను (ఎస్‌యూవీ) ప్రవేశపెట్టింది. జీఎల్‌బీ, ఈక్యూబీ వాహనాలు వీటిలో ఉన్నాయి. వీటి ధర రూ. 63.8 లక్షల నుంచి రూ. 74.5 లక్షల వరకూ (ఎక్స్‌షోరూం) ఉంటాయి. జీఎల్‌బీ శ్రేణి మూడు వేరియంట్లలో లభిస్తుంది. వేరియంట్‌ను బట్టి ధర రూ. 63.8 లక్షల నుంచి రూ. 69.8 లక్షల వరకూ ఉంటుంది. ఇక పూర్తి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ అయిన ఈక్యూబీ 300 4మ్యాటిక్ ధర రూ. 74.5 లక్షలుగా ఉంటుంది. ఈ రెండు ఎస్‌యూవీలు మరింత విశాలంగా ఉంటాయని మెర్సిడెస్-బెంజ్ ఇండియా ఎండీ మార్టిన్ ష్వెంక్ తెలిపారు. తొలిసారిగా తాము పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ మూడు వేరియంట్లలోనూ అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 30 అల్ట్రా-ఫాస్ట్ చార్జర్లను నెలకొల్పామని, ఈ ఏడాది ఆఖరు నాటికి మరో 10 ఏర్పాటు చేస్తామని ష్వెంక్ వివరించారు.



జనవరి నుంచి మారుతీ కార్ల రేట్ల పెంపు

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ జనవరి నుంచి వాహనాల ధరలను గణనీయంగా పెంచనున్నట్లు ప్రకటించింది. ముడి వస్తువుల ధరలు పెరుగుతుండటం, 2023 ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్న కఠినతర ఉద్గార ప్రమాణాల వల్ల తయారీ వ్యయాలు పెరగనుండటమే ఇందుకు కారణం. అయితే నిర్దిష్టంగా ఎంత పెంచేదీ వెల్లడించలేదు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే కమోడిటీల రేట్లు ఇప్పటికీ అధిక స్థాయిల్లోనే ఉంటున్నాయని సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ చెప్పారు. అంతే కాకుండా మెటీరియల్స్ మొదలుకుని సిబ్బంది వ్యయాల వరకూ అన్నింటి వ్యయాలు పెరిగిపోయాయన్నారు. ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే కొత్త ఉద్గార ప్రమాణాలకు తగ్గట్లుగా వాహనాలను కూడా మార్చాల్సి వస్తుందని శ్రీవాస్తవ తెలిపారు. గతంలో రేట్లు కొంత పెంచినప్పటికీ కమోడిటీల ధరలు పెరగడం వల్ల దానికి సంబంధించి పెద్దగా ప్రయోజనం లభించలేదన్నారు. దీంతో మరో దఫా రేట్ల పెంపు తప్పడం లేదని శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే మారుతీ తమ వాహనాల ధరలను సుమారు 1.3 శాతం పెంచింది.




సీఎంఆర్ బహుమతుల మేళా

తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ షాపింగ్ మాల్ 40 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా రూ.12 కోట్ల విలువైన బహుమతుల మేళాను ప్రకటించింది. క్రిస్మస్ సంబరాలను పురస్కరించుకుని ప్రజలను మరింత ఉత్సాహపరిచే రీతిలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రకటన ప్రకారం ప్రతి రూ.1999 కొనుగోలుపై స్పాట్ గిఫ్ట్ ఉంటుంది. ఈ ఆఫర్ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తమ షాపింగ్స్ మాల్స్‌లో డిసెంబర్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంతే కాకుండా అన్ని రకాల వస్త్రాలపై 1+1, కాంబో ఆఫర్లను కూడా అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. 'సీఎంఆర్‌కు వచ్చిన ప్రతి కొనుగోలుదారుడూ అదృష్టవంతుడే' అన్న థీమ్‌తో ప్రతి ఒక్కరికీ స్పాట్ గిఫ్ట్ అందించడం జరుగుతోందని సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ మావూరి వెంకటరమణ పేర్కొన్నారు.

CMR SHOPPING MALL
The joy of life

ఎనిమిది రోజుల ర్యాలీకి బ్రేక్...



ముంబై: స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీకి శుక్రవారం విరామం పడింది. ఎనిమిది రోజుల సుదీర్ఘ ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంక్స్, ఫైనాన్స్, ఐటీ, ఆటో షేర్లలో లాభాల స్వీకరణకు దిగారు. ప్రపంచ మార్కెట్లలోని ప్రతికూలతలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు క్రమంగా లాభాలను కోల్పోతూ ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే ట్రేడయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 305 పాయింట్లు పతనంతో 62,979 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఒక దశలో 605 పాయింట్లు క్షీణించి 62,680 కనిష్టాన్ని తాకింది. చివరికి 416 పాయింట్లు నష్టపోయి 62,869 వద్ద నిలిచింది. నిఫ్టీ 61 పాయింట్ల పతనంతో 18,752 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 174 పాయింట్ల నష్టపోయింది. మార్కెట్ ముగిసేసరికి 116 పాయింట్ల క్షీణించి 18,696 వద్ద స్థిరపడింది. విస్తృతస్థాయి మార్కెట్లో పలు స్టాకులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతం మేర క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.712 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.215 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు అంశాన్ని ప్రభావితం చేసే అమెరికా పేరోల్స్ డేటా వెల్లడి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. ఈ వారంలో సెన్సెక్స్ 63,284 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసి 185 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ 18,812 వద్ద సరికొత్త గరిష్టాన్ని అందుకొని 54 పాయింట్లు లాభపడింది.

''సూచీల సుదీర్ఘ ర్యాలీ నేపథ్యంలో పలు స్టాకులు అధిక విలువ వద్ద ట్రేడవుతున్నాయి. మార్కెట్లో అప్‌సైడ్ మూమెంటమ్‌కు అవకాశాలు పరిమితమయ్యాయి. నవంబర్ అమ్మకాలు అంచనాలను అందుకోలేకపోవడంతో ఆటో షేర్లు డీలా పడ్డాయి. లార్జ్ క్యాప్ షేర్లలో విస్తృతంగా లాభాల స్వీకరణ జరగడంతో సూచీలు వారాంతాన్ని నష్టాలతో ముగించాయి. వచ్చే వారంలో జరగనున్న ఆర్‌బీఐ రుణ పాలసీ, ఈ నెల 15న జరిగే ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశ నిర్ణయాలు రానున్న రోజుల్లో మార్కెట్‌కు దిశానిర్దేశం చేస్తాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. కాగా ఎన్‌డీటీవీ షేరు జోరుకు శుక్రవారం బ్రేక్ పడింది. బీఎస్‌ఈలో రెండున్నర శాతం నష్టపోయి రూ.414 వద్ద స్థిరపడింది. టేకోవర్‌కు అదానీ గ్రూప్ ఓపెన్ ఆఫర్ బిడ్డింగ్ ప్రారంభం(నవంబర్ 22) నాటి నుంచి ఈ షేరు 16% ర్యాలీ చేసింది.

యూనిపార్ట్స్ ఐపీవోకు క్యూ

ఇంజనీరింగ్ సిస్టమ్స్, సొల్యూషన్స్ అందించే యూనిపార్ట్స్ ఇండియా పబ్లిక్ ఇష్యూకి ఇన్వెస్టర్లు క్యూ కట్టారు. ఇష్యూ చివరి రోజు శుక్రవారాని(2) కల్లా 25 రెట్లు స్పందన లభించింది. షేరుకి రూ. 548-577 ధరలో చేపట్టిన ఆఫర్‌లో భాగంగా కంపెనీ 1,01,37,360 షేర్లను విక్రయానికి ఉంచింది.

బైద్యనాథ్ ఆయుర్వేద్ భవన్‌లో అక్రమాలు?

కార్పొరేట్ శాఖ, ఎస్‌ఎఫ్‌ఐవో వద్ద ఫిర్యాదులు

శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద్ భవన్ ప్రైవేటు లిమిటెడ్‌కు వ్యతిరేకంగా కార్పొరేట్ వ్యవహారాల శాఖ, తీవ్ర నేరాల దర్యాప్తు సంస్థ (ఎస్‌ఎఫ్‌ఐవో), రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ) వద్ద ఫిర్యాదులు దాఖలయ్యాయి. కంపెనీలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా మైనారిటీ వాటాదారులు ఈ ఫిర్యాదులు దాఖలు చేశారు. పెద్దగా ఆస్తుల్లేని 72 బోగస్ కంపెనీలను, ఎల్‌ఎల్‌పీలను ఏర్పాటు చేయడంతోపాటు, వీటి రూపంలో నిధులు మళ్లిస్తున్నట్లు మైనారిటీ వాటాదారులు ఆరోపించారు.

Baidyanath

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-12-2022	
విశాఖ	540-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	534-00
విజయవాడ	534-00
రిటైల్ ధర (డజను)	78.00
02-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	541-00
వరంగల్	543-00
రిటైల్ ధర	6.00



ఎంవోయూ కార్యక్రమంలో పాల్గొన్న జయేష్ రంజన్, ఏఆర్‌బీఎల్ ప్రెసిడెంట్ విజయానంద్ సముద్రాల, మంత్రి కేటీఆర్, ఏఆర్‌బీఎల్ సీఎండీ జయదేవ్ గల్లా, ఈడీ విక్రమాదిత్య గౌరినేని (ఎడమ నుండి కుడికి)

తెలంగాణలో అమర రాజా బ్యాటరీ ప్లాంటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమర రాజా బ్యాటరీస్(ఏఆర్‌బీఎల్) తెలంగాణ లిథియం-అయాన్ బ్యాటరీల పరిశోధన, తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వచ్చే పదేళ్లలో వీటిపై రూ. 9,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. దీనికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో కంపెనీ శుక్రవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లాలో 16 గిగావాట్ అవర్ (జీడబ్ల్యూహెచ్) అంతిమ సామర్థ్యంతో లిథియం సెల్ గిగాఫ్యాక్టరీ, 5 జీడబ్ల్యూహెచ్ వరకూ సామర్థ్యంతో బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. 'లిథియం-అయాన్ సెల్ తయారీ రంగానికి సంబంధించి దేశంలోనే అతి పెద్ద పెట్టుబడుల్లో ఇది ఒకటి. తెలంగాణలో గిగాఫ్యాక్టరీ ఏర్పాటు కావడమనేది.. రాష్ట్రం ఈవీల తయారీ హబ్‌గా ఎదిగేందుకు, దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల విప్లవానికి సారథ్యం వహించాలన్న ఆకాంక్షను సాధించేందుకు దోహదపడగలదు' అని తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి కేటీఆర్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. 'అమర రాజా ఈ-హబ్ పేరిట అధునాతన పరిశోధన, ఇన్నోవేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాం. అని ఈ సందర్భంగా అమర రాజా బ్యాటరీస్ సీఎండీ జయదేవ్ గల్లా ఈ సందర్భంగా తెలిపారు.

ఏపీకి కట్టుబడి ఉన్నాం..

ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలు తగ్గించుకోవడం లేదని, రాష్ట్రానికి కట్టుబడి ఉన్నామని జయదేవ్ చెప్పారు. తిరుపతి, చిత్తూరు సైట్లు గరిష్ఠ స్థాయికి చేరాయని, కీలకమైన ఉత్తరాది మార్కెట్‌కు లాజిస్టిక్స్‌పరంగా వెసులుబాటు ఉండే ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నామన్నారు. భారత ఉపఖండం పరిస్థితులకు అనువైన లిథియం-అయాన్ బ్యాటరీలపై చాలా కాలంగా పని చేస్తున్నామని, ఇప్పటికే కొన్ని ద్వి, త్రిచక్ర వాహనాల తయారీ సంస్థలకు లిథియం బ్యాటరీ ప్యాక్‌లను సరఫరా చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, సంస్థ న్యూ ఎనర్జీ బిజినెస్ ఈడీ విక్రమాదిత్య గౌరినేని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాక్షి స్పోర్ట్స్

సెమీఫైనల్లో జ్ఞాన దత్తు

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-15 బాలుర సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ కుర్రాడు తలశిల టంకర జ్ఞాన దత్తు సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. థాయ్‌లాండ్‌లోని నొంతబురిలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జ్ఞాన దత్తు 21-11, 13-21, 21-11తో నాలుగో సీడ్ రాదిత్య బాయువర్ధన (ఇండోనేసియా)పై సంచలన విజయం సాధించాడు. నేడు జరిగే సెమీఫైనల్లో చుంగ్ సియాంగ్ యి (చైనీస్ తైపీ)తో జ్ఞాన దత్తు తలపడతాడు. హైదరాబాద్‌లో చేతన్ ఆనంద్ అకాడమీలో జ్ఞాన దత్తు శిక్షణ తీసుకుంటున్నాడు. అండర్-15 బాలికల డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన తన్వీ రెడ్డి-దుర్గా ఇషా జోడీ క్వార్టర్ ఫైనల్లో 14-21, 25-23, 10-21తో నా యోన్ కిమ్-హై వన్ క్వోన్ (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. అండర్-17 బాలికల సింగిల్స్‌లో భారత్‌కే చెందిన ఉన్నతి హుడా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో ఉన్నతి 21-15, 21-18తో మిన్ జి కిమ్ (దక్షిణ కొరియా)పై గెలిచింది.



జపాన్ ముందుకు... జర్మనీ ఇంటికి

● నాకౌట్ దశకు చేరిన ఆసియా జట్టు
● ఓడినా ముందంజ వేసిన స్పెయిన్
● చర్చకు దారి తీసిన వివాదాస్పద గోల్





దోహా: ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో నాలుగుసార్లు విశ్వ విజేత జర్మనీని చిత్తు చేసిన జపాన్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ అదే దూకుడు కనబర్చి మరో మాజీ చాంపియన్‌ను ఓడించింది. ఫలితంగా వరుసగా రెండో వరల్డ్ కప్‌లో నాకౌట్ దశకు అర్హత సాధించింది. గురువారం అర్ధరాత్రి జరిగిన గ్రూప్ 'ఇ' మ్యాచ్‌లో జపాన్ 2-1 గోల్స్ తేడాతో 2010 విజేత స్పెయిన్‌ను ఓడించి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. జపాన్ తరఫున రిట్సు డోన్ (48వ ని.లో), ఆవో టనాకా (51వ ని.లో) గోల్స్ సాధించగా, స్పెయిన్ జట్టు నుంచి మొరాటా (11వ ని.లో) ఏకైక గోల్‌ను నమోదు చేశాడు. మరోవైపు ఈ మ్యాచ్‌లో ఓడినా స్పెయిన్‌కు నష్టం జరగలేదు. రెండో స్థానంతో స్పెయిన్ ముందంజ వేసింది. పాయింట్ల సంఖ్యలో జర్మనీతో సమానంగానే నిలిచినా...గోల్స్ అంతరంలో జర్మనీని స్పెయిన్ వెనక్కి తోసింది.

బంతి స్పెయిన్ ఆధీనంలోనే ఉన్నా...

మ్యాచ్ ఆరంభం నుంచి స్పెయిన్ దూకుడు కనబర్చింది. 11వ నిమిషంలోనే వచ్చిన అవకాశాన్ని స్పెయిన్ సమర్థంగా ఉపయోగించుకుంది. సీజర్ అజ్‌పిలిక్యూటా ఇచ్చిన క్రాస్ పాస్‌ను హెడర్ ద్వారా మొరాటా గోల్‌గా మలిచాడు. అయితే రెండో అర్ధ భాగంలో జపాన్ ఒక్కసారిగా చెలరేగింది. 142 సెకన్ల వ్యవధిలో ఆ జట్టు రెండు గోల్స్‌తో ముందంజ వేసింది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన రిట్సు అనూహ్యంగా స్పెయిన్ ఆటగాళ్లందరినీ తప్పించి కొట్టిన కిక్‌కు కీపర్ ఉనై సైమన్ వద్ద జవాబు లేకపోయింది. కొద్ది సేపటికే టనాకా కొట్టిన గోల్ స్పెయిన్ నివ్వెరపోయేలా చేసింది. జపాన్ చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. మ్యాచ్ మొత్తంలో కేవలం 17.7 శాతం సమయం మాత్రమే బంతి జపాన్ ఆధీనంలో ఉంది. వరల్డ్ కప్ చరిత్రలో అతి తక్కువ సమయం బంతిని ఆధీనంలోకి ఉంచుకొని మ్యాచ్ నెగ్గిన జట్టుగా జపాన్ రికార్డు నెలకొల్పింది.

జర్మనీ గెలిచినా...

2018లోనూ గ్రూప్ దశకే పరిమితమైన జర్మనీ వరుసగా రెండోసారి నాకౌట్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. చివరి మ్యాచ్‌లో జర్మనీ 4-2 తో కోస్టారికాపై నెగ్గింది. జర్మనీ తరఫున జ్నాబ్రీ (10వ ని.లో), హావెర్జ్ (73వ, 85వ ని.లో), ఫలర్గ్ (89వ ని.లో) గోల్స్ సాధించగా... కోస్టారికా ఆటగాళ్లలో తెజెదా (58వ ని.లో), నూయెర్ (70వ ని.లో) గోల్స్ కొట్టారు. టోర్నీ తొలి మ్యాచ్‌లో జపాన్ చేతిలో ఓడటంతోనే జర్మనీ అవకాశాలకు గండి పడింది. స్పెయిన్‌తో మ్యాచ్ 'డ్రా' చేసుకోవడంతో ఇక్కడ భారీ తేడాతో గెలవాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకు 4-2 సరిపోలేదు.



బంతి గీత దాటిందా...లేదా..!

జపాన్ సాధించిన రెండో గోల్ వివాదాస్పదంగా మారింది. రిట్సు కొట్టిన కిక్‌తో బంతి స్పెయిన్ గోల్‌పోస్ట్ ఎడమ వైపునకు వెళ్లింది. అయితే దానిని వెంబడించిన మిటోమా బంతిని నియంత్రణలోకి తెచ్చుకొని వెనక్కి తోశాడు. అక్కడే సిద్ధంగా ఉన్న టనాకా దానిని గోల్‌గా మలిచాడు. అయితే అసిస్టెంట్ రిఫరీ గోల్ చెల్లదని ప్రకటించాడు. బంతి 'బైలైన్'ను దాటేసిందని, ఆ తర్వాతే మిటోమా వెనక్కి తోశాడు కాబట్టి గోల్‌ను గుర్తించలేదు. అయితే ఇది వీడియో అసిస్టెంట్ రిఫరీ (వార్) వద్దకు వెళ్లింది. ఎన్నో కోణాల్లో రీప్లేలు చూసి తర్జనభర్జనల అనంతరం గోల్ సరైందేనని, బంతి ఇంకా గమనంలోనే ఉందన్న రిఫరీ గోల్‌ను గుర్తిస్తున్నట్లు ప్రకటించాడు. అయితే ఇదే వివాదంగా మారింది.

రీప్లే తొలి యాంగిల్ నుంచి చూస్తే బంతి లైన్ దాటేసినట్లే స్పష్టంగా కనిపిస్తోంది. కానీ తర్వాతి టాప్ యాంగిల్‌లో మాత్రం ఇంకా లోపలే ఉన్నట్లుగా ఉంది. భౌతిక శాస్త్రం ప్రకారం చెప్పాలంటే 'ప్యారలాక్స్ ఎర్రర్' (వేర్వేరు కోణాల్లో చూసినప్పుడు వస్తువు యొక్క స్థానంలో కలిగే తేడా-దృష్టి విక్షేపం) ప్రభావమిది. ఇక్కడ సరిగ్గా అదే పని చేసింది. పైనుంచి చూస్తే బంతిలో కొంత భాగం లైన్‌పైనే ఉన్నట్లుగా ఉంది. 'ఫిఫా' నిబంధనలను బట్టి దీనినే చివరకు సరైందిగా నిర్ధారించారు.

ప్రపంచకప్‌లో నేడు (ప్రీక్వార్టర్ ఫైనల్స్)

నెదర్లాండ్స్ x అమెరికా
రాత్రి గం. 8:30 నుంచి

అర్జెంటీనా x ఆస్ట్రేలియా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

గ్రూప్ 'ఇ' పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	పా
జపాన్	3	2	0	1	3	3	6
స్పెయిన్	3	1	1	1	9	3	4
జర్మనీ	3	1	1	1	6	5	4
కోస్టారికా	3	1	0	2	3	11	3

తొలిసారి మహిళా రిఫరీలు

వరల్డ్ కప్‌లో చారిత్రాత్మక ఘట్టం చోటు చేసుకుంది. జర్మనీ, కోస్టారికా మ్యాచ్‌కు ముగ్గురు మహిళలే రిఫరీలుగా వ్యవహరించడం విశేషం. పురుషుల ప్రపంచకప్ మ్యాచ్‌లో ఇలాంటిది జరగడం ఇదే మొదటిసారి కాగా... స్టెఫానీ ఫ్రాపర్ట్ (ఫ్రాన్స్) ఫీల్డ్ రిఫరీగా, న్యూజా బ్యాక్ (బ్రెజిల్), కరెన్ డియాజ్ (మెక్సికో) అసిస్టెంట్ రిఫరీలుగా ఈ ఘనతలో భాగమయ్యారు. తదుపరి మ్యాచ్‌ల్లో సలీమా ముకన్‌సంగా (రువాండా), యోషిమి యామషిటా (జపాన్) కూడా ఫీల్డ్ రిఫరీలుగా వ్యవహరించనున్నారు. 38 ఏళ్ల స్టెఫానీ 2019లో లివర్‌పూల్, చెల్సీ జట్ల మధ్య యూరోపియన్ కప్ పురుషుల సూపర్ కప్ ఫైనల్లో, 2020లో చాంపియన్స్ లీగ్ మ్యాచ్‌లో, గత సీజన్‌లో ఫ్రెంచ్ కప్ ఫైనల్లోనూ రిఫరీగా వ్యవహరించింది.



నాకౌట్‌కు దక్షిణ కొరియా

● పోర్చుగల్‌పై 2-1తో విజయం
● గెలిచినా... నిష్క్రమించిన ఉరుగ్వే



దోహా: గత రెండు ప్రపంచకప్‌లలో గ్రూప్ దశకే పరిమితమైన దక్షిణ కొరియా ఈసారి సత్తా చాటింది. కీలకమైన చివరి లీగ్ మ్యాచ్‌లో చెలరేగి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. పోర్చుగల్‌తో జరిగిన గ్రూప్ 'హెచ్' పోరులో కొరియా 2-1తో గెలిచింది. మ్యాచ్ 5వ నిమిషంలోనే హోర్టా గోల్ సాధించి పోర్చుగల్‌ను ఆధిక్యంలో నిలిపాడు. అయితే కొరియా తరఫున 27వ నిమిషంలో కిమ్ యంగ్ గ్వాన్ గోల్ చేసి స్కోరును సమం చేయగా...మ్యాచ్ చివర్లో వాంగ్ హీ చాన్ చేసిన అద్భుతమైన కౌంటర్ అటాక్ గోల్ (90+1వ నిమిషంలో)తో కొరియా దూసుకుపోయింది. గ్రూప్‌లో ఈ మ్యాచ్‌కు ముందే 2 విజయాలు సాధించి నాకౌట్ చేరిన పోర్చుగల్‌తో పాటు రెండో జట్టుగా కొరియా ముందంజ వేసింది. ఘనాతో మ్యాచ్ ముగిశాక రిఫరీతో వాగ్వాదం చేసినందుకు ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటుకు గురైన కొరియా కోచ్ పౌలో బెంటో ఈ మ్యాచ్‌ను ప్రేక్షకుల గ్యాలరీల్లో కూర్చొని చూశారు.

ఘనా ఓటమి

గత ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన మాజీ చాంపియన్ ఉరుగ్వే ఈ సారి గ్రూప్ దశకే పరిమితమైంది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఉరుగ్వే 2-0 తేడాతో ఘనాను ఓడించింది. జట్టు తరఫున గియార్గియాన్ డి అరాస్కెటా ఒక్కడే రెండు గోల్స్ (26వ, 32వ నిమిషంలో) కొట్టాడు. అయితే ఉరుగ్వే ముందంజ వేసేందుకు ఈ గెలుపు ఉపయోగపడలేదు.


గ్రూప్ 'హెచ్' పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	పా
పోర్చుగల్	3	2	0	1	6	4	6
కొరియా	3	1	1	1	4	4	4
ఉరుగ్వే	3	1	1	1	2	2	4
ఘనా	3	1	0	2	5	7	3

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, చే.గో-చేసిన గోల్స్, ఇ.గో-ఇచ్చిన గోల్స్, పా-పాయింట్లు

కొరియా, ఉరుగ్వే 4 పాయింట్లతో సమానంగా నిలిచాయి. గోల్స్ అంతరం కూడా '0'తో సమం అయింది. దాంతో జట్టు చేసిన గోల్స్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. కొరియా 4 గోల్స్ చేయగా, ఉరుగ్వే 2 గోల్స్ మాత్రమే చేసింది. దాంతో కొరియా ముందంజ వేయగా ఉరుగ్వే నిష్క్రమించింది. ప్రపంచకప్ చరిత్రలో ఆసియా ఖండం నుంచి ఒకేసారి మూడు జట్లు (జపాన్, కొరియా, ఆస్ట్రేలియా) నాకౌట్‌కు అర్హత సాధించడం విశేషం.

భారత మహిళల టి20 జట్టులో అంజలి శర్వాణి



న్యూఢిల్లీ: కొంతకాలంగా దేశవాళీ క్రికెట్‌లో తన ఎడంచేతి పేస్ బౌలింగ్‌తో నిలకడగా రాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి కేశవరాజుగారి అంజలి శర్వాణి తొలిసారి భారత టి20 జట్టులోకి ఎంపికైంది. ఆస్ట్రేలియా జట్టుతో ముంబైలో ఈనెల 9 నుంచి జరిగే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనే భారత జట్టులో అంజలికి చోటు లభించింది. కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన 25 ఏళ్ల అంజలి ఇటీవల జాతీయ సీనియర్ మహిళల టి20 టోర్నీలో ఇండియన్ రైల్వేస్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ 17 వికెట్లతో టాపర్‌గా నిలిచింది.

ఇంగ్లండ్ 657 ఆలౌట్

రావల్పిండి: ఇంగ్లండ్, పాకిస్తాన్‌ల మధ్య జరుగుతున్న తొలి టెస్టులో మూడో రోజే వెయ్యి పరుగులు నమోదు కానున్నాయి. నిస్సారమైన పిచ్‌పై బౌలర్ల శ్రమంతా నీరుగారిపోతోంది. ఓవర్‌నైట్ స్కోరు 506/4తో శుక్రవారం రెండోరోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 101 ఓవర్లలో 657 పరుగుల వద్ద ఆలౌటైంది. తొలిరోజే శతక్కొట్టిన హ్యారీ బ్రూక్ (153; 19 ఫోర్లు, 5 సిక్సర్లు) రెండో రోజు మరో 52 పరుగులు జోడించాడు. స్టోక్స్ (41; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), విల్ జాక్స్ (30; 4 ఫోర్లు), ఒలీ రాబిన్సన్ (37; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. పాకిస్తాన్ బౌలర్లలో 33 ఓవర్లేసి 235 పరుగులిచ్చిన జాహిద్ 4 వికెట్లు పడగొట్టాడు. తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన పాకిస్తాన్ ఆట నిలిచే సమయానికి 51 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 181 పరుగులు చేసింది. ఓపెనర్లు అబ్దుల్లా షఫీక్ (89 బ్యాటింగ్; 10 ఫోర్లు, 2 సిక్సర్లు), ఇమామ్ ఉల్ హక్ (90 బ్యాటింగ్; 13 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీల దిశగా సాగిపోతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.


CMR
వార్షికోత్సవ సేల్
OFFER PERIOD : 2 - 12 DEC 2022
T&C Apply
బంగారు ఆభరణాలపై
50%*
వరకు V.A. తగ్గింపు
CMR
JEWELLERY
For your golden moments !
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ
3*% నుండి
బంగారు ఆభరణాలపై V.A.
10%
రాళ్ళ ఖరీదుపై తగ్గింపు
తరుగు మజూరీ లేదు
సిల్వర్ రెగ్యులర్ ఆర్టికల్స్ పై
చైన్లు 3% నుండి V.A.
గాజులు 4% నుండి V.A.
హారాలు 7% నుండి V.A.
నెక్లెస్ 7% నుండి V.A.
నల్లపూసలు 9% నుండి V.A.
ఇయర్ రింగ్స్ 9% నుండి V.A.
రింగ్స్ 9% నుండి V.A.
www.cmrjewellery.com
CMRJewelleryIndia
CMRJewellery
916 22 CARAT
18K GOLD
LOW V.A.
HALLMARK GOLD
THE MOST TRUSTED JEWELLER SINCE 4 DECADES
నేటి సులభ కొనుగోలు ప్రణాళిక రేపటి బంగారు ఆభరణములు కొనుగోలుకు మలుపు ...
కనకధారా
బంగారు ఆభరణాల పై
100%* తరుగు లేదు
10%* తగ్గింపు
మొదటి నెల ముందస్తు చెల్లింపు పై
ఆకర్షణీయమైన బహుమతి కలదు
OR
తరుగు మజూరి లేదు
సిల్వర్ రెగ్యులర్ ఆర్టికల్స్ పై